# అసుర సంధ్య

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

[గతసంచిక తరువాయి]

"మారటం.. పరిపూర్ణత్వం, నిండుదనం రావటం"

అతని కళ్లల్లోని ఆరాధన గుర్తించింది కాబోలు, పద్మమణి నవ్వింది....

ఆనవ్వుతో శ్రీధర్ తెప్పిరిల్లాడు. సిగ్గు పడ్డాడు. మళ్లీ యీ లోకంలో పడటంతో తను అన్న మాటలు ఏ లోకంలో ఎలా అన్నాడో, వాటి పూర్తి అర్థ మేమిటో, అసలు అవి ఆమెతో ఎందుకు అనవలసి వచ్చిందో అతనికి అవగాహన కానే లేదు. తనలో తనే ప్రశ్నించు కుంటున్నాడు. ఈ పద్మమణి ఎదుట తనేమీ దాచుకో లేదు. తలచు కుంటే, తన హృదయంలో బలవంతాన సరాసరి మాట్లాడ గల వింత శక్తి ఏదో ఈమెలో వుంది. ఆ విషయం స్పష్టమైంది అతనికి...

"ఎందు కంత సిగ్గు పడేవారు ఆరోజుల్లో? నేనంటే వీరాకిష్టమని మీరు నావైపు చూచినా నావెనుక నడచినా నాకు తెలుస్తూనే వుండేది! మీరెప్పుడో ఒక సారి మాట్లాడక పోతారా అనుకునే దాన్ని! ఎన్నాళ్లని! సిగ్గు కాదు, తెలివైన వాణ్ణన్న గర్వమేమో, యీ పిల్ల నన్ను పలకరించక పోతుందా అని బెట్టు చెయ్యటమేమో అనుకునే దాన్ని!... నాకు పెళ్లయి లోకం తెలిశాక కాని మీరు పూర్తిగా అర్థం కాలేదు నాకు!" అంటోంది పద్మమణి. ఆమె చూపులు బాణాలు కావు యిప్పుడు, నిశా ప్రశాంత సరోవరాల నీటి తళుకులు, ఆకుల మీద నుండి చీకట్లో జారే వెన్నెల కిరణాలు...

"పెళ్లయ్యాక ఏమిటి అర్థమైంది?" అని ప్రశ్నించాడు శ్రీధర్.

"పెళ్లయ్యాక మీకు ఏమీ అర్థం కాలేదా? అని తిరుగు ప్రశ్నించింది పద్మమణి.

"ఆడవాళ్లని నమ్మటానికి వీల్లేదని, వాళ్లతో పెట్టు కోవటం గొడవ గొడవ అనీ అర్థ మైంది."

"పాపం !" అని చిరు నవ్వు నవ్వుతూ అతని వైపు చూస్తూ కూర్చుంది పద్మమణి.

"నీక్కావల్సిన వడ్లేవో చలమయ్యతో చెబితే వచ్చేవి కదా! నన్ను బాధించటం దేనికీ?"

"చిన్న నాటి స్నేహితుడవని!"

"ఏమిటి ఆస్నేహానికి విలువ, అర్థం?"

"అలాంటి ప్రశ్నలు నాకేం తెలుస్తాయి? నేనేం కాలేజిలో చదువుకో లేదు..."

"కాని పెళ్లయాక లోకం తెలిశాక అర్థం అయింది కదా!"

పద్మమణి మౌనం వహించింది. ఆమె కన్నుల్లో నీళ్లు తిరిగాయి. తొనక్కుండా కళ్లు తుడుచుకుని లోపలికి వెళ్లింది.

శ్రీధర్ ఆమెను గమనిస్తూనే వున్నాడు.

తుపానులో చిక్కుకున్న నావలా వుంది అతని హృదయం. ఒక వైపు లేచి వెళ్లి పోదా మన్న వూహ; మరొక వైపు లేవలేని అశక్తత.

కాలం గడుస్తోంది.. పద్మమణి యింకా తిరిగి రాలేదు..

తార..చంద్రావతి ... ఏం తెలుసుకో గలరు ఆడవాళ్ల ట్రాజెడీలు ఈ మగవాళ్లు? పద్మ సంగతేమిటో ఆమె మంచే తెలుసుకో గూడదా తను? తప్పా?.. ఎవరు, ఎవరీ పద్మ?..పద్మ! పద్మమణి!

పద్మమణి కాఫీ తెచ్చి యిచ్చింది.

"కాఫీ నువ్వే తయారు చేశావా? సత్యమా?"

"నేనే.. సత్యమెందుకు చేస్తాడు? మా అమ్మ చేస్తూంటుంది."

"మీ అమ్మ యిక్కడే వున్నారా? కనిపించ లేదే?"

"ఈసారి వచ్చి నప్పుడు పరిచయం చేస్తాను. పాపను తీసుకొని ఎవరింటికో వెళ్లింది"

"సత్యం, పాప, యిద్దరూ నీపిల్లలా?"

"ఊఁ"

"సత్యం నీకెప్పుడు కలిగాడు?"

పద్మమణి నవ్వుతోంది "ఏం ప్రశ్నలు ఎడ తెగకుండా? అడగటం ప్రారంభిస్తే యిక అంతూ పొంతూ వుండక్కర్లా?"

"సత్యం నీకొడుకు కాదు."

"అవును, మా ఆయన కొడుకు"

"అంటే?"

"నన్ను రెండో పెళ్లి సంబంధాని కిచ్చారు. అప్పటికి ఆయనకి మూడేళ్ల కొడుకున్నాడు.. ఆయన పోయాక వాడిప్పుడు నాకొడుక్కాక మరే మవుతాడు?"

"పాప?"

"పా—ప! ఏమిటా ప్రశ్నలు? నేనింక సమాధానాలు చెప్పను"

"చెప్పక పోతే చలమయ్య చెబుతాడు. కానీ నాకు వాటిని వినాలని వుండదు."

"ఎందుకని? చలమయ్య చెప్పేవన్నీ నిజమే తుచ తప్పకుండా..."

"రాఘవరావు పెద్ద సంస్కర్త! నిన్నెందుకు పెళ్లి చేసుకో లేదు?"

"ఆయన్నేమీ అనకండి! సంస్కర్త అయినా హృదయ మున్న మనిషి; మంచి మనిషి; గొప్ప వాడు."

"ఏమిటా గొప్ప? పెళ్లి చేసుకునే ధైర్యం లేక పోయింది.. నీకు ఆస్తి పెట్టి పోయాడని కృతజ్ఞత కాబోలు"

"ఏం? అది గొప్పదనం కాదా? కొన్ని పరిస్థితుల్లో ఆయన విధిలేక పెళ్లికి ఒప్పుకుని కూడా వుండ వచ్చు. పెళ్లి చేసి కుంటే ఆస్తి ఎలాగు యివ్వాలి. అప్పుడది ఏం గొప్ప? ఏనిర్బంధమూ లేక పోయినా ఆస్తి యివ్వారంటే అందులోనే ఆయన మంచి తనం తెలుస్తోంది కదా?"

"నువ్వెందుకు పెళ్లిచేసుకొమ్మని అడగలేదు?"

"మన యింగ్లీషు మేష్టారు ఏ సందర్భంలో నైనా సరే తరచు ఒక వాక్యం ఉపయోగించేవారు జ్ఞాపకం వుందా? Beggers can not be choosers.'

"అంటే నువ్వు ప్రేమ భిక్ష అడిగావా?"

"ప్రేమ భిక్షా కాదు, ఆస్తి భిక్షా కాదు! జీవితం పెట్టే భిక్ష తప్ప... ప్రేమా, ఆస్తీఅంటూ ఎన్నుకోవటం ఎక్కడుందీ? జరిగేవి జరుగుతాయి. నా పెళ్లి నేను కోరు కుంటే జరిగిందా? రాఘవరావు గారూ అంతే!... కాని ఆయన నన్నొక వ్యక్తిని చేశారు. జీవితం మీద నాకిప్పుడు కొంత అధికారం వుంది."

"అందుకని నన్నిప్పుడు వడ్లు తెమ్మని పురమాయిస్తున్నావ్!"

"ఏం? ఎందుకు అడగ కూడదు? ప్రేమకూ డబ్బుకూ అంత వైరుధ్యమెందుకూ? తల్లిదండ్రులు పిల్లల మీద డబ్బు ఖర్చు పెట్టకుండానే ప్రేమ చూపిస్తున్నారా? పిల్లలు వాళ్లనుంచీ ఆస్తి పాస్తులు ఆశించ కుండానే ప్రేమిస్తున్నారా? తెచ్చుకోవలసింది ఎప్పుడో ఒకప్పుడు జీవితం మీద అధికారం.. అంత దాకా యితరుల ప్రేమ మీదా ఆస్తి మీదా ఆధార పడవలసిందే, తప్పదు!"

"అయితే డబ్బుంటే జీవితం మీద అధికారం వస్తుందంటావ్."

"డబ్బుకు కూడా లొంగి పోకూడదు. అప్పుడే జీవితం మీద అధికారం."

"నువ్వడుగుతున్న వడ్లకి నేను మంచి ధర కోరుతున్నాను. అప్పుడు నీ అధికార మేమైంది? వడ్లు పంపించటం నాకిష్టం లేదు, అప్పుడు?"

"మరీ చిన్నపిల్లాడిలా అడుగు తున్నారు. మంచి ధర అంటే న్యాయమైన ధర, నేనివ్వగలిగిన ధర, యివ్వటానికి సిద్ధంగానే వున్నాను! మీకు పంపించటం యిష్టం లేక పోతే ఏం చేస్తాను? అది మీ యిష్టం.. వూరుకుంటాను."

"అయితే ఆలోచించ వలసిందే!"

"ఇందులో ఆలోచించే దేమిటి? ఇష్టముంటే పంపుతారు లేక పోతే లేదు. అంత సందేహించేట్టయితే పంపకండి"

"అది కాదు మా అన్నని అడగాలి కదా."

"మీరు వేరు పడ్డారటగా.. చలమయ్య చెప్పాడు?"

"అయినా ఆయనదే పెత్తనం!.. ఇన్నాళ్లూ చలమయ్య ధాన్యం సంగతి చూచేవాడా?"

"చెప్పవలసిన ప్రశ్నలన్నిటికి సమాధానం చెప్పాను, ఈ అర్థం లేని మాటకూ చెప్పాలా? ఇక ప్రశ్నలు లేవు... ఇన్నాళ్లూ నాకు పొలముండేది; పొలం అమ్మేశాను.. చాలా?"

పద్మమణి కంఠంలో ధ్వనించిన అధికారానికీ, తన చాపల్యానికీ శ్రీధర్ సిగ్గు పడ్డాడు. ఆమె కాఫీ గ్లాసు తీసుకుని లోపలికి వెళ్లి పోయింది. చిట్ట చివర ఆమెకు కోపం వచ్చిందని పించింది. పద్మమణి తిరిగి వచ్చి "నేను వంట చెయ్యాలి. ఇక మీరు వెళ్లి నెమ్మదిగా మీ అన్న గార్ని అడిగి వడ్లకి ధర కట్టి మీ కిష్టం వుంటే పంపండి, లేక పోతే మానెయ్యండి.సెలవు" అని సమాధానం కోసం ఎదురు చూడ కుండా లోపలికి వెళ్లి పోయింది.

సూర్యాస్తమయమయింది. ఇంటింటా దీపాలు పెట్టారు. ఆ దీపాల కాంతిలో ఏదో ఆనంద రేఖ, క్రొత్త ఉత్సాహం మనస్సుకి తగులు తోంది. ముసురుతున్న చీకట్లలో ఇటు నటు వెడుతున్న జనాన్ని గమనించకుండా, దీపాల్ని ఒక్కొక్క దాన్నీ చూచి కళ్లు చికిలిస్తూ వీధులు దాటు తున్నాడు శ్రీధర్. కళ్లు చికిలించినప్పుడల్లా దీపాలు తనలో నవ్వుతూ సరాగా లాడుతున్నాయి... "నిజం చెప్పండి.. నేను మారానా?... ఎందులో మారాను?.. ఎట్లామారాను?..." అను కుంటున్నప్పుడల్లా హృదయం గంతులేస్తోంది. గబగబా నడచి వూరి బయటగా వున్న స్కూలూ, దాని కెదురుగా వున్న చెరువు కట్టా చేరుకున్నాడు. చెరువు కట్ట మీద కొంత సేపు నడచి, తర్వాత స్కూలు ఆవరణలో ప్రవేశించి స్కూలు చుట్టూ వూరికే తిరిగాడు.. పద్మమణి ఓణీ వేసుకొని టెన్నికాయిట్ ఆడుతూ, తెల్లని ఎండలో స్వచ్ఛమైన సౌందర్యంతో స్కూలుకు గబగబా నడచి వస్తూ, మెల్లగా అడుగులు వేసు కుంటూ విలాసంగా జడ అల్లు కుంటూ గేమ్సు తర్వాత యింటికి వెడుతూ...అక్కడే ఆ ప్రదేశం నిండా కనిపిస్తోంది... "ఎందు కంత సిగ్గు పడే వారు ఆ రోజుల్లో?.. నాకు తెలుస్తూనే వుండేది... మీరెప్పుడో ఒక సారి మాట్లాడక పోతారా అను కునేదాన్ని!..." అప్పుడు మాట్లాడి వుంటే, జీవితం ఎట్లా మారి పోయి వుండేదో యిద్దరికీ!

ఇప్పుడు?...ఇప్పుడు?....ఇప్పుడు?

పెళ్లయింది.. లోకం తెలిసింది...

డబ్బుకు లొంగి పోకూడదు.. అప్పుడే జీవితం మీద అధికారం!

కబుర్లు!... తను లొంగి పోలేదూ డబ్బుకోసం రాఘవరావుకి?.. శ్రీధర్‌కి హృదయం బ్రద్ధలయ్యేలా ఏడవాలనిపించింది చీకటినీ, నిశ్శబ్దాన్నీ, గతాన్నీ, ఏకాంతాన్నీ చీలుస్తూ...

డబ్బు! డబ్బు! తార పెంకె తనానికీ, తండ్రి మరణానికీ ఆస్తి పంపకానికీ, తను ఓబయ్య మామ చేతిలో కీలు బొమ్మ కావటానికీ, రెండు వేలు.. కాదు...ఒక వంద రూపాయల కోసం మంగమ్మను చేజాచటం, అదే ఓం ప్రథమం తన బానిసత్వానికి... ఆ వంద రూపాయల వెనుకా ఒక కథ... దాన్ని తండ్రితో చెప్పటానికి భయపడటం...నాగరాజు దగ్గర తన డబ్బు పుచ్చుకోక పోవటమే యీ చరిత్ర కంతటికీ మూలాధారమా!! డబ్బు పుచ్చు కోవటం కాదు (ఓబయ్య దగ్గర) డబ్బు, తన డబ్బు, తను తిరిగి పుచ్చుకోక పోవటమే (నాగరాజు దగ్గర)— అదే తను చేసిన అపరాధమా? ఏమిటీ కార్యకారణ సంబంధం? ఇది నిజమా? మరి హేతు పద్ధతిని అన్వయించి చూస్తే నిజమే !! చరిత్ర యిలా కాక ఎలా వ్రాస్తారు? అయితే చరిత్రలో యీ కార్య కారణ పద్ధతిని నిగ్గుదేల్చి 'సత్యా'లన్నీ— అని మనం చెబుతున్నవి— ఏం మహా 'సత్యా'లు! అసత్యాలే అనుకోవాలి! కార్యకారణ సంబంధం ఒక పేక మేడ! లేక పోతే నాగరాజు దగ్గర తను పుచ్చుకోక పోయిన వంద రూపాయలకూ తను ప్రస్తుతం అనుభవిస్తున్న వైఫల్యానికి ఏమిటీ సంబంధం!

ఇప్పుడా నాగరాజుని "ఏమయ్యా! నా వందా నా కిచ్చేయ్! నీమంచి చెడ్డలు నీవి!" అని అడిగితే— ఎక్కడున్నాడో నాగరాజు!— ఒకవేళ అతను యిస్తే మాత్రం జరిగిన వన్నీ జరగనట్లే అయి తన పూర్వ చరిత్ర మారుతుందా? చరిత్రను కార్యకారణ పద్ధతితో విశ్లేషించి నేర్చుకునే పాఠాలు ఎందుకు పనికొచ్చేట్టు? ఎందుకూ పనికి రావు! నవ్వుకోటానికి లేక ఏడ్చుకోటానికీ తప్ప!

ఈ పేక మేడ ఎలా నైనా మరో స్వరూపంలో— మధ్యలో కొన్ని చేర్పులతో మార్పులతో వేరుగా ఏర్పడి వుండటానికి అవకాశం వుందా? ఉదాహరణకి ఆ వంద రూపాయల్ని గురించీ తను తండ్రితో నిజం చెప్పి వుంటే? — తండ్రి బహుశా ఆకథ నమ్మి వుండడు; నాగరాజు చేసిన పాడు పని ఆవందతో తనే చేసి వచ్చి, అలా వాడి మీద చెప్పానని అనుకునే వాడు! పోనీ తను ఆ వందా మంగమ్మత్త దగ్గర పుచ్చుకుని కూడా తర్వాత ఆమె ముఖం చూడక పోతే?— అదంత సులువైన సంగతిగా కనిపించదు!.. అంటే ఈ చరిత్ర మరోలా తయారు కావటానికి తనే మరో తరహా వ్యక్తి అయ్యుండాలి! ఈ చరిత్రకు తనకూ అవినాభావ సంబంధం... ఈ చరిత్రే తను, తనే యీ చరిత్ర!.. ఇందులో మూలాధారమైన కారణం ప్రతి స్టేజీలోను తనూ తన వ్యక్తిత్వం తప్ప— నాగరాజు దగ్గర డబ్బు పుచ్చుకోక పోవటం అనే ఒకానొక చారిత్రక సంఘటన కాదు!

పద్మమణితో ఒక్క సారి కూడా ఆ రోజుల్లో మాట్లాడక పోవటానికి కూడా పరిస్థితులు కాదు, తన సిగ్గూ బెరుకూ ఏదో తన వ్యక్తిత్వం లోని గుణం అంటే 'తను' 'మూలకారణం!'

ఎవరీ 'తను'? ఎలా యీ 'తను'ని గుర్తించటం? జరిగిన చరిత్ర ద్వారా గుర్తించినా, భవిష్యత్తులో యీ 'తను' స్వరూపం ఎలా వుంటుందో నిశ్చయ మేమిటీ?

పద్మమణి తనను యిప్పటికీ ఆకర్షిస్తూనే వుంది. తనకు పద్మమణి జీవితంలో అందుకో దగిన పరమార్థమా? ఎవరినైనా అడిగితే, "ఛీ! ఛీ! మంచి వాడివి చెడి పోతున్నావ్"అంటారు. పరమార్థమో కాదో ఎలా తెలుసుకోవటం? చిరకాల వాంఛితం కావటం వల్లనా, ఆమె కళ్ళు తనని మంత్ర ముగ్ధుణ్ణి చేసి ఆమె వైపు లాక్కుంటూ వుండటం వల్లనా, లేక స్నేహం ప్రేమ గొప్ప విలువలు కావటం వల్లనా? దేన్ని బట్టి, ఏ ఆదర్శాన్ని బట్టి, తనలో కలిగిన యీ ఆనందాన్ని, యీ ఆశను యీ అనుభవాన్ని రెండు చేతులా స్వీకరిస్తూ దానికి తన జీవితాన్ని తన వ్యక్తిత్వాన్ని అంకితం చెయ్యాలి?

ఇది యిలా తేలే సమస్య కాదు. దీనికి సమాధానం లేదు. పై కారణా లేవీ తనకు నచ్చ లేదు, నచ్చలేదని ఆనందాన్ని, అనుభవాన్ని త్రోసి పుచ్చటానికీ మనస్కరించటం లేదు, స్వీకరించేందుకు అంగీకరించేందుకూ ఏవిధంగా చూచినా (ధర్మం, ఆదర్శం, దృష్ట్యా) సమర్ధనమే లేదు!.. తను ఏం చెయ్యాలి?.. జవాబు లేదు!

చంద్రోదయ మైంది. చంద్రుణ్ణీ నక్షత్రాల్నీ ప్రశ్నించాడు. "నే నేం చెయ్యాలి? నే నెందుకు జీవిస్తున్నాను? నే నెవరు?" ప్రకృతిలో చంద్రుడికీ నక్షత్రాలకీ, కొండలకీ చెట్లకీ, పక్షులకీ మృగాలకీ అస్తిత్వాన్ని గూర్చిన విచికిత్స లేక పోవటం ఎంత హాయి, ఎంత సుఖం! అందుకే విషాద మనేది మానవునికి ప్రత్యేకం కాబోలు!

చలి వేస్తోంది...ఆకలిగా కూడా వుంది.

శ్రీధర్ యింటికి బయల్దేరాడు.

సరిగా ఆంజనేయ స్వామి గుడి దగ్గర పొలం గట్టు దిగుతూ వుండగా కాలికి ఏమిటో మెత్తగా తగిలి చుట్టేసుకుంది క్షణంలో, తటాలున చేత్తో లాగి దూరంగా విసిరేశాడు. పాము! సందేహము లేదు; మడమకు పై భాగంలో కరచినట్లుగా కూడా వుంది! గుడిలో దీపం వెలుగుతూ వుంది ! కాని గుడి తలుపులు మూసి వేసి వున్నాయి, ఎవ్వరూ లేరు, సహాయ్యం అర్థించడానికి.

చేతి రుమాలు తీసి గాయానికి పై భాగంలో బిగించి కట్టుకుని యింటికి నడిచాడు.

ఇంట్లో చెప్పగానే పాము కాటు వైద్యుడూ, మంత్రగాడూ వచ్చారు. విష సర్పమో కాదో నాగుబామో కాదో తేల్చి చెప్ప లేక పోయారు. హాస్పిటలుకి వెళ్లారు. ఇంజెక్షన్ యిప్పించారు.

"చీకటి పడ్డాక అంత సేపూ అక్కడేం జేస్తున్నట్టు ఒంటరిగా కూచుని?" అని అడుగుతోంది రుక్మిణమ్మ.

"ఏమీ తోచక కూర్చున్నాను".

"ఏమిటో నీ సంగతి! బందరు నుంచి ఉత్తరం వచ్చి ఎన్నాళ్లయింది! వెళ్లి రమ్మంటే వెళ్లక పోతివి! ఇంకా చిన్న

తనమూ, నయానా భయానా చెప్పటానికి? నీపట్టు నీదే గాని చెప్పిన మాట విన్పించు కోక పోతే ఎట్లా?" అంటోంది.

"నేను వెళ్లను వదినా, అంతే!"

ఆ రాత్రికి నిద్రపోగూడ దన్నారు. అప్పటికి కొంత వాపు తప్ప ఏ దుష్ఫలితమూ లేక పోవటంతో విష సర్పం కాదని అందరికీ ధైర్యం కలుగుతోంది. మంత్ర వైద్యుడితో పాటు వచ్చిన చలమయ్య తోడు కూర్చున్నాడు. రెండో సినిమాకి— నిద్ర రాకుండా వుండటానికి—వెళ్దా మంటున్నాడు. రుక్మిణమ్మకూ నరసింహులికీ యిష్టం లేదు. చివరకు నరసింహులు కూడా శ్రీధర్‌తో, చలమయ్యతో సినిమాకి బయల్దేరాడు....

ఇప్పుడు విషమెక్కి చని పోతే ఎలా వుంటుందీ? ఎంతో బావుంటుంది! అని వూహిస్తున్నాడు శ్రీధర్. మృత్యువుని గూర్చి ఆలోచిస్తూంటే అతనిలో దిగులేమీ కలగటం లేదు! జీవితం తనను కాటు వేసింది! ఆ రాత్రి జాగరణలో, చలమయ్య మాటల్లో, రుక్మిణమ్మ పరామర్శలో, అన్నయ్య కబుర్లలో పద్మమణి ధ్యాస ఒక లయగా వర్తిస్తూనే వుంది.!

## 17

రెండురోజుల తర్వాత అన్నయ్యనడిగి శ్రీధర్ పద్మమణి యింటికి అయిదుబస్తాల వడ్లు పంపి వూరుకున్నాడు. వారం రోజులు గడిచాక స్కూల్లో సత్యం అతని దగ్గరకు వచ్చి "అమ్మ వడ్లధర కనుక్కురమ్మంది" అన్నాడు. శ్రీధర్ అతణ్ణి చూస్తూ రెండు క్షణాలు ఆలోచించి, చిరునవ్వుతో "తెలీదు, ధరకట్టలేదు. మీ అమ్మనే తెలుసుకొని పంపించమను" అన్నాడు. మరుసటిరోజు సత్యంవచ్చి "అమ్మ మిమ్మల్ని రమ్మంది" అని కబురు తెచ్చాడు. "నాకివ్వాళ వీలుపడదు" అని వెళ్లిపోయాడు శ్రీధర్.

ఒక నెలరోజులు గడిచాయి. సత్యం ఒకరోజు వంద రూపాయల నోట్లుతెచ్చి "వడ్లడబ్బు, మీకివ్వమన్నది అమ్మ" అంటూ యివ్వబోయాడు. శ్రీధర్ తీసుకోలేదు, "నేను వచ్చి మాట్లాడతానని చెప్పు" అన్నాడు.

ఆ సాయంత్రం వెళ్లాడు.

"ఏమండీ..నెలాపంద్రెండు రోజులు.. లెక్క పెడుతున్నాను..రోజూ చూట్టమే వస్తారని..."

శ్రీధర్ మాట్లాడలేదు.

"డబ్బు వెనక్కి పంపించేశారేమిటి?" అన్నది పద్మమణి.

"ధర అంతేనని ఎవరు తేల్చేరు?

"అందుకేగా మిమ్మల్ని రమ్మన్నదీ!...మీరు వస్తారని ఎదురు చూచిందీ!" పద్మమణి అరమోడ్పు కన్నులతో, ఆకాంక్షతో చూస్తోంది.

"అది యివ్వాళకాదు, ఏళ్లతరబడి నాలో నా మనస్సులో పండిన పంట."

"తెలుసు"

"దానికి నిన్ను ధర కట్టనివ్వను, నాకూ తెలీదు ధర" ఏదో నిశ్చయం ధ్వనించింది ఆ మాటల్లో.

"అలాగే" అన్నది పద్మమణి, వచ్చి దగ్గరగా నిల్చున్నది. "ఆ పంటను నేను కోరటం...మిమ్మల్ని కోరటం...తప్పా? ఎందుకు సందేహించావు?" అన్నది గోముగా.

శ్రీధర్ పద్మవైపు తదేకంగా చూస్తున్నాడు. అతని కన్నుల్లో ఆవేదన పద్మమణి గమనిస్తోంది.

"ఏమో నాకే తెలీదు! ఈ దీపశిఖలో జ్వలించి నశిస్తానో, అమరత్వం పొందుతానో!...నాకు నువ్వు కావాలి...నీలో లీనమై నేను లేకుండా పోవాలి....శరీరంతోకాదు, నా సర్వస్వంతో; నీతో కాదు, నీలోని నీతో...కాని శారీరకంగా దగ్గరకు రావటం శాశ్వతంగా దూరంగా పోవటమౌతుందేమో...జీవితం సృష్టించిన ఒక శూన్యం ఒక పంజరం నన్ను నీకు దూరంగా వుంచుతోంది...దాన్ని దాటలేని నా అశక్తత....."

అతని కన్నులు అశ్రుపూరితాలయ్యాయి.

"ఏమిటండీ యిదంతా! మీదంతా అప్పటికీ యిప్పటికీ విచిత్రమే! నాకర్థం కాదు! పోనిద్దురూ...." ఆమె చీరకొంగు తీసి అతని కళ్లమీద అద్దుతూ "మీకెలా యిష్టమైతే అలానే వుండండి...మిమ్మల్నెవరు ఏమి అడిగారనీ!' అన్నది. శ్రీధర్ ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమె కిలకిలా నవ్వుతూ "ఏం చెయ్యమంటారు మరి?" అన్నది.

"నవ్వవద్దు."

బాగుంది..మీతోపాటు?...నాకు కన్నీళ్లు రావు బాబూ!"

శ్రీధర్ ఆమెను తనవైపుకు లాగాడు. ఆమె అతని మీద వాలిపోయి వెంటనే చెయ్యి విడిపించుకుని దూరంగా పారిపోయింది.

శ్రీధర్ కుర్చీ మీదనుంచీ లేవలేదు. ఆమెవేపు తదేకంగా చూస్తున్నాడు. ఆమె అతనివైపు చూడకుండా అలమారా దగ్గరకు వెళ్లి ఏమిటో సర్దుతోంది, అతనికోసం నిరీక్షిస్తూ. కొన్ని క్షణాల తర్వాత అతనివైపు తిరిగి చూచింది.

అతని ముఖంలో తీవ్రమైన ఆవేదన, కళ్లల్లో అభ్యర్థన, కాంక్ష ఆమె గుర్తించింది.

ఈసారి ఆమె అతని దగ్గరగా రాకుండా దూరంగా కుర్చీల కూర్చుని "ఆరోజు ప్రశ్నలువేసి నాతో సమాధానాలు చెప్పించారు కాని, మిమ్మల్ని గురించి ఒక్కముక్కయినా చెప్పలేదు.భలే గడుసుదనం కదూ!" అన్నది ఓరచూపులతో.

"చెబుతాను వింటావా? నువ్వెప్పుడూ నాయెదురుగా యిలా కూర్చోవాలనీ, నన్ను చూస్తూ వుండాలనీ వుంటుంది... నువ్వు నాకు దగ్గరగా వచ్చి, నన్ను తాకి తపోభంగం చెయ్యకూడదు. అలాచేస్తే నువ్వు నాకు దక్కవు...దక్కేది శరీరం మాత్రమే. అప్పుడు పెళ్లికీ దీనికీ భేదం ఏమిటి?...పెళ్లి నీకూ అయింది, నాకూ అయింది!...అర్థం అవుతోందా? నాకు యీవరం యివ్వాలి నువ్వు!"

"మీనుంచీ నేనేమీ కోరటంలేదు!" అన్నది పద్మమణి కోపంగా, "మీ తపస్సు!..మీ తపస్సు ఎప్పటికైనా పూర్తి అవుతుందా? ముసలితనం వచ్చేలోగా?" నవ్వుతోంది.

"ఇదీ నేను చెబుతానన్న ధర...నువ్వు యివ్వలేకపోతే పోనీ"

"నాకేం తెలుస్తుంది మీ గొడవ! మీ మాటలు నాకు అర్థమే కావటంలేదు, నిజం చెప్పాలంటే...పోనీ యిలానే మాట్లాడుతూ వుండండి యిష్టమైతే...నాకు అర్థం కావటంతో మీకు పనేమిటి? కాని మీ బాధేమిటీ? జరిగిన వాటికి మనం చేసేదేముంది?"

శ్రీధర్ మాట్లాడలేదు...అవును, జరిగిన వాటికి మనం చేసేదేముంది? కాని జరుగుతున్న వాటి సంగతీ?... అనుకుంటున్నాడు.

ఎవరో మెట్లెక్కి వస్తున్న ధ్వని.

"మా అమ్మా, పాపా" అన్నది పద్మమణి.

వెడల్పైన ముఖం, కళ్ళకద్దాలు, పద్మమణి పోలికలున్న ఒక పెద్దావిడా, సన్నగా తెల్లగా ముద్దొస్తున్న పాపాయి వచ్చారు. పద్మమణి పరిచయం చెయ్యటంతో ఆవిడ శ్రీధర్‌ని తేరిపార జూచి తొట్రుపడుతూ 'నమస్కారం' అని, శ్రీధర్ ప్రతినమస్కారం చేస్తూండగానే లోపలికి వెళ్లిపోయింది. పాపాయి పద్మమణి దగ్గరికి వెళ్ళి ఒళ్లో ఎక్కికూర్చుంది.

"పేరేమిటి?" అన్నాడు శ్రీధర్.

"మాయ."

"ప్రపంచం మాయ, అందులో జీవితం, అనుభవం మాయ, అనికాబోలు!"

"అది మీ విషయం అనండి. మాకు అంతా నిజమే. అట్లాంటి వేదాంతాలు తెలీవు."

"ఏం వేదాంతాలా?" అంటూ చలమయ్య అప్పుడే ప్రవేశిస్తూ అడిగారు.

"రండి, కూర్చోండి" అని కుర్చీ చూపిస్తూ పద్మమణి "అమ్మాయి పేరు మాయను గూర్చి. మాయ, వేదాంతం అంటున్నారు."

"మన మిత్రుడికి కాస్త బూర్జువా వేదాంతం ధోరణి వుందిలే" అన్నాడు చలమయ్య. తర్వాత శ్రీధర్ వైపు తిరిగి "ఏమిటి విశేషం? ఇక్కడ వచ్చి కూర్చుని కాలక్షేపం చేస్తున్నావే, బ్రదర్!" అన్నాడు.

ఆ ప్రశ్నలో చలమయ్య తనమీద అధికారమున్నట్లు ధ్వనిస్తూండటమే కాదు, దానిలో గర్భితమైన నీచత్వానికి శ్రీధర్ అసహ్యించుకున్నాడు. అతనికి పద్మమణి మీద కోపం వచ్చింది, ఆమె చలమయ్యను యింటికి రానిస్తూ గౌరవిస్తున్నందుకు. చలమయ్యవైపైనా చూడకుండా పద్మమణిని పలకరించకుండా, లేచి బయటకు వచ్చేశాడు.

మరుసటిరోజు స్కూల్లో చలమయ్య శ్రీధర్‌తో అన్నాడు: "ఏమిటయ్యా మాటాపలుకూ లేకుండా అలా పారిపోయి వచ్చేశావ్. రెండు నిమిషాలాగితే నేనూ వచ్చేవాణ్ణికదా! ధాన్యం డబ్బు కోసం యిక్కడున్నావని అంటే పోయే దేముంది! నాకు తెలీదా నువ్వెలాంటి వాడివైందీ!అయినా జాగ్రత్తగా వుండటం మంచిది. నీ డబ్బు నీకు ముట్టిందా? దాని మాయలో పడేవు జాగ్రత్త!"

శ్రీధర్ సందేహించాడు.

"ఏమిటి పలకవు? నీ యిష్టంబాబూ, మళ్లీ చెప్పలేదనేవు!"

శ్రీధర్ కోపంతో కుంచించుకుపోయాడు.

ఇది జరిగిన పదిరోజులకు శ్రీధర్ స్కూల్లో వుండగా ఓబయ్యగారు వచ్చి "శ్రీధర్ మీ మామగారూ, తారా, పిల్లలూ వచ్చారు, ఇంటికి వెళ్దాంరా.' అన్నాడు.

"ఎప్పుడు? ఏరీ? ఉత్తరంలేదే!" ఆశ్చర్యపోయాడు శ్రీధర్.

"పాపకు మూడోనెల కదోయ్! నాకు ఉత్తరం వ్రాశాం ఎప్పుడు రావాలని. మంచిరోజు చూచుకుని మీరే వచ్చెయ్యండి అని సమాధానం వ్రాశాను. ఇవాళ దిగుతారని నాకూ తెలీదు. తెలిస్తే ముందే వచ్చి నీతో చెప్పేవాణ్ణి" అన్నాడు.

శ్రీధర్ హెడ్‌మాస్టరు దగ్గర సెలవు తీసుకుని ఓబయ్య మామతో బయల్దేరాడు. తార చేసిన అన్ని పనుల్లాగే వుంది యిది కూడా! వెళ్లి ఓబయ్యమామ యింట్లో దిగటం! వెంకయ్య గారికైనా ఆమాత్రం యింగితజ్ఞానం లేకపోయిందా? లేకేం? ఉండే చేస్తున్నారు.

శ్రీధర్‌ని చూడగానే మంగమ్మత్త గట్టిగా వాటేసుకుంది: "ఎన్నాళ్లకో! నన్ను బొత్తిగా మరిచే పొయ్యావు సిరీ! అంతగా ఒడి దగ్గరకొచ్చి పిలిచిందే అత్త, చూసొద్దామనే మనసే లేకపోయె నీకు...నేను చచ్చినా అంతే కద!" అంటూ ఏడుస్తోంది..శ్రీధర్ కేంచెయ్యాలో తెలీలేదు...."తీరిక లేదు" అని గొణిగి మెల్లిగా వదిలించుకున్నాడు.

లోపల్నుంచి అప్పుడే స్నానంచేసి బట్టలు ధరించి వచ్చాడు వెంకయ్యగారు. ఓబయ్యమావ ఆయన వెనకాలే స్వరాజ్యాన్ని ఎత్తుకుని వచ్చాడు. ఈ ఏడెనిమిది మాసాల్లో స్వరాజ్యం పెరిగింది. ఆ పిల్లను చూడగానే శ్రీధర్ హృదయం విచ్చుకుంది. "రా" అన్నాడు చేతులు చాచి. సందేహించకుండా శ్రీధర్‌వైపు వాలింది. చేత్తో అతని చెంపా నుదురూ తడుముతూ పరీక్షగా చూస్తోంది.

వెంకయ్యగారు శ్రీధర్‌ని పలకరించలేదు. శ్రీధర్ కూడా ముభావంగా వున్నాడు. ఓబయ్య "శ్రీధర్, కాళ్లూ చేతులూ కడుక్కో, భోంచేద్దాం" అన్నాడు...."నా భోజనమైంది. భోంచేసే స్కూలుకు వెళ్లాను." అన్నాడు..."మీరు లేవండి అన్నగారూ" అన్నాడు ఓబయ్య వెంకయ్య నుద్దేశించి. ఆయన ఇంటి పైకప్పును చూస్తూనే "ఉఁ" 'అన్నాడు.

ఓబయ్యా, వెంకయ్యా భోజనం చెయ్యటానికి లోపలికి వెళ్లాక మంగమ్మ పాపని పొత్తిళ్లతో తెచ్చింది. స్వరాజ్యాన్ని దించి శ్రీధర్ కొత్త పాపాయిని ఒళ్లోకి తీసుకున్నాడు. ఈ పాప తెల్లగా నున్నిపిండి వుండలావుంది. చిన్నముక్కు. నిద్రలోవుంది. స్వరాజ్యం తనని దించినందుకు ఏడుపు లంకించుకుంది. మంగమ్మ ఆ పిల్లను ఎత్తుకుంది..."పేరు ధనలక్ష్మి" అన్నది.

"ఎవరి నడిగి పెట్టారు?"

"హుష్....ఉరుకో..మళ్లీ మొదలెట్టకు..."

"ధన ఏమిటి? లక్ష్మి చాలదనా?"

"నువ్వలానే • పిలుచుకుందుగానిలే!...ఓపికపట్టు... మళ్లీ రగడ పెంచుకోబోకు"

శ్రీధర్‌కు ఆ సలహా న్యాయంగానే తోచింది. ఒకవిధంగా అతని పంతం నెగ్గనే నెగ్గింది. అతను వెళ్లలేదు, తారను రమ్మని వ్రాయలేదు. తార స్వయంగా వచ్చింది. ఇప్పుడు తనెందుకు గొడవ పెట్టుకోవటం అనవసరంగా?...

భోజనంచేసి వెంకయ్య విశ్రమించాడు. శ్రీధర్‌ను పలకరించనేలేదు. ఆడవాళ్ళు భోంచేస్తూ వుండగా ఓబయ్య, శ్రీధర్, స్వరాజ్యంచేత మాటలు చెప్పిస్తూ కూర్చున్నారు.

చివరికి తార దర్శనమిచ్చేటప్పటికి, శ్రీధర్ ఆమెలో వచ్చిన మార్పు గమనించాడు. శరీరం నీరు పట్టింది. ముఖంలో అస్వస్థత తాలూకు అస్వాభావికమైన మెరుగు కన్పిస్తోంది...భార్యాభర్తల్ని వదిలి ఓబయ్యా మంగమ్మా ఏదో నెపం మీద చెరోవైపూ తప్పుకున్నారు.

"పాపాయి ఎలావుంది?" అని అడిగింది తార.

"నీకు నచ్చేలా వుంది" అన్నాడు.

"మీకు నచ్చలేదా?"

"ఉత్తరం వ్రాయకుండా పెట్టకుండా దిగావే, కారణం?"

"అక్కడెంత కాలం వుంటాను?" ఆమె ఆమాట అన్నతీరు శ్రీధర్‌కు తృప్తి కలిగించింది. ఆమె మీద సుముఖత్వం ఏర్పడింది.

"వచ్చినదానివి యిక్కడ దిగటమెందుకు?"

తార సమాధాన మివ్వలేదు.

"ఇంకో గంట తర్వాత, ఎండ తగ్గాక, బండీ తెస్తాను యింటికి వెళ్దాంపద"

"పిన్ని నడగండి."

"ఆమె నడగట మేమిటి? ఇది మన విషయం"

"అవును. ఆమె నడగటం మంచిది"

అవతలి గదినుంచీ వింటూ వుందోఏమో మంగమ్మ ప్రవేశించి అందుకున్నది. "అలా చక్కగా మాట్లాడుకోవాలి..ఎన్నాళ్లైందీ!..మీకు ఏం విందు చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను. ఏమయ్యా ఈ పూటకి మామూలు భోజనమే అనుకో, రేపు విందు చేస్తాను....వీళ్లకీ ప్రయాణబడలిక తగ్గుతుంది.."

"మేము యింటికి వెళ్తాము. కావలిస్తే తర్వాత తీరిక చూచుకుని ఒకరోజు విందుకు వస్తాము." అన్నాడు శ్రీధర్.

"ఏమి టేమిటీ? నాసంగతి తెలిసేనా యిలా మాట్లాడుతూవుంది?...తారా, నువ్వూ ఎక్కడికి వెడతారు?...ఇల్లు! ఇల్లు! ఎక్కడయ్యా నీ యిల్లు? పంచుకున్న తర్వాత కూడా యింకా నువ్వైతే చూరుపట్టుకుని ఊగులాడుతూ వున్నావుగాని, అపంచనే అమ్మాయీ బిడ్డలూ కూడా ఎందుకు? వాళ్ల దయా ధర్మం ఏమి ఖర్మ? మాటకు రీతిపాతీ వుండాలి!"

"నీ సలహా, ఉద్దేశమూ ఎవరూ అడగలేదులే" అన్నాడు శ్రీధర్.

"అమ్మాయి రానేరాదు. ఫో, ఏంచేస్తావో చేసుకో, ఫో" అన్నది మంగమ్మ.

తార ఆమెను వారిస్తూ "నువ్వేళ్లు పిన్నీ! ఆయన యిష్టం ఎలానో అలాగే చేస్తారు" అన్నది.

మంగమ్మ ముక్కుమీద వేలేసుకుని విస్తుపోయి తారను చూస్తూ నిలుచుని "అందుకే ఆలూమగల పోట్లాట అద్దం మీద ఆవగింజ అన్నారు...నాదే బుద్ధితక్కువ.." అని విస విసా లోపలికి వెళ్లిపోయింది.

"ఏమండీ పిన్నికి కోపం వస్తుంది. మనం వీళ్లకి రెండు వేలు యివ్వాలి కూడాను. ఎందుకీ పంతాలూ కోపాలూ? నాకు వంట్లో బాగులేదు. ఇంజక్షన్లు తీసుకుంటున్నాను. పూర్తి కాకుండానే వచ్చేశాను. నాకు మనిషి సాయంలేంది జరగదు. మీ వదినెకీ ఎడ పిల్లాడు. ఇక్కడే వుంటే పిన్ని చేస్తుంది. ఆలోచించండి. మీ యిష్టం...." తార ఆ మాటలు అంటూనే ఏడ్చేసింది. చీరకొంగు తీసి ముఖం దాచుకున్నది.

తారలో వచ్చిన మార్పుకు శ్రీధర్ అప్రతిభుడయ్యాడు. అనుభవాన్ని మించిన గుణపాఠం వుండదు కాబోలు ఎవరికీ! అనుకున్నాడు. అతనికి తార ఆరోగ్యాన్ని గూర్చి ఆదుర్దా కలిగింది. ఆలోచిస్తే అక్కడినుంచీ వెళ్లే ప్రసక్తి అప్పటికి వాయిదా వేయటమే మంచిదని తోచింది.

ఆ సాయంత్రం యింటికి వెళ్లి రుక్మిణమ్మతో తారా, వెంకయ్యగారూ వచ్చిన సంగతి చెప్పాడు. తారలో వచ్చిన మార్పుని గురించీ, జరిగిన సంభాషణను గురించీ చెప్పాడు. రుక్మిణమ్మ సంతోషం వెలిబుచ్చుతూ "నువ్వింకనైనా పంతాలకు పోకు! మీరు సుఖంగా వుండటమే మాకు కావలసింది! తార యిక్కడికి వచ్చినా రాకపోయినా నువ్వు సంసారంతో అక్కడ వాళ్లింట్లో వుండటం కంటె నాలుగురోజులు పోయాక వేరుగా ఒకయిల్లు తీసుకుని వుండటం మంచిది. వాళ్లు పేచీ మనుష్యులు, ఎప్పటి కేంచేస్తారో తెలీదు!" అని సలహా యిచ్చింది.

మరుసటి రోజే వెంకయ్యగారు వెళ్లిపోయారు—శ్రీధర్‌ను పలకరించకుండానే.

తార కారణంగా శ్రీధర్ నివాసం మొదట్లో కొన్నాళ్లు అనిశ్చితంగా వుండి పోయింది...మధ్యాహ్నాలు సాయంత్రాలు ఓబయ్య యింట్లో,రాత్రి భోజనమూ పడకా అన్నయ్య యింట్లో ప్రొద్దున్నే తొమ్మిదిన్నరకి భోంచేసి స్కూలుకి వెళ్ళి మధ్యాహ్నమూ సాయంత్రమూ ఓబయ్య యింట్లో గడిపి, వేళ మించితే అక్కడే భోంచెయ్యడమూ లేకపోతే యింటికి వెళ్లడమూ చేస్తున్నాడు. ఒకరోజు సాయంత్రం స్కూలునుంచి శ్రీధర్ ఓబయ్య యింటికి వెళ్లేటప్పటికి అతనికి తన పడకా, పెట్టె, మేజా, కుర్చీ, పుస్తకాల బీరువా కనిపించాయి..."నేను వెళ్లి మీ వస్తువులు పట్టుకొచ్చేశాను, మీరు అక్కడికీ యిక్కడికీ తిరుగుతూ యిబ్బంది పడటం చూడలేక" అన్నది తార.

"నాకెందుకు చెప్పలేదు? నాతో చెప్పకుండా ఎందుకు చేశావ్?" అని గద్దించాడు శ్రీధర్.

అతని కోపానికి తార నివ్వెరపోయింది. భయపడిపోయింది.

"ఏమిటి మాట్లాడవేమిటి? నువ్వు తప్ప నాకెవ్వరూ లేరనుకున్నావా?" అన్నాడు శ్రీధర్.

"నేను..నేను...కాదు ఆవిడే తీసుకువెళ్లమంది!..." తార మెల్లగా గుక్క తిప్పుకుంటూ, "నాకేం పట్టిందీ? చూసొద్దామని వెళ్లాను...మీరే నిత్యమూ పోరుతున్నారుగా వెళ్లిరమ్మని...

'యిబ్బంది ఎందుకు, మీ ఆయన సామాన్లు పట్టుకెళ్లు' అని అప్పటికప్పుడు జీతగాడి చేత బండి కట్టించి పంపింది....''

''ఎవరు?'

''మీ వదినె! ఇంకెవరు?''

శ్రీధర్ తర్వాత ఏమీ మాట్లాడలేదు.

''ఇవి ఆ పక్క గదిలో సర్దమంటారా?'' అని అడుగుతోంది తార.

స్వరాజ్యాన్ని ఎత్తుకుని వాకిట్లోకి పోతూ శ్రీధర్ ''నీ యిష్టం'' అన్నాడు.

అతనికి అక్కడ వుండటానికి మనస్కరించటంలేదు. కాని ఒకవైపు వదినె తన సామాను పంపించి వెయ్యటం అతని హృదయాన్ని రంపపుకోత కోస్తోంది. ఒకవేళ తార అబద్ధం చెబుతోందేమో! వెళ్లి నానా గొడవా చేసి సామాను పట్టుకొచ్చిందేమో! ఈ ఊహరాగానే స్వరాజ్యాన్ని యింట్లోవదిలి, అన్నగారి యింటికి నడిచాడు శ్రీధర్.

శ్రీధర్‌ను చూడగానే రుక్మిణమ్మ ''పాపా తారా వచ్చారు. పాప ముద్దుగావుంది.'' అన్నది.

''అవును, నేను చాలా అసహ్యంగా వున్నాను.''

''అంటే?...నీకేం లోటూ!''

''లోటులేనిదే! పెట్టే పడకా వీధిలో పారేసి వెళ్లిపొమ్మన్నావటగా.''

''యిబ్బందిగా వుంటుందని పంపాను.''

''తనే అడిగిందా? నువ్వే తీసుకు వెళ్లమన్నావా? అదీ నాక్కావలిసింది....''

రుక్మిణమ్మ అతని ముఖ కవళికలు పరీక్షించి ''అదేమిటి? అడిగితే ఏం? అడక్కపోతేనేం? నీ ధోరణి నాకేం బాగులేదు!... నీ సంసారం నువ్వు దిద్దుకోవాలిగాని ఎన్నాళ్లు గడిచినా పొట్లాటలూ పంతాలూనేనా? పెళ్లాం పిల్లలూ అక్కడా, నీ పడక యిక్కడా అయితే, లోకం ఏమంటుంది? మేము నీకు లేనిపోనివి నేర్పి నిన్ను వాళ్లకు దూరంగా వుంచుతున్నా మనదూ? అయినా నీకేం సుఖం?....నే నిదివరకే చెప్పాను కదా...ఆ పిల్ల' యిక్కడికి వచ్చి వుండదు, ఆ అదృష్టం దాటిపోయింది. వేరే యిల్లు తీసుకుని వుండటం నీకు సుఖం...ఆ ప్రయత్నమేదో అది చెయ్యకుండా నామీదా నీ భార్య మీదా పంతాలు వేసుకుంటే లాభంలేదు....'' అన్నది.

''అయితే యిక నీ యింటి గడప తొక్కొద్దంటావా?''

''అని నే నంటానా? నిన్ను నా పెద్దకొడుకుగా పెంచి పెద్దచేసి ఆమాట అంటానా? అంటానని ఎట్లా అనుకుంటావు?'' రుక్మిణమ్మ కంఠం రుద్ధమైంది. ''ప్రాప్తం లేదు, అంతే. రాత ఎలావుంటే అలా అవుతుంది...ఎక్కడున్నా సుఖంగా వుంటావనే కదా యింతా చెప్పటం...రా, తిను, వుండు, కాని మాకోసం నీ సంసారాన్ని కాదనుకుంటే నిన్నందరూ పిచ్చివాడి కింద జమకట్టరా? అదిగో దాని పెత్తనం, మరది సంసారాన్ని ముక్కలు చేసింది అని అందరూ నన్ను తిట్టిపొయ్యరా?..... నా కడుపున పుట్టిన వాడికైనా నేనామాటే చెబుతాను!''

శ్రీధర్ ఆలోచిస్తూ కూర్చున్నాడు. వదినె ఎన్నోరకాలుగా అతని కర్తవ్యాన్ని మళ్లీమళ్లీ బోధిస్తోంది. శ్రీధర్ వదినె కొడుకుని వళ్లో పెట్టుకుని వింటున్నాడు బరువెక్కిన హృదయంతో.

నరసింహులు వచ్చాడు. పరిస్థితి తెలుసుకొని అతనుకూడా భార్య చెప్పిన మాటలే చెప్పాడు. ధాన్యం మొదలు, ఇంట్లో సామానూ వగైరా తమ్ముడి సంసారానికి కావలసినవన్నీ పట్టుకుపొమ్మని చెప్పాడు. రుక్మిణమ్మ మాత్రం మొదట వేరుగా యిల్లు చూచుకుని తర్వాత పట్టుకుపొమ్మని చెబుతోంది.

నరసింహులు వ్యవసాయం సంగతి కూడా ప్రస్తావించాడు. శ్రీధర్‌కు వచ్చిన వాటాలో కొంతభూమి ఓబయ్య పొలముతో కలిసేదిగా వుండటం వలన అది ఓబయ్య చేస్తేనే బాగుంటుందనీ, మిగతా భూమికూడా తను చెయ్యమంటే చేస్తాననీ, లేకపోతే ఓబయ్యే చెయ్యవచ్చుననీ వివరించాడు.

''ఏమో నాకు తెలీదు, నువ్వే ఏర్పాటు చెయ్యి'' అన్నాడు శ్రీధర్.

## 18

''ఇంగ్లీషు లెక్చరరు శేషాద్రి సన్యాసం పుచ్చుకుని వచ్చాడట. ఆత్మానందస్వామి అంటూ కొత్త పేరుతో వేషంతో తయారయ్యాడట. ఈ థియాసఫిస్టులు ఏం రంగులు ఫిరాయిస్తారయ్యా! సన్యాసి అయినవాడు ఏ మఠంలోనో భంగుతాగుతూ కూర్చోక మళ్లీ కుర్రాళ్లలోకి రావటమెందుకూ? వాళ్లకి బూర్జువా మత్తుమందు పొయ్యటానికి రియాక్షనరీ ప్రాపగాండాకి కాకపోతే! పాఠం పదిహేను నిముషాలూ, మిగతా ముప్పావు గంటా వెధవ వేదాంతం కబుర్లూ...''అంటున్నాడు చలమయ్య టీచర్సు రూములో.

''ఎవరు చెప్పారు? పాతకాలం మనిషి! రెండేళ్లయింది కదూ! కూతురు లేచి పోవటంతో ఊరినుంచి వెళ్లిపోయాడు, యికరాడనే అనుకున్నాం. మళ్లీ ఎందుకొచ్చాడో! అయితే సన్యాసం పుచ్చుకున్నాడా? కాషాయగుడ్డలూ....అవీ?'' అని అడుగుతున్నాడు మరొక టీచరు.

''ఆఁ..నిన్నను నా ప్రాతశిష్యుడొకడు కాలేజి స్టూడెంటు కనిపించి, యీ సన్యాసినే గొప్పగా వర్ణించాడు. 'జీత మక్కరలేదు, నాకు హాస్టలులో తిండి పెడితేచాలు, నా కిష్టమున్నన్నాళ్లూ పాఠాలు చెబుతాను' అని తిరిగి వచ్చాడట. ఆహా! ఎంత త్యాగం, ఎంత త్యాగం అంటూ పరవశించిపోతున్నాడు యీ కుర్రవెధవ! అది కాదోయ్ అసలు థియాసఫీ అంటేనే దగా. ఇంగ్లీషువాళ్లు మనదేశంలోని చచ్చునమ్మకాల్నీ మతాన్నీ ఇంపీరియలిజంకు అండగా నిలబెట్టుకోటానికి బెసెంటు ద్వారా పన్నిన పన్నాగం అన్నమాట. వాళ్లతో ఇండియన్ కాపిటలిస్టులు చేతులు కలిపారు.—అడయారులో వుండే వాళ్లెవరు? తెల్లవాళ్లూ, కేపిటలిస్టులూ, వాళ్ల తొత్తులు శేషాద్రిలాంటివాళ్లూ....తేరగావస్తే బాగుంది తెమ్మని తప్పక చేర్చుకుంటారు. వీడైనా రాక ఎక్కడికి చస్తాడు? ఏదో కాషాయగుడ్డలు వేసుకుంటే, కూతురువల్ల వచ్చిన అప్రతిష్ట కొంతవరకు మూసిపెట్టుకోవచ్చు అని వీడి తాపత్రయం, అంతకంటె ఏమీలేదు ! ముసలి నక్క ! !'' అంటున్నాడు చలమయ్య.

చలమయ్య యీమధ్య కమ్యూనిస్టు ప్రచార భావాన్ని విరివిగా వెదజల్లుతున్నాడు తీరిక సమయాల్లో. నెహ్రూని ఇంగ్లీషు అమెరికన్ కేపిటలిస్టుల ఏజెంటు అనటం, కాన్స్టిట్యూషన్‌ని విప్లవాత్మకంగా లేదనటం మొదలైన రాచకీయపు చిలక పలుకులు వినబడుతూనే వున్నా ఒకరిద్దరు వాదించటం తప్ప పట్టించుకోలేదు. కాని శేషాద్రి మీద యీవిధంగా దుర్భాష లాడటం చలమయ్యలోని నీచత్వాన్ని శ్రీధర్‌కు దుర్భరం చేసింది. అంతవరకూ విని, యిక వినలేక లేచి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం స్కూలు అవగానే యింటికి వెళ్ళకుండా దారిలో హోటల్లో కాఫీ త్రాగి శ్రీధర్ కాలేజివైపు వెళ్ళాడు. అక్కడ అక్కడ కుర్రాళ్ళు కనిపిస్తే శేషాద్రి గారెక్కడుంటున్నదీ అడిగి తెలుసుకున్నాడు. "ఆయనకు ఆల్‌కాట్ బంగళా మేడమీద పెద్ద గది యిచ్చారు. ఎప్పుడూ అక్కడే వుంటారు. వెళ్ళినవాళ్ళతో ఎక్కువ సేపు మౌనంగా వుండటం తప్ప మాట్లాడటం తక్కువ. క్లాసులకు వచ్చినప్పడే ఏమైనా మాట్లాడటం ఎవరైనా మధ్యాహ్నం యింటర్వల్‌లో లైబ్రరీలో కలుసుకోవచ్చు" అన్నాడు. హాస్టలుల వుంటున్న విద్యార్థి.

శ్రీధర్ ప్రయత్నం విరమించుకోలేదు. ఆల్‌కాట్ బంగళా వైపు నడిచాడు..

శేషాద్రిగారు—ఆత్మానందస్వామి—తివాసీమీద కూర్చుని దిండుకు అనుకుని చదువుకుంటున్నాడు. శ్రీధర్ వెళ్ళి ఎదురుగా నిలుచుంటే, తలెత్తి చూచి చిరునవ్వుతో తివాసీ మీద కూర్చోమని సౌంజ్ఞచేసి, పుస్తకంలో మళ్ళీ లీనమయ్యాడు. పది హేను నిముషాలు నిశ్శబ్దంలో గడచిపోయాయి. శ్రీధర్ ఆయన్ని తదేకంగా చూస్తున్నాడు—చూచేకొద్దీ హృదయంలో దుఃఖం, ఆప్యాయత, గౌరవం, భక్తి సమ్మిశ్రితమైన ఉద్వేగం అనుభవిస్తున్నాడు.

చివరకు ఆత్మానందస్వామి పుస్తకం మూసివేసి, శ్రీధర్ వైపు తిరిగాడు...కొన్నిక్షణాలు నిదానించి చూచి "శ్రీధర్ కదూ.. ఏం చేస్తున్నావు?" అన్నాడు. "బోర్డుహైస్కూలులో టీచరుగా చేరాను...ఏడాదిన్నర అయింది" అని సమాధాన మిచ్చాడు శ్రీధర్.

ఆత్మానందస్వామి చిరునవ్వుతో తలపంకించాడు.

"మీరు మారిపోయారు" అన్నాడు శ్రీధర్.

స్వామిజీ తల అడ్డంగా ఊపి "లేదు...మారేది జీవితం, ప్రపంచం, నేను కాదు. నువ్వు కాదు...ఆ కిటికీ తలుపులు తియ్యి" అన్నాడు.

శ్రీధర్‌లేచి స్వామి కెదురుగా తనకు వెనుకగావున్న కిటికీ తలుపులు తెరిచాడు. అస్తమిస్తున్న పడమటి సూర్యుడి కిరణాలు గదిలో ప్రవేశించాయి. కిటికీ బాగా క్రిందుగా వుండటంతో వాళ్ళు నేలమీద కూర్చునివున్నా కిటికీ అవతలి దృశ్యం, చెట్లూ, ఆకాశం, చక్కగా కనిపిస్తోంది...శ్రీధర్ ఓరగా కూర్చున్నాడు—కుడివైపు స్వామిజీని, ఎడమవైపు కిటికీని చూసేందుకు వీలుగా..

"కిటికీ అక్కడే వుంది. తలుపులు మాత్రమే తెరువబడినై" అన్నాడు స్వామిజీ.

శ్రీధర్‌కు ఆయన మాటలు ప్రోత్సాహం కలిగించాయి.

"మీ శిష్యుణ్ణి నేను—కేవలం మీదగ్గర చదువుకోవటం వల్లేకాదు, మీ ఉపదేశం పొందటంవల్ల కూడా రెండేళ్ళ క్రితం ఆధ్యాత్మికంగా కూడా మిమ్మల్ని గురువుగా ఆశ్రయించాను. మీరు స్వీకరించారనే నా విశ్వాసం. ఈ రెండేళ్ళా మీదర్శనం లేకపోవటం నా దురదృష్టం—మళ్ళీ మీరిక్కడికి రావటం నా భాగ్యం" అనుకోకుండానే ఆ మాటు అలా వచ్చేయి. శ్రీధర్ తనని గూర్చి యిలా నివేదించుకోవాలని ఎప్పుడూ ఊహించుకోలేదు. ఆక్షణంలో అలా అనటంలో ఏదో ఆత్మసంతృప్తి అనుభవించాడు.

"ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు స్వామిజీ.

శ్రీధర్ తన కుటుంబంలో వచ్చిన మార్పునీ, తన ఆదర్శాల వైఫల్యాన్నీ, తనహృదయక్షోభనీ వివరించాడు.

"తలుపులు తెరవబడటం— సంకెళ్ళు వదలిపోవటం— అది బాధగానే కనిపించినా, అంతకంటెమార్గంలేదు విముక్తికి" అని వ్యాఖ్యానించాడు స్వామిజీ.

"నాకర్థం కావటంలేదు... జీవితం నుంచి పారిపోవాలనుకోవటం పిరికితనం కాదా?"

"అవును..ఎందుకు పారిపోవటం? సాధనకోసం అవసరమైతే కొంతకాలం దూరంగా వెళ్ళవచ్చు. కానివిముక్తి అనేది పారిపోవటం ద్వారా రాదు! వచ్చినట్లు కనిపిస్తే అది మార్పు మాత్రమే, నిజమైన విముక్తికాదు. మనిషిలోని 'వాసనలు' కల్పించేది జీవితం ఆ జీవితంలో, నుంచే ఆ' కల్పన' ని సమంగా దర్శించటం ద్వారానే ' వాసన'లకు స్వస్తి, అప్పుడే విముక్తి. అందుకు అడ్డదారి (Short cut) ఏమీలేదు."

"విముక్తి అంటే ఏమిటి? శూన్యమా? క్రితంసారి నాకు మీరిచ్చిన ఉపదేశం, ప్రేమించమని. ప్రేమను పెంచుకుని యితరులతో దాన్ని పంచుకొమ్మని...నాకు కలిగిన అనుభవం నా ప్రేమ యీలోకంలో ఎవరికీ అక్కర లేదని..కాని కాని నా విశ్వాసాన్ని నేను వదులుకోలేను... మరి విముక్తి అంటే ఏమిటో నేనూహించలేకుండా ఉన్నాను."

స్వామిజీ కొన్ని నిముషాలు మౌనంగా ఉన్నాడు. "ప్రేమ. ప్రేమ... ప్రేమించమని అప్పుడు ఉపదేశించానా? అవును' అప్పుడు నాకంతే తెలుసు!" తర్వాత నవ్వుతూ లేచాడు..."పైకి పోదాంపద; సూర్యుడు అస్తమించాడు. సంధ్య చాల రమణీయంగా వుంది..."అన్నాడు.

ఆమాటల్లో ఒకనాటి రసోన్మాదియైన శేషాద్రి మళ్ళీ దర్శనమిచ్చాడు శ్రీధర్‌కు.

పైకి వెళ్ళిన తర్వాత డాబామీద యిటునటూపచారుచేసి స్వామిజీ ప్రకృతిని చూస్తూ ఆకాశంలోని రాగరేఖల్ని చూస్తూ నిలిచిపోయాడు చాలాసేపు. పున్నమి చంద్రుడు మెల్లగా పైకెగ బ్రాకు తున్నాడు...

ప్రక్కనే నిలబడి ఉన్న శ్రీధర్ భుజంమీద చెయ్యివేసి స్వామిజీ "శ్రీధర్ మనం సంకెళ్ళని ప్రేమిస్తాము, ఆ సంకెళ్ళ అవతలఉన్న సత్యాన్ని అందుకోవటానికి సంకెళ్ళు అడ్డం; సంకెళ్ళు

అంటే ఆదర్శాలు, మనుషుల్ని గూర్చిన మన అభిప్రాయాలు; యివి మనలో కల్పించే రసోన్మాదమే ప్రేమగా భ్రమిస్తాము. సంకెళ్ల నుంచీ విముక్తిపొంది చూడగలిగితే గాని ప్రేమకు సిద్ధి లేదు. విముక్తి శూన్యంలాగే ఉంటుంది. కాని అది వెలుతురు; తలుపులు తెరిస్తే వెంటనే కళ్లు వెలుగుని భరించలేక, మరే వస్తువునూ చూడలేక బాధపడి, కుంచించుకు పోయినట్లు, మాయ తొలగి పోయే అనుభవమూ బాధగానే ఉంటుంది. ప్రేమ శూన్యంగానే ఉంటుంది. బాధేమిటి?—సర్వం ఆ శూన్యంలో లయించినట్లే ఉంటుంది! కాని క్రమంగా ఆవెలుగుకి అలవాటు పడవచ్చు; దాని ద్వారా స్పష్టంగా చూడవచ్చు లోకాన్ని. అలవాటు పడటంకాదు ఆవెలుగులో ఐక్యంకావచ్చు..ప్రేమ, సత్యం అన్నీ పృథఃకరణ చెందిన ఆవెలుగే; చివరకు ఆవెలుగులో అవి లయించక తప్పదు. అదే విముక్తి !"

క్రిందికి దిగి వచ్చారు. కాని శ్రీధర్ మనస్సులో సందేహాలు సందేహాలుగానే వుండి పోయాయి. క్రిందికి వచ్చాక స్వామిజీ యిలా అన్నారు' గురు శిష్య సంబంధంలో ఒక రహస్యం వుంది. శిష్యుడికి చేయి అందించగల మెట్టులో గురువూ, గురువు చేయి అందుకోగల మెట్టులో శిష్యుడూ వుంటారు. ఇదీ యధార్థమైన సంబంధం; యిలా లేనిది యాదృచ్ఛికమైనదీ, తాత్కాలికమైనదీ మాత్రమే అవుతుంది. శిష్యుడికి చేయూత నివ్వటంలోనే గురువు తన సాధనని పూర్తి చేసుకోవటానికి వీలవుతుంది; లేకపోతే అతనికి పురోగమనం వుండదు..."

"నాకు చాల సందేహాలున్నాయి..."

"అవును అవి ఒక రోజులో తీరేవి కావు" అన్నాడు స్వామిజీ. ధ్యానానికి వేళవుతూందని, మరుసటిరోజు రమ్మని ఆహ్వానించాడు శ్రీధర్‌ను.

శ్రీధర్ స్వామిజీ మాటల్ని తన జీవితానికి అన్వయం చేసుకోటానికి ప్రయత్నించాడు. విఫలుడయ్యాడు. ప్రగాఢమైన విశ్వాసాలు లేకపోవటం (చంద్రావతి ఉదంతం), ఉన్న విశ్వాసాలని నిలుపుకో లేక పరిస్థితులకు బలి యివ్వటం (సమిష్టి కుటుంబ విభజన విషయం) తన సమస్యగా ఉంటున్నప్పుడు, విశ్వాసాల శృంఖలాల్ని వదిలించుకొని వెలుగులోకి నడవ మంటున్నాడు తన గురువు.

విశ్వాసాలను వదలు కుంటే శూన్యమూ, పతనమూ తప్ప మరేమిటి?

'నేను' మారదు, జీవితమే మారుతుంది. అంటాడు స్వామిజీ. జీవితం కల్పన, మాయ. 'నేను' అనేదాన్ని జీవితం నుంచీ వేరుచేసి ఎలా చూడటం? ఆరెండింటికీ విభేదం చాల కృత్రిమంగా అసాధ్యంగా కనిపిస్తోంది తనకు!

పోతే, జీవితం యధార్థం, దాని మీద అధికారం ఉండాలి వ్యక్తికి అంటుంది పద్మమణి. జీవితం మీద అధికారం లేకపోవటమే, పట్టు తప్పిపోవటమే అనర్థాలకు కారణం అన్నది చంద్రావతి. స్వామిజీ జీవితం మాయ అని త్రోసి పుచ్చుతున్నారు! ఈ అభిప్రాయాలకు సమన్వయం తనకు కుదరటం లేదు!

మరుసటి రోజు శ్రీధర్ తన మొదటి సందేహాన్ని—విశ్వాసాల శృంఖలాలను గూర్చి— స్వామిజీని ప్రశ్నించాడు. ఆయన యిలా అన్నాడు. "నీవిశ్వాసాలను వదులుకొమ్మని నేను చెప్పలేదు. కొంత ఆత్మ పరామర్శతో అప్రసక్తి తెచ్చాను. నీకొక వ్యక్తి జీవితాన్ని గూర్చి చెబుతాను విను— యౌవనంలో భార్యను ప్రేమించాడు, ఆరాధించాడు. ఆమె ఉన్నట్లుండి మరణించింది. మనో వైకల్యం ప్రాప్తించింది అతనికి. అప్పుడు థియాసఫిస్టులతో పరిచయం కలిగింది.—వాళ్లు 'సియాన్స్'లలో అతని భార్య ప్రేతాన్ని రప్పించి మాట్లాడించారు. అది ఎంతో మన శ్శాంతి కలిగించింది. కాని క్రమంగా అది చాల కృత్రిమ విధానంగా, కేవలం తన అపరిణత మనస్కతకు ఉపాధిగా అతనికి విశదమౌతూ వచ్చింది. తన ఆరాధ్య స్త్రీమూర్తికి చెందిన పరమార్థము, ఆమె శరీరంలో, కంఠస్వరంలో, మాటల్లోలేదు; అవి బాహ్యచిహ్నాలు, నశించాయి. వాటికోసం తహతహ లాడటం మనో దౌర్బల్యం.ఆమె తాలూకు పరమార్థం ఒక ఆదర్శ భావన—సౌందర్యము, సౌశీల్యము, పవిత్రత, ప్రేమ, మూర్తీభవించిన స్త్రీత్వం. ఈ ఆదర్శ భావన హైందవ నాగరకతలో, భారతీయ సంప్రదాయంలో విస్తృతంగా, విరాణ్మూర్తి అతనికి కనిపిస్తూ వచ్చింది. అందుకే ఆమూర్తిని ఆరాధిస్తూ వచ్చాడు. అతనికి ఒక కౌమార్తె; ఆబాలిక అతని భార్య వదలిపెట్టివెళ్లిన స్మృతి చిహ్నం- అంతేకాదు, అతని ఆదర్శ సంపద నిక్షిప్తమైన ఆశాపేటిక. ఆ బాలికకు వివాహం చేశాడు. కాని మూడేళ్లు గడవకుండానే ఆమె వితంతువై తిరిగి వచ్చింది. ఆమె భారతీయ మహిళాభ్యుదయానికి జీవితాన్ని అంకితం చెయ్యాలని అతని అభిప్రాయం; కాదు ఆమెకు అతని ఆదేశం... ఏడేళ్లు గడిచాయి, ఆకౌమార్తె, ముప్పైఏళ్ల ప్రౌఢ, మళయాళీ వంటవాడితో లేచిపోయింది...అతని ఆదర్శ భావన, జీవిత కాలమంతా నిర్మించుకొన్న విశ్వాసం, బ్రద్దలైంది. ఆదర్శ సంపదని ఆశాపేటికతో సహా దొంగలెత్తుక పోయారు. రెండోసారి అతనికి మనో వైకల్యం ప్రాప్తించింది.... హృషీకేశంలో ఒక గురువు సన్నిధానంలో అతనికి జ్ఞానోదయమైంది. 'నేను' అంటే ఏమిటి? నేను నిర్మించుకున్న గూడు, ఆదర్శం విశ్వాసం, 'నేను' కాదు; అది శిథిలం కావటంతో 'నేను' శిథిలం కాలేదు; నేను అనాదిగా అనంతంగా ఉన్నాను..అతను కౌమార్తెను క్షమించ గలిగాడు, అర్థం చేసుకో గలిగాడు. అతడు అంతదాకా ఆరాధించిందీ, ప్రేమించిందీ భార్యను కాదు, కౌమార్తెను కాదు; తను మానసికంగా నిర్మించుకున్న భ్రమను!.. సంకెళ్లూ పోయాయి; తలుపులు తెరుచు కున్నాయి. ఆవెలుగుకి అలవాటు పడుతున్నాడు... జీవితంనుంచీ మనుష్యుల్నించీ పారిపోలేదు, తిరిగి వచ్చాడు..తెలిసింది కదూ నేను నిన్న చెప్పిన వాక్యాల అంతరార్థం!.. ఆ వాక్యాలు నీకర్తవ్యాన్ని గూర్చి నేను చెప్పినవి కావు."

"అయితే నాకర్తవ్య మేమిటంటారు?"

స్వామిజీ నవ్వారు. "కర్తవ్యం యిదమిత్థమని ఆదేశించే మూర్ఖత్వం యిప్పుడు నాలో లేదు శ్రీధర్. ఇదిగో యిదీ నాజీవితం, నేను తెలుసుకొన్నది.....నేను తెలుసుకున్నదీ మన సంప్రదాయమే, అందుకు భిన్నంగా ఏమీలేదు అని చెప్పగలను...

కాని....సంప్రదాయాన్ని జీవితానికి అన్వయం చేసుకోవటంలో గట్టి చిక్కు వున్నది; అది ఎవరికి వారు చెయ్యవలసిందే.. నీ విషయంలో యిదివరకే నేను ఒక పొరపాటు చేశాను ప్రేమించు అంటే ఎవరిని? దేన్ని? ఎలా? సాధ్యమా? అ ప్రశ్నలకు సమాధానాలు తెలీకుండా సర్వజ్ఞుడిలా నీకు చెప్పాను, ఇవ్వాళ మళ్లీ నీ విశ్వాసాలు వదులుకొమ్మని ఎలా ఆదేశించ గలను? నీలో జరిగే జిజ్ఞాసకు కించిత్ సాహాయ్యము భగవచ్ఛ వుంటే నాద్వారా జరగ వచ్చు,అంతే తప్ప కర్తవ్యాన్ని గూర్చి నిన్ను నువ్వే ప్రశించుకోవాలి.. నీకు తోచినప్పుడు వస్తూవుండు...."

"విశ్వాసాల ప్రాముఖ్యతను గూర్చి చెప్పండి"

"విశ్వాసాల ప్రాముఖ్యతను కాదనటం లేదు. ఆదర్శాలు విశ్వాసాలు లేని మనిషి జీవితం మొగ్గ దొడుగని మొక్క. పువ్వులు వికసించితే గాని, రేకులు రాలితేగాని, పిందెలు కాయలూ రావు. అలాగే క్రమ పరిణామంలో ఆదర్శాలూ, విశ్వాసాలు వ్యక్తిని వదిలితేగాని ఫలసిద్ధి కాదు. పూతలేనిది పిందెలేదు; కాయలేదు. కాని విశ్వాసాల్ని ఆదిలో నిలుపుకోలేని వ్యక్తి పూతలేని మామిడి చెట్టు."

"జీవితం మాయఅంటే జీవితాన్ని నిరాకరించటంకాదా?"

"కాదు; జీవిత స్వరూపాన్ని వస్తుతః దర్శించటం—కాని ఆ దర్శనం ఆత్మజ్ఞానసిద్ధి తర్వాత గాని లభించదు!అంతదాకా విశ్వాసాల్ని నమ్ముకోవటమే శరణ్యం. చిత్తశుద్ధిలేక పోవటం, జీవితాన్ని మాయగా దర్శించటం రెండూ ఒకటి కాదు. జీవితంలో భీరుత్వం ప్రదర్శిస్తూ ఎప్పటికప్పుడు ఆదర్శాల్ని గోటమీటుతూ "ఏముందీ? మాయ!"—అనే దుఃస్థితి మనదేశంలో కలగటమే మన పతనానికి హేతువైంది. ఆ మనస్తత్వంలో మార్పు వచ్చేదాకా దేశానికి నిష్కృతిలేదు..."

అయితే మీరు విశ్వాసాలనీ ఆదర్శాలనీ అవసర మైనవిగానే సమర్థిస్తున్నారన్నమాట"

"అవసరం ఒక దశలో, అవరోధం మరోదశలో"

శ్రీధర్ ఆలోచనలో పడ్డాడు. ఆత్మానందస్వామి అయిన శేషాద్రి జీవితకథ వినటంతో ఆయనను గూర్చి ఎన్నో అర్థంకాని విషయాలు స్పష్టం అయ్యాయి. కాని శే షాద్రి వంటి వ్యక్తులు యిప్పుడేరీ? వాళ్లు గతించిన యుగానికి ప్రతినిధులు. అది గాంధీ యుగం. ప్రగాఢమైన విశ్వాసాలతో, ఉజ్జ్వలమైన ఆదర్శాలతో అధికారంతో జీవించిన ఆ తరం వ్యక్తులకు సందేహాలు రాలేదు. కాలం మారి స్వప్నాలు భగ్నమౌతున్నా మమకారం వదలుకొని వాళ్లు లోకాతీతమైన వెలుగులోకే నడవ గలుగుతున్నారు! కాని ఈతరం వారి సమస్య వేరు. చంద్రావతి అన్నట్లు జీవితం మీద పట్టు తప్పిపోవటం నేటి సమస్య.ఆదర్శాలు విశ్వాసాలు అసలు లేకపోవటం! ప్రాతవాటిని నిలుపుకో లేక పోవటం! క్రొత్త వాటిని నిర్మించుకోలేక పోవటం! ఈసంధి యుగంలో జీవితం మీద అధికారం ఎలా లభిస్తుంది? సమాధానం సంప్రదాయంలో, శేషాద్రిగారిలో, లభించేలా కనిపించటం లేదు!

"మళ్లీ ఎప్పుడైనా వచ్చి దర్శనం చేసుకుంటాన"ని సెలవు తీసుకున్నాడు శ్రీధర్. స్వామిజీ అతనికి భగవద్గీత ప్రతి నొకదానిని యిచ్చి చదువుతూ, ఆత్మవిమర్శ చేసుకుంటూ ఉండమని ఆశీర్వదించాడు.

ఆరోజు శ్రీధర్ యింటికి వచ్చేటప్పటికి ఓబయ్య కాచుకుని ఉన్నాడు.

అప్పటికి నెలరోజులైంది శ్రీధర్ తారతో వేరింటి కాపురంపెట్టి. ఇంచు మించు సంవత్సర కాలం ఓబయ్య యింట్లోనే గడిపాడు. తార తన ఆరోగ్యమూ, పాపాయిపోషణా, కారణంగా మంగమ్మ సహాయాన్ని ఆపేక్షించి అక్కడి నుంచీ కదల లేదు. చివరకు శ్రీధర్ బలవంతాన కదిలింది.

నేరేడు మ్రాను బావి పొలంలో శ్రీధర్‌కువచ్చిన భాగాన్ని ఓబయ్యే సాగు చేస్తున్నాడు. దానికిచేరిన భూమికొంత ఓబయ్య సొంతం ఉన్నది. దానికి పూర్వం వేరుగా బావి ఉండేదట అబావి చాల భాగం పూడి ఇప్పుడు చిన్నపల్లం మాత్రం ఉండటం వల్ల కొన్ని ఏళ్లుగా ఒబయ్య భూమిలో సాగు లేదు. ప్రస్తుతం శ్రీధర్ వాటా పొలాన్ని చేస్తూ తన పొలాన్ని కూడా దున్నించి నేరేడుమ్రాను బావినీటితో దాన్నీ సాగు చెయ్యాలని ఓబయ్య ఉద్దేశించాడు. అందుకు నరసింహులు అంగీకరించలేదు. బావి నీరు శ్రీధర్‌వాటాకుతప్ప ఓబయ్య భూమికి యివ్వటానికి వీల్లేదు అన్నాడు. ఓబయ్య నరసింహులు కార్పణ్యాన్ని శ్రీధర్‌కు చెప్పాడు. శ్రీధర్ అడగ్గా "వీల్లేదు" అన్నాడు నరసింహులు. చివరకు నీళ్లుచాలక పోవటమే తను వీల్లేదనటానికి కారణమనీ చాలితే యివ్వటానికి తన కభ్యంతరం వుండదనీ, మిగిలితే కట్టుకొమ్మనీ చెప్పాడు తమ్ముడికి. శ్రీధర్ ఆమాటే వచ్చి ఓబయ్యకు చెప్పాడు. ఇది జరిగి కొన్ని నెలలయింది.

నరసింహులు మాటప్రకారం శ్రీధర్ కోరిక మీద కాదన కుండా నీళ్లు వదిలాడు. కాని నీళ్లు చాలకుండా పోవటంతో యిప్పుడు శ్రీధర్ వాటాపొలం పారేదాకా మాత్రమే కపిలె తోల టానికి అనుమతించాడు. ఓబయ్య మనుష్యులు అది లెక్కచెయ్యకుండా కపిలె తోలటంతో పెద్ద రగడ జరిగింది. ఓబయ్యకు బలగం తక్కువ కావటంతో వెనక్కు తగ్గారు. ఆవిషయమై శ్రీధర్‌తో చెప్పటానికి వచ్చాడు ఓబయ్య. శ్రీధర్‌కు అన్నయ్య నరసింహులు అవలింభించిన వైఖరి న్యాయంగానే తోచింది. మొదట్లో చెప్పినదానికి విరుద్ధంగా ఏమీ జరగలేదు......

"నువ్వే అట్లామాట్లాడతా వేమిటి? ఉన్ననీళ్లు వంట కంతటికీ సర్దుకోవాల్సిందే! మన పంటలో కొంత భాగం, పదనుకు వచ్చిందాన్ని పాడు చేసుకొమ్మనటం ఏమిన్యాయం? అన్నాడు ఓబయ్య.

"మొదటే చెప్పాడు కదా నీళ్లు తక్కువౌతాయని?"

"నీళ్లు యిన్నాళ్లూ సమంగా పంచాడా లేదా? నేను వకీల్ని కనుక్కొన్నాను. కోర్టులో వేసి ఇంజక్షన్ పుచ్చుకోవాలని నిశ్చయం చేసుకున్నాను. ఇదిగో వకాల్తానామా ఫారం తెచ్చాను. నువ్వూ సంతకం పెట్టితే రేపు దాఖలవుతుంది.."

"ఇది అన్యాయం, నాకిష్టం లేదు.. నువ్విలాంటివి చేస్తే నేను నాపొలాన్ని మాఅన్నయ్యకే అప్పగిస్తాను."

ఓబయ్య ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు. తర్వాత ఎంతో బాధపడ్డట్టుగా కనిపిస్తూ అనునయంగా చెప్పటం ప్రారంభిం

చాడు. "ఏమిటి ను వ్వనేది? నీ ఆస్తి! నీ పొలం! శ్రీధర్, ఇవ్వాళ నాడైనా అదీ రేపు నీదే కదా! దాని నీటివసతి సంగతి ఈ రోజు తేల్చుకోకపోతే శాశ్వతంగా ఆహక్కు పోతుంది. అది బీడుగా ఉండి పోతుంది. అసలు పూర్వానికి అదీ ఆబావిలో సాగవుతూ వుండిందే! మీ నాన్న హయాంలో ఒకసారి రెండు మూడేళ్లు వరుసగా నీళ్లు తక్కువైతే మేం దున్నకపోతే, తర్వాత నీకు హక్కులేదు పొమ్మన్నాడు. అప్పుడు జరిగింది. అదీఅసలు సంగతి. నేనూ న్యాయంగానే అడుగుతున్నాను. నీకేం తెలుసు, నీ చదువేమో నువ్వేమో, ఈ వ్యవహారాల పుట్టుపూర్వోత్తరాలు!"

"నేను అన్నయ్యతో మాట్లాడి రేపు చెబుతాను."

"ఏం చెపుతావు? మీ అన్నయ్య పుర్రచెయ్యి చూపిస్తూనే వున్నాడుగా!" అన్నాడు ఓబయ్య కోపంగా.

ఈసంభాషణ వింటూనే ఉన్న తార కలుగజేసుకొని "అదేమిటండీ! వేరుపడ్డ తర్వాత ఎవరి మంచి వాళ్లు చూసుకుంటారుగాని ఈ చాదస్తమేమిటి? బాబాయిగారు చెప్పినట్లు చేయండి. ఇవ్వాళ పోగొట్టు కుంటే రేపు వస్తుందా?"అన్నది.

"నీకు తెలీదు నువ్వూరుకో! మామా, పంతం పట్టి అన్నదమ్ముల్ని విడదీశావు. అంతా నీయిష్ట ప్రకారమే జరుగుతున్నది. మానాన్న పోయాడు. ఎందుకీ తగాదాలు? న్యాయంగా వున్న హక్కులేవో అవి అనుభవిస్తే చాలదా? ఈవిషయంలో మాఅన్నయ్య అనీ కాదు, నాసొంత అనీ కాదు గాని న్యాయమేదో ఆ పక్షాన వ్యవహరించాలని నాఅభిప్రాయం. అంతకుమించి నేనేమీ చెప్పను...."

"నీకోసం నీభార్య పిల్లలూ, నేనూ మీఅత్తా, పడేబాధ నీకేమన్నా కనిపిస్తోందా? ఎంత సేపూ అన్న అన్న, వదినె వదినె అని ప్రాకులాడతావు గాని నీకు పెళ్లామూ పిల్లలూ, వాళ్లమంచీ చెడ్డా ఆలోచిద్దామనే లేదు! చదువుకొన్నవాడివి కదా, యివ్వాళ కాకపోతే రేపైనా బుద్ధిమారి దారికి రాకపోతావా అని ఆశలు పెట్టు కుంటూ వస్తున్నాము నేనూ, మీమామ గారైన వెంకయ్యగారూ! నీ పద్ధతీ, ప్రవర్తనా ఏమీ బాగుండటం లేదు శ్రీధర్! ఇదివరకు రాఘవరావు ప్రాపకంలో ఉండిన టీచరు ఎవర్తో ఆమె యింటికి ఎప్పుడూ వెళ్తూండట మేమిటి? దానికి వడ్లూ అవీ పంపి సంసారం నువ్వే జరుపుతున్నావని వూళ్లో పుకారుగా కూడా ఉంది! మహాన్యాయం, ధర్మం అని ఎవరికి ఈ ఉపన్యాసాలు? నేను చెప్పిన దాంట్లో న్యాయం లేకపోతే చెప్పుచ్చుకొ్కట్టు! ఇంకనైనా ఈ కుర్రవేషాలు మానేసి ఆ టీచరుతో సంబంధం వదులుకో! ఎందుకయ్యా కట్టు కున్న భార్యను అలా ఏడిపిస్తావు? మ్రింగలేక కక్కలేక కుళ్లిపోతోంది అమ్మాయి! పెద్దవాణ్ణి. అల్లుడివైనా కొడుకువైనా నువ్వే, ఏదో చచ్చే కాలానికి తలకొరివి పెట్టే, యిన్ని నీళ్లు వదులు తావనే ఆశకొద్దీ భ్రమకొద్దీ నీచుట్టు తిరుగు తున్నవాణ్ణి, యింతా చెప్ప వలసి వచ్చింది. నీ యిష్టం ఏం చేసుకుంటావో చేసుకో! నాక్కావలసి వచ్చిందా యిదంతా? అక్కరలేకపోతే దానం చేసుకో! ఇక నుంచీ నీపొలం వ్యవహారాలు నాకక్కర్లేదు. నువ్వేచూసుకో" అని ఏకధాటిగా ఓబయ్య తన మనస్సులో ఉన్నదంతా వెళ్లగ్రక్కి లేచిపోవటానికి సిద్ధమయ్యాడు.

తార ఏడుస్తూ ఓబయ్యకి అడ్డం వెళ్లింది." బాబయ్యా నన్నేంజేసి వెళ్తారు?మీరిట్లావదిలేస్తే ఆయన మరీ నాక్కాకుండా పోతారు! చెప్పండి! ఆయనకు అర్ధమయ్యేట్లు చెప్పండి! అన్నా వదెనా ఏ మత్తు మందు చల్లారో మొదటినుంచీ ఇదేవరస!... మదరాసులో కాపురం చేసిన నాలుగు రోజులూ తప్పితే తర్వాత యీాయనికి నేనెంత చేదు విషమై పోయానో! కారణ మేమిటో అడగండి బాబయ్యా! మీరు అడిగే పెద్దలు అడక్కపోవటం వల్లే గదా యిలా బరి తెగించి పోయారు! న్యాయం ధర్మం అని స్కూల్లో పాఠాలు చెప్పటంకాదు యింట్లో ఏమి న్యాయం వెలగబెడుతున్నారీయన?"

ఓబయ్య సానుభూతితో వింటూ నిలబడి ఉన్నాడు.

శ్రీధర్ నివ్వెరపోయి చూస్తున్నాడు. అతనికి నోట మాట రాలేదు! ఓబయ్యా, తారా తనమీద వేసిన ఈ అపవాదు— యిలా అకస్మాత్తుగా రేగిన దుమారం— యిన్నాళ్లుగా తనని గూర్చి తనదగ్గర వాళ్లు ఏర్పరచుకున్న వింత అభిప్రాయాలూ— ఉన్నట్లుండి అగ్ని పర్వతం బ్రద్దలైనట్లు, దాని మీద కూర్చున్న తను ఎక్కడికో విసరి వేయబడినట్లూ, అంతా కలగా ఉంది.

"ఏమండీ! యిప్పటికైనా మనసు మార్చు కోండి! పిల్లల ముఖం చూడండి! బాబాయి చెబుతున్నట్లు చెయ్యండి. మన మేలు కోరేవారు, అనుభవంతో చెబుతున్నపుడు తోసి వెయ్యకండి. మీమీద ఆశలు పెట్టుకున్న వాళ్లను కాదనకండి.."అంటోంది తార శ్రీధర్ దగ్గరగా వచ్చి ప్రాధేయ పడుతూ.

"ఏమిటీ గోల! నాకేం అర్ధం కావటం లేదు! ఏమిటి మామయ్యా నువ్వన్నది? ఏమిటీ అబద్ధాలు, ఆరోపణలు? ఎవడు నన్నుగురించి చేస్తున్నది యీ ప్రచారమంతా? ముందీ విషయం తేల్చు, తర్వాత పొలం సంగతి ఆలోచిద్దాం! ఆ టీచరు నా స్కూల్లో చదువుకున్నది. వడ్లు కావాలంటే పంపాను. ఇంటరు పరీక్షకు కట్టి చదువుతూ ఏవో పుస్తకాలు కావాలంటే సంపాదించి పెట్టాను.. అవును, సహాయం చేయటం తప్పా? ఇంతగా చిలవలూ పలవలూ కల్పించిన మహాను భావుడెవడో చెప్పు!" అన్నాడు ఓబయ్య నుద్దేశించి.

"ఎవరో ఎందుకూ? నువ్వే ఒప్పేసు కుంటున్నావు కదా! మరి నువ్వు దానింటికి వెళ్తూండబట్టే అంటున్నారు! ఏదో సామెత చెప్పినట్లు పిల్లి కళ్లు మూసుకుంటే లోకమూ మూసుకుంటుందా ఏం, మర్యాదస్తుల కొంపా నువ్వు వెళ్తూ వస్తుండడానికి? అంత మాత్రం ఇంగిత జ్ఞానం ఉండక్కర్లా?"

"అక్కడికి వెళ్లటం తప్పంటే నేనొప్పుకోను! లోకంలో పదిమందీ చెప్పేది కాదు, మనస్సాక్షి చెప్పేదే ధర్మం! నువ్వే ఆలోచించు మామయ్యా!"

"ఇంక అంతకంటే ఏం సమాధానం చెబుతావులే! ఏసాక్షైనా కానీ, భార్యను రొష్టు పెట్టకయ్యా మహానుభావా! అని నీమంచికే చెబుతారు ఎవరైనా."

తార అందుకున్నది "పోనివ్వండి సహాయం చేశారు మంచి ఉద్దేశంతోనే. ఇంకా దాని యింటికి వెళ్లడ మెందుకూ? నిన్నా యివ్వాళాకూడా వెళ్లారే! రోజూ ఏం పని ఉంటుందండీ? స్కూలు అవగానే కాఫీకి కూడా రారు బాబాయి; యిదిగో యీవేళ అవుతూంటుంది!" అన్నది తార.

"నిన్నా యివ్వాళ కాలేజిలో ఆత్మానందస్వామి గారిని దర్శించడానికి వెళ్లాను. రోజూ డైరీ నీకు అప్పగిస్తూ వుండా లేమిటి? నాయిష్టం!"

"ఏదో చెబుతారు, ఇంట్లోవుండేదాన్ని నాకేంతెలుస్తుంది?"

"పోన్లేఅమ్మాయ్...మంచి ఉద్దేశంతోనే వెళ్లాడు. యిక దాని గడప తొక్కడు!.. అలాంటి వాళ్లతో సంబంధం పెట్టుకోవటం అప్రతిష్ఠ శ్రీధర్! తాటి చెట్టు క్రింద నుంచుని మజ్జిగ తాగినా కల్లే తాగుతున్నా డంటారు అమ్మాయ్! అనుమానాలు పెంచుకుంటే లాభం లేదు. ఆ చలమయ్యగాడు యిటాంటి వెన్నైనా పుట్టిస్తాడు!... అసలు వాడితో నువ్వు తిరుగుతూ ఉండటమే నాకు బాగు లేదు శ్రీధర్! వాడేనటగా మొదట నిన్ను దానింటికి తీసుకెళ్లిందీ! అన్నీ వాడి మాటలే! వాణ్ణి నమ్మబోకు.. చూడబ్బాయ్, యీపొలం సంగతి విషయంలో నామాట విను, యివాళ పోగొట్టుకుంటే తర్వాత రాదు! నేను చెబుతున్నాను కదా; యిది మాకు పూర్వం ఉన్న హక్కే! కొత్తగా అడుగు తున్నది కాదు. మీనాన్న హయాంలో మా అశ్రద్ధవలన ఆయన ప్రాబల్యంవల్లా మాపొలానికి నీళ్లు పెట్టడం ఆగిపోయింది. అంతే! అందువల్ల నేను చెప్పేది ఏమిటంటే పోనీ నిన్ను ప్రతివాదిగా గానే చేరుస్తాను. నువ్వు అడ్డు చెప్పకుండా చూస్తూ ఉండు. సాక్ష్యం వగైరా నేను చూచుకుంటాను. నాదగ్గర పాత డాక్యుమెంటు, రికార్డు ఉన్నాయి, వెధవది శ్రద్ధతీసుకోలేదుగాని యిన్నాళ్లూ యింట్లోనే ఉంది రికార్డు, యీ పాటికెప్పుడో తేల్చుకొని ఉండవలసిన వ్యవహారం."

శ్రీధర్ తల తిరిగిపోతుంది. పొలం వ్యవహారం కంటే చలమయ్యచేసిన దుష్ప్రచారం, పద్మమణిని గూర్చి లోకానికి ఉన్న అభిప్రాయం పద్మమణికీ తనకూ గల సంబంధం యొక్క యాధార్థ్యాన్ని గూర్చిన జిజ్ఞాస, అతని మనస్సును ఆక్రమించుకున్నాయి.

"న్యాయం జరగాలని నీ ఆదుర్దా; అంతే మామా" అన్నాడు.

"న్యాయమే శ్రీధర్!..మనం అన్యాయం జోలికే పోవద్దు! నీకే అర్థమౌతుంది, నువ్వు చూస్తూ వూరుకో చాలు! నువ్వు మీ అన్నదగ్గరకు వెళ్లక్కర్లేలేదు. ఒకవేళ పిలిపించి ఏమైనా చెప్పేందుకు ప్రయత్నం చేస్తాడేమో; 'నాకు తెలియదు, మామ చూస్తున్నాడు' అని జవాబు చెప్పు, చాలు. అన్నాడు ఓబయ్య.

## 19

పద్మమణి ప్రయివేటుగా యింటరు పరీక్షకు చదువుతున్నది. శ్రీధర్ ఆమె యింటికి వారానికి రెండుసార్లు వెళ్తూనే ఉన్నాడు. ఈ విషయమై చలమయ్య ఒకటి రెండుసార్లు వ్యంగ్యంగా తనని హెచ్చరించినమాట నిజమే కాని అసూయతో యిలా తన కుటుంబంలోనూ, ఇతరత్రా ప్రచారం సాగిస్తున్నాడని ఇంతవరకు శ్రీధర్ వూహించుకోలేక పోయాడు.

ఆరాత్రి ఓబయ్య వెళ్లిన తరువాత తారద్వారా ఒక ముఖ్యమైన సంగతి అతనికి తెలిసింది. పాపాయికి మూడోనెల ప్రవేశించగానే ఆలస్యం చెయ్యకుండా తార వచ్చివెయ్యటానికి కారణం—చలమయ్య ఓబయ్యతో ప్రథమంగా తన చెడు ప్రవర్తనను గూర్చి చెప్పినమాటలేనట! బందరునుంచీ తిరిగి వచ్చిన తారలో తను గుర్తించిన మార్పుకి—అంటే ఆమె చూపిన లౌంగుబాటుకీ, సుముఖత్వానికీ కూడా—అదే మూల కారణం అన్నమాట! ఈ విషయం క్రమంగా బోధపడగానే శ్రీధర్‌కు తారా వెంకయ్యా, మంగమ్మా, ఓబయ్యా ఒక క్రొత్త వెలుగులో వెలవెలపోతూ కనిపించారు .... ఆ రాత్రి శ్రీధర్‌కు నిద్ర పట్టలేదు.

వీళ్లందరూ తన ప్రవర్తనని గర్హిస్తూనే, ఇన్నాళ్లూ అది నిజమని నమ్ముతూనే, తనకు గౌరవాన్నీ, విలువనూ యిస్తున్నారన్నమాట! తనను గూర్చి యిటువంటి ప్రవాదము ఏమీ లేనప్పుడు తారా వెంకయ్యగారూ పూచికపుల్ల కంటె తక్కువగా చూశారు. వివాహవ్యవస్థా, కట్నండబ్బూ తనకు భర్తమీద హక్కుల్ని ప్రసాదించాయనీ, అతన్ని కొంగుకు కట్టుకు తిరగవచ్చనీ అప్పట్లో తార అభిప్రాయం కాబోలు! ఆ హక్కులికి ప్రమాదం సంభవించిందని తెలియగానే తన వస్తువును తను భద్రపరుచుకోవాలనీ తిరిగివచ్చింది! ఇందులో మంగమ్మత్తా వోబయ్యమామా నిర్వహించిన పాత్ర—తార తనమీద విరుచుకు పడకుండా, అలా చేస్తే పరిస్థితి చెడుతుందనీ, సర్దిచెప్పటం కాబోలు! అందుకే తార మంగమ్మత్తమీద అంతగా ఆధారపడుతోంది!—మాటకుముందు 'పిన్నిగారి నడగండి .... పిన్నిగారు చెప్పింది' అంటుంది.... పోతే మంగమ్మా ఓబయ్యా తనమీద వచ్చిన ప్రవాదాన్ని ఒక అవకాశంగా యిలా ఉపయోగించుకున్నారు.—తనని అన్న కుటుంబాన్నుంచీ వేరుచేసి కాపురం పెట్టించటానికీ, అన్నమీద కక్ష సాధించటానికీ తారను రప్పించారు సమయానికి! కళ్లముందు నడిచే నాటకానికి వెనుక సూత్రాలు యిలా ఉన్నాయి!

అయితే ఓబయ్య వేస్తున్న బావినీటి తగాయిదా కేసు కూడా అందులోని భాగమే నన్నమాట! ఇందులో ఓబయ్య ఎంత గింజుకున్నా తను మాత్రం వ్రేలు పెట్టబోడు! నిజంగా బలమైన రికార్డే ఉంటే, ఓబయ్యదే న్యాయమైతే లేక అన్నయ్యదే న్యాయమైతే, ఆ విషయం కోర్టే నిర్ణయిస్తుంది. ఈ సంగతి తను విశేషంగా ఆలోచించ నక్కరలేదు!

అన్నింటికంటె చిత్రంగా ఉన్న సంగతి— 'వీళ్లందరూ ఇన్నాళ్లూ తనని గూర్చి యీ అపోహ పెట్టుకునే ఎందుకు వూరుకున్నారు అని! తార మాటల్నిబట్టి చూస్తే ఆమెకు యిదివరకే అడగాలని ఉంది. కాని మిగతావాళ్లు సలహా యివ్వటంవల్ల కాబోలు వోర్పుగా ఉందన్నమాట! ఓబయ్యకు నిజంగా యీ విషయం పట్టినట్లు లేదు. తను అన్నయ్యతో కలుస్తానని మాట అనగానే తన నైతిక ప్రవర్తనని ప్రశ్నిస్తూ తారని కూడా తనమీదికి పురికొల్పాడన్నమాట! అంతకంటె

తనమీద ఓబయ్యకు ప్రస్తుతం పట్టుకూడా ఏమీ లేదు. లోగడ యిచ్చిన డబ్బుమాట ఎత్తటానికి ప్రోనోటుకు వాయిదా పోయిందాయె! వాయిదా పోకుండా చెల్లు వ్రాయించుకోలేదు. ఎందుకో? అశ్రద్ధా? లేక నిజంగానే తనమీద మమకారమా? రెండూనా? ఇలాంటి విషయాల్లో నిజం తెలుసుకోవటం అసాధ్యమే!

ఆలోచించేకొద్దీ జీవితమూ, దాన్ని ప్రవర్తింపజేస్తున్న యదార్థమైన శక్తులూ, జీవితభ్రమణంలో తల్లక్రిందులయి కనిపిస్తూన్న విలువలూ, అతనికి వింత కలిగిస్తున్నాయి. పైకి కనిపించే ఆదర్శాలూ, నైతిక ప్రమాణాలూ జీవితాన్ని నిజంగా నడపటమే లేదు! అలానే అయితే ఆదర్శాల అమాయకత్వంతో వివాహమందిరం ముంగిట భార్య తార ప్రేమ నర్థిస్తూ తాను నిలుచున్న ఆ రోజుల్లో తనకు ప్రేమా, గౌరవమూ లభించి వుండేవి. ఈనాడు తారను తను ఏమీ అర్థించటంలేదు! తారకు వ్యక్తిత్వంలేకపోవటం, తారలోని భీరుత్వం తనకు ఆమె మీద జాలి కలిగిస్తున్నాయి. తనని ఆమెవైపుకి లాక్కునే ఆకర్షణ తారలో అదృశ్యమైపోయింది! అయితే వివాహితుడుగా తను ధర్మాన్ని పాలించవద్దా? ధర్మం, ? కర్తవ్యం ? నిర్దిష్టమైన విశ్వాసాలు లేనిదే ధర్మమూ, కర్తవ్యమూ ఎలా నిర్ణయించేది? అతనిలో మళ్లీ ధర్మాన్ని గూర్చి, తన కర్తవ్యాన్ని గూర్చి జిజ్ఞాస ప్రారంభం అయింది.

పద్మమణి చరిత్ర తనకు తెలుసు. సంఘం దృష్టిలో ఆమెకు ఎలాంటి గౌరవమూ లేదు. కాని, ఈ విషయం బుద్ధికి తెలియటం వేరు; పద్మమణి వ్యక్తిత్వం ప్రత్యక్షానుభవంగా తనలో కలిగించే ఉదాత్తభావన, అనిర్వచనీయమైన పరితృప్తి, ఆనందం వేరు. రెండింటికీ ఎక్కడా సంబంధం లేదు. ఆ అనుభూతిని విశ్వాసాలరీత్యా యిదమిత్థమని ఇంతవరకూ నిర్ణయించుకోలేక పోయాడు—దాన్ని 'ప్రేమ' అని పిలవటానికి యిద్దరి జీవితాల్లోనూ ఆ నిర్వచనానికి తగిన పరిస్థితీ, అందుకు అవకాశం ఏనాడో దాటిపోయాయి. భిన్నంగా ఎంతో జరిగిపోయింది కూడా. 'కామం' అనడానికి యిద్దరిమధ్యా తను గీచిన గీటు నిగ్రహంతో యిప్పటికీ పెద్ద ప్రయత్నం అంటూ అవసరం లేకుండానే నిలుపుకో గలుగుతున్నారు; 'స్నేహం' అనటానికి అంతకంటె ప్రదీప్తమైన, ఆత్మీయమైన, విశేషానుభూతీ, ఏకీభావమూ యిద్దరిమధ్యా స్ఫురిస్తోంది....శ్రీధర్ యిదివరకే చాలసార్లు పరీక్షించాడు—పద్మమణి సమక్షంలో తనకు కలిగే అనుభూతిని, ఆ క్షణంలోనే సాంఘికమైన దృష్టితో, నైతికాదర్శానికి సంబంధించిన వూహలతో, విమర్శలతో చెదరగొట్టటానికి ప్రయత్నం చేశాడు. కాని సరోవరంలో సుప్రతిష్ఠితమైన చంద్రుని ప్రతిబింబాన్ని చిన్న చిన్న రాళ్ళువేసి చెదరగొట్టడానికి చేసే ప్రయత్నం లాగే ఆ విమర్శలూ, పరీక్షలూ విఫలమయ్యాయి. తాత్కాలికంగా మనస్సు వూహలతో నిండి కల్లోలితం కావటంతప్ప ఆ అనుభూతి వైశిష్ట్యం చెరగనూ లేదు. తరగనూ లేదు!......

ఒకసారి శ్రీధర్ పద్మమణిని అడిగాడు "శరత్ నవలలు నీకంతగా యిష్టమని అంటున్నావు. ఆయన స్త్రీ పురుష సంబంధాల్నీ సంప్రదాయ విరుద్ధమైన ప్రేమనీ చిత్రించటంలో అవలంబించే డొంక తిరుగుడూ, జాడ్యమూ అది కేవలం భీరుత్వమని ఒక ఆక్షేపణవుంది. చలంలాగా విప్లవాత్మకంగా స్త్రీ వ్యక్తిత్వాన్నీ, స్వేచ్ఛనూ ఆయన సమర్థించలేక పోయాడు అంటారు. నీకేమనిపిస్తుంది?"

"మీ కేమనిపిస్తుందో చెప్పండి."

"ప్రశ్న వెయ్యటమూ, సమాధానం చెప్పటమూ రెండూ నేనేనా? మొదట నువ్వు చెప్పాలి."

"ఊహుఁ....మీరు."

"కాదు.....నువ్వు."

"ఊహుఁ.....".

"సరే అయితే! నాకు ఆ విమర్శ సబబుగానే అనిపిస్తుంది. దానితో ఏకీభవిస్తున్నాను" అన్నాడు శ్రీధర్.

"ఆహా! పాపం!నమ్మవలసిందే!" అంటూ నవ్వింది పద్మమణి.

శ్రీధర్ కూడా నవ్వేశాడు. "ఇంక నీ అభిప్రాయం చెప్పు మరి!" అన్నాడు.

పద్మమణి కొన్ని క్షణాలు ఆలోచించింది : "నాకు ఆ విమర్శ తప్పని తోస్తుంది. ఎందుకు తప్పో కారణం నేను సరిగా చెప్పలేక పోవచ్చు. నా అభిప్రాయంలో ధైర్యం అనేది ఒక పని చెయ్యటంలోనే కాదు, దాన్ని చెయ్యగలిగీ,చెయ్యకుండా ఉండటం లోనూ గొప్పగా కనిపిస్తుంది. శరత్ పాత్రలలో అదే విడమర్చి చెప్పుకోండి" అన్నది పద్మమణి.

"అవును. శరత్ పాత్రలు భయపడి ఎక్కడా తమ మనసుల్ని కప్పి పుచ్చుకోవు. వాళ్ల సంఘర్షణ కూడా కేవలం సంఘంతో పిరికితనం మూలంగా ఏర్పడింది కాదు. అది వాళ్ల అంతర్యంలో వాళ్లకే వచ్చింది. ఏదో ఒకటి చలం పాత్రలలాగా చేసేస్తే అది ఆ సంఘర్షణని లోపల ఎదుర్కోలేని అశక్తత—పిరికితనమో తేలిక గుణమో అవుతుంది. అందుకే శరత్ పాత్రల గాంభీర్యమూ నిండుదనమూ చలం పాత్రలలో కనిపించదు." అన్నాడు శ్రీధర్.

"నే నొప్పుకోను. ఎవళ్ల గొప్పదనం వాళ్లదీ! చలం పాత్రలలో కనిపించేది ధైర్యమూ, శరత్ పాత్రలలో కనిపించేది స్థైర్యమూ అనగూడదా?" అన్నది పద్మమణి.

"అంటే భయంలేక పోవటం, నిర్భయం అనేది సమాన గుణమంటావ్."

పద్మమణి తలవూపింది.

అలావుంటాయి ఆమెతో మాటలు. తన మనస్సు తనకే విదితమౌతూ ఉంటుంది ఆమె సమక్షంలో.

కాలం గడుస్తున్నకొద్దీ పద్మమణి తనలో కలిగించే అనుభూతి రంగులుదిద్దుకుంటూ దాని పరిపూర్ణతను ప్రస్ఫుటం చేసుకుంటున్నది. చలమయ్యవంటివారి ప్రచారానికి భయపడి తను దర్శిస్తున్న ఈ సత్యాన్ని కాదనటమా? తను భార్యకూ, పిల్లలకూ చేస్తున్న లోపంకాని, ద్రోహంకానీ యిందులో ఏమీ లేదే!

పద్మమణిని చూచి నేర్చుకోవలసిన వెన్నో అతనికి కనిపించాయి. ఆమెలో నిర్వేదం, నిస్పృహ ఎప్పుడూ కనిపించదు. ఎవ్వరినీ దేన్నీ విమర్శించదు. చలమయ్య సంగతి వచ్చినాసరే, అత్స

లోని మంచితనాన్నే ప్రసక్తం చేస్తుందిగాని తేలికగా మాట్లాడదు. మళ్లీ ఆమెకు చలమయ్యలో లోపాలు ఏమిటో అతని సంస్కారం ఏపాటిదో తెలీకపోలేదు. ఒక్కొక్కమాటలో ఆ జ్ఞానం తేటతెల్లమవుతూనే ఉంటుంది. రాఘవరావు మరణానంతరం ట్రైనింగ్ పూర్తి చేసుకుని, కమిటీ వారిని కలుసుకుని ఉద్యోగంలో చేరటమేకాదు, పూనికతో ఇంటరు పరీక్షకు చదువుతోంది పద్మమణి. సత్యాన్ని సాయంత్రాలు టెయిలరింగ్ నేర్చుకునేందుకు పంపుతోంది. సవతికొడుకుని టెయిలర్ని చేద్దామనే ఉద్దేశంతో కాదు. చదువుతోబాటు ఉపయోగకరమైన పని ఏదో ఒక్కదానిలో సత్యం కౌశలం సంపాయించాలని ఆమె ఉద్దేశ్యం. ఖర్చు లెక్క వ్రాసిపెట్టుకోవటంలోకాని, డబ్బు విషయమైన జాగ్రత్తలోగాని ఆమె చూపే దక్షత ఆశ్చర్యంగా కొంత ఎబ్బెట్టుగా కూడా ఉంటోంది....అతనెప్పుడూ స్త్రీలో యిటువంటి దక్షతను అందమైన గుణంగా భావించలేదు! కాని యివన్నీ ఆమెకు తనపైగల ప్రభావానికి కారణాలుగా చెప్పటానికి వీల్లేదు!

వేరుకాపురంపెట్టి సంసారం నిర్వహించటం ప్రారంభించాక శ్రీధర్‌కు ఆర్థిక పరిస్థితుల ఒత్తిడి బాగా అనుభవానికి వచ్చింది. ఏడాదిగా తను చేర్చి పెట్టుకొన్న రొక్కం క్రమంగా ఖర్చుపెడుతోంది. నరసింహులు అతనికి పంపకంలో అప్పూ యివ్వలేదు, రొక్కమూ యివ్వలేదు......కాబట్టి నెలసరి ఖర్చుకు యికమీద జీతం ఒక్కటే చాలక పోవచ్చు; ఈసారి అదనంగా వచ్చే ధాన్యమైనా అమ్ముకోవాలి, లేకపోతే యిప్పుడవుతున్నఖర్చులో పొదుపైనా జరగాలి......

ఓబయ్య నరసింహులిపై వేసిన వ్యాజ్యం నడుస్తోంది. ఆ విషయమై అన్నయ్య తనని పిలిచి అడుగుతాడనుకున్న శ్రీధర్‌కు అలాంటి పిలుపేదీ రాకపోవటం ఆశ్చర్యం కలిగించింది. ఒకటి రెండుసార్లు యింటికి వెళ్లాడు. కాని రుక్మిణమ్మ ఈ సంగతి ప్రస్తావించలేదు. అది గుర్తించి శ్రీధర్‌కూడా మౌనం వహించాడు.

ఓబయ్య చేసిన వ్యవసాయం శ్రీధర్‌కు ఏడాదికి సరిపయే తిండిగింజల్ని మాత్రమే రాల్చింది; అమ్మేందుకు అదనంగా పంట ఏమీ మిగల్లేదు. శ్రీధర్ దగ్గరకు పిల్లలు ట్యూషన్ కోసం వస్తున్నారు. ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ట్యూషన్ చెప్పటం తప్పనిసరే అయింది. ప్రొద్దుటే పూట అయిదుమందికి చెబుతున్నాడు.

1952 ఎలక్షన్లువచ్చాయి. చలమయ్య కమ్యూనిస్టుపార్టీకి సానుభూతిపరుడుగా పనిచేశాడు. మదనపల్లెలో కమ్యూనిస్టు అభ్యర్థి గెలిచాడు. చలమయ్య స్వయంగా విజయంపొందినట్లు సంతోషించాడు......అతణ్ణిపట్ట పగ్గాలు లేకుండా ఉన్నాయి. ఆ వూపులోనే ఒక సంఘటన జరిగింది.

ఆరోజు సాయంత్రం శ్రీధర్ పద్మమణిని చూడటానికి వెళ్లాడు. మెట్లెక్కగానే మాటలు వినబడ్డాయి.

"ఛీ, వదులు! మనిషి కొకసారి చెబితే బుద్ధుండాలి. మర్యాదగా చెబితే తెలుసుకోవాలి." అంటోంది పద్మమణి.

"ఏమిటి నీ మర్యాద? ఇన్నాళ్లూ నీ చుట్టూ తిప్పుకుని, ఆశపెట్టి యివాళ యిదేనా మర్యాద! ఏం నేను వాడికంటె చెడపోయానా, ముసలాడు రాఘవరావుపాటి చెయ్యనా?... ఎందుకీ వేషాలు? సరదాగా ఉండక!......పద్మా, ఊఁ బెట్టు చెయ్యక, రా......" అది చలమయ్య గొంతు.

శ్రీధర్ గదిలో ప్రవేశించకుండా మెట్ల గుమ్మం దగ్గరే ఆగిపోయాడు.

"నీ మట్టిబుర్ర కింకా ఎలా చెప్పాలి? ప్రతి ఆడదానికీ ప్రతి మగాడిమీదా ఉండాలని ఎక్కడ రాసిపెట్టి ఉంది?...... నా చుట్టూ తిరిగావంటే ఎందుకు తిరిగావో నీకే తెలియాలి. ఇంటికి వస్తే మనిషిగా యివ్వవలసిన గౌరవం యిచ్చాను. సత్యానికి ట్యూషన్ చెప్పినందుకు అణా పైసతో నీ డబ్బు నీకు ముట్టింది; ఆపైన నీకూ నాకూ ఏమిటి సంబంధం? నువ్వేదో వూహించుకుంటే అదంతా వట్టి భ్రమ అని చెబుతూనే ఉన్నాను. నువ్వు నన్ను గూర్చి యిలా నానా మాటలూ అనటం బాగులేదు చలమయ్యా! శ్రీధర్ పేరుగాని, రాఘవరావుగారి పేరుగాని నీ కనవసరం."

"అయితే ప్రస్తుతం శ్రీధర్ నీ మొగుడు అన్నమాట."

"మీకు నమస్కారం. నీతో ఇక మాట్లాడటం నాదే బుద్ధి తక్కువ...దయచేసి యిక నా యింటికి రాకండి, వెళ్లండి చలమయ్యగారూ!"

"ఆహా! ఏం టక్కులు! ఏం వయ్యారపు విసయాలూ..... రావే...."

"ఛీ! ఏమిటీ దౌర్జన్యం! వదులు!......నువ్వు మనిషివా పశువ్వా?...నేను అరుస్తాను...వదులు......అయ్యో.... ఓఁ."... పెనగులాట, పద్మనోరు నొక్కబడుతున్న శబ్దమూ......శ్రీధర్ ఒక్క గంతువేసి గదిలో పడ్డాడు. చలమయ్య వీపుమీద గట్టిగా గుద్దాడు. చలమయ్య వెనక్కు తిరిగి, "ఓ, నువ్వా?......." అని సంబాళించుకొని—"ఏం మిస్టర్! ఈ ముండకోసం మనం పోట్లాడుకోవాలా? ఇది కొన్నాళ్లు నాతో పడుకొని, యిప్పుడు నీతో ఉంటోంది...మనలో మనకేం ఫ్రెండ్స్ కదా అని ఇన్నాళ్లూ వూరుకున్నా......ఇప్పుడు నామీదే ఎదురు తిరుగుతూంటే బుద్ధి చెబుతున్నా........"

శ్రీధర్ చలమయ్య చంపమీద ఎడతెరిపి లేకుండా పటపట వాయించేశాడు. చలమయ్య శ్రీధర్ షర్టు ముందరిభాగం పట్టుకుంటూ కలియబడ్డాడు. ఇద్దరూ కొట్టుకొన్నారు. చలమయ్య విడిపించుకుని వెళ్లిపోతూ, "ఈ సంగతి యింతటితో అయిపోలేదు. నాతో శత్రుత్వమా?" అన్నాడు.

శ్రీధర్ నలిగిన తన షర్టునీ, జుత్తునీ సరిచేసుకుంటూ పద్మమణివైపు చూచాడు. అరచేతుల్తో ముఖం కప్పుకుని ఏడుస్తోంది.

శ్రీధర్ ఆమెను దగ్గరకు తీసుకుని గట్టిగా హృదయానికి హత్తుకుంటూ మూర్ధాన్ని ముద్దుపెట్టుకున్నాడు.అతని కౌగిట్లో ఒదిగిపోయింది. ఆమె చేతి వేళ్లని ముఖంనుంచీ విడదీయటానికి ప్రయత్నించాడు. పద్మమణి చేతుల్ని మరింత గట్టిగా అదుముకున్నది. "పద్మా, యిలా చూడు....ఏడవకోక....చెయ్యి తియ్యి... అబ్బ....ఏమిటా మొండితనం! యిలా చూడమంటూంటే!...."

పద్మమణి అతనికి అభిముఖంగా తిరిగి చప్పున చేతులతో అతన్ని గట్టిగా చుట్టివేసి ముఖాన్ని అతని వక్షంలో దాచుకున్నది.

"నావైపు చూడమంటూంటే....ఊఁ...." ఆమెను నడుము దగ్గర పొదివిపట్టుకుని వెనక్కి వంచాడు. ఆమె తలెత్తి అతని కళ్లల్లోకి చూచింది. కన్నీటితో తడిసిన ఆమె కళ్లనీ, కనురెప్పల్నీ, చెంపల్నీ ఆగకుండా ముద్దులతో నింపివేసిన అతని పెదవులు చివరకు ఆమె పెదవులమీద సుదీర్ఘంగా ఆగిపోయాయి. పద్మమణి మెల్లగా అతణ్ణి తోసివేసి వదలించుకొని చప్పున లోపలికి వెళ్లిపోయింది.

శ్రీధర్ అలానే నిల్చుండిపోయాడు కొన్నిక్షణాలు. జరిగిన విషయమంతా వరుసగా మళ్లీ జ్ఞాపకం వస్తోంది. శ్రీధర్ వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు. ఒకవైపు కొత్త ఉత్సాహం పొంగులు వారుతూ, లోకాన్ని జయించానన్నభావం, ఎవరినీ తను లక్ష్య పెట్టనన్నభావం, తనకు కావలసిందేదో లభించిందన్నభావం వెల్లివిరిసిపోతూవుంది. మరోవైపు చలమయ్య బెదిరింపును గూర్చి—ఏం జేస్తాడు? వెళ్లి ఓబయ్యతో, తారతో, అన్నయ్యతో, రుక్మిణమ్మతో చెపుతాడా? స్కూల్లో ప్రచారం చేస్తాడా? కుర్రాళ్లతో చెప్పి గోడలమీద రాయిస్తాడా? అన్న కుతూహలం......తను చలమయ్యను ఎలా కొట్టగలిగాడా? ఇంతలో యింత జరిగిపోయిందా? అన్న ఆశ్చర్యమూ.....పద్మమణి ఇంట్లో ఒక్కర్తె ఉన్నట్లుందే! క్రిందిభాగం కూడా తాళంవేసివుంది! సత్యం టైలరింగ్‌కు వెళ్లివుంటాడు......అవకాశం చూచుకునే సాహసించాడన్నమాట! తను సమయానికి రాకపోయినట్లైతే పరిస్థితి బాగా విషమించేదే!......మొదలైన ఆలోచనలూ......శ్రీధర్ అలానే కూర్చుండిపోయాడు. పద్మమణి ప్రవేశించి ఇదుగో "కాఫీ" అనే దాకా అతనికి బాహ్యస్మృతి లేదు......

"మీ అమ్మగా రెక్కడికి వెళ్లారు?"

"నాలుగురోజులైంది, ఆమె చెల్లెలు ఉత్తరంవ్రాస్తే వూరెళ్లింది పాపతో సహా."

"క్రింద అద్దెకున్నవాళ్లూ?"

"వాళ్లు ఖాళీచేసి వారం రోజులౌతోంది....మీ రీ మధ్య రాలేదు కదూ."

"కుర్రవాళ్లకి పరీక్ష లొస్తున్నాయి. తీరటంలేదు !.... అయితే ఎవరూ లేనిది చూచే సాహసం చేశాడు—ఈ మణిని అపహరించేందుకు !"

"ఇది కౌస్తుభమణి అని తెలీలేదు."

"అవును, దీనిస్థానం అక్కడకాదు, యిక్కడ కదూ!" అంటూ శ్రీధర్ లేచివచ్చి ఆమెను కౌగలించుకోబోయాడు. ఆమె వారించి అతని భుజాలమీద చేతులువేసి దూరంగా ఉంచుతూ "మీ తపస్సు మాటేమిటి?" అంది నవ్వుతూ.

"నువ్వే నా తపస్సు" అంటూ ఆమెను, దగ్గరకు లాక్కున్నాడు.

## 20

ఆ రాత్రి శ్రీధర్ భోజనమయ్యాక అలవాటు ప్రకారం చదువుకోకుండా ఆలోచిస్తూ మంచంమీద పడుకున్నాడు. సాయంత్రం జరిగిన సంఘటనని గూర్చి, పొందిన అనుభూతిని గూర్చి అతనిలో ఎడతెగని ఆలోచనలు రేగుతున్నాయి.

పద్మమణి తనలో యిన్నాళ్లూ కలిగిస్తున్న విశిష్టమైన అనుభూతి ఏదైతేవుందో ఆ సర్వస్వాన్నీ చేతుల్లోకి తీసుకుని తనదిగా చేసుకోవటమౌతుందని భావించాడు ఆమెను శారీరకంగా పొందటం; కాని ఆ ప్రతీక్ష యథార్థంలో నెరవేరలేదు! ఆ స్వప్నానుభూతీ, స్వర్గమూ, యింద్రియానుభవపు పరిధిలో యిమిడిపోవటానికి నిరాకరించాయి; ఆత్మగతమైన పద్మమణి శాపగ్రస్తఅయిన ఊర్వశిలా కేవలం సామాన్యస్త్రీగా తన చేతుల్లో మిగిలి పోయింది.! అక్కడినుంచీ వచ్చివేస్తున్నపుడు అనిపించింది—ఏమిటో పోగొట్టుకొన్నట్లు; మణిని పోగొట్టుకొని గాజుపెంకును అరచేతిలో దాచుకొన్నట్లూ......ఇది నిజంగా వ్రతభంగమే; తపోభంగమే తనకు! కాని ఎవరిది తప్పు? ఇందులోనూ తన యిష్టానిష్టాలకు అతీతమైన పరిస్థితుల ప్రాబల్యమే గోచరిస్తోంది. తనకు వినిపించిన మాటలూ, కనిపించిన దృశ్యమూ, చలమయ్య ముష్కరత్వం అలాంటివి—క్షణంలో అంతా జరిగిపోయింది. పద్మమణిని రక్షించటం, చలమయ్యతో ముష్టియుద్ధం; తన్నుతనే మరిచిపోయాడు. ఆ సంఘటన తర్వాత పద్మమణితో తన ప్రవర్తన నడిచినస్థాయి వేరుగావుంది. ఆమెను ఒక్కసారిగా తనదిగా భావించి స్పృశించటంతో తన శరీరమే పెత్తనం సాగించింది. పద్మమణి తనలో వెలిగించే జ్యోతి శరీరానుభూతిలో యిముడని తత్త్వంగా తనకు అందకుండా పోయింది! మిగిలింది కేవలం శరీర సుఖం!

పన్నజాజుల వాసన....

తార పలకరిస్తోంది: "ఏమండీ, మంచినీళ్లు కావాలా?".. వినిపించినా పలకలేదు. శ్రీధర్. "ఏమిటి, అప్పుడే నిద్రపోయారా?" అంటోంది దగ్గరకు వచ్చి...ఊఁ?" అన్నాడు... "మంచినీళ్లు?" "వద్దు" అన్నాడు, కళ్లుమూసుకునే. తార వెళ్లిపోతున్న కదలికలో ఆమె కోపాన్ని పసిగట్టాడు. ఆమె వెళ్లి దీపాన్ని "ఉఫ్" అని గట్టిగా వూది ఆర్పేసింది.

'మంచినీళ్లు' భార్యభర్తల మధ్య దీపం ఆర్పివేయటానికి పూర్వం, ఒక సంకేతం. అలవాటు మీద ఏర్పడిన సంకేతం—యిద్దరూ ఒకమంచం మీద చేరటానికి. ఆమె పడుకొంటూండగా ఒక్కొక్కసారి శ్రీధర్ 'తారా మంచినీళ్లు కావాలి' అంటాడు. 'లేచి వెళ్లి తాగండి' అంటుంది తన అసమ్మతిని సూచిస్తూ. వెంటనే ముసుగు బిగతీసి పడుకుంటుంది. లేకపోతే 'అప్పుడే తాగకూడదా కావలసినన్ని?' అంటూ లేచి ఏమీ తెలీని ముగ్ధలా మంచినీళ్లు గ్లాసునిండా పట్టుకొస్తుంది. భర్త గ్లాసుతోపాటు ఆమె చేతినికూడా పరిగ్రహిస్తే సిగ్గూ విసుగూ నటిస్తూ పక్కన చేరుతుంది. ఒక్కోసారి తార యాదాలాపంగా అడుగుతుంది, 'దీపం తీసెయ్యనా' అని, అప్పుడు శ్రీధర్ ఆమెను కోరటం జరుగుతుంది...ఇవాళే ఆమెను మొదటిసారిగా నిరాకరించాడు.

"సాయంత్రం ఎక్కడికి వెళ్లారేమిటి, చాల ఆలస్యంగా వచ్చారూ?" అని అడుగుతోంది తార చీకట్లోంచీ. శ్రీధర్ జవాబు చెప్పలేదు. "మిమ్మల్నే, అప్పుడే నిద్రా?...ఇవాళ చదువుకోనూ

లేదు...ఏమిటి స్కూల్లో అంత తలమున్కలుగా వుండాపని? అలసిపోయినట్లున్నారు!...ఏమి ఉద్యోగమండీ! బతకలేక బడి పంతులు అన్నారు. మానాన్న మంచి ఉద్యోగం వేయిస్తానంటె వద్దన్నారు. హాయిగా పొలం దున్నుకున్నా నయం! మిమ్మల్ని అని లాభమేమిటి, నాఅదృష్టం...ఇటు ఇంట్లో చాకిరీ చేసుకోలేక, పిల్లల్తో వేగలేక నేను చస్తున్నాను. అటు మీరు ట్యూషన్లూ, స్కూలూ, పైగా ఎలక్షను డ్యూటీలు ఒకటే యాతన పడుతున్నారు! ఏం సుఖం? మా అక్కయ్య చూడండి, వాళ్ల కీఏడాది రైసుమిల్లులో ముప్ఫైవేలు లాభం వచ్చిందట—మరచిపోయా, మురళీని బాపట్ల డాక్టరుగా వేశారట...." మురళీ సంగతి విని మౌనంగా వుండలేకపోయాడు శ్రీధర్. "ఎప్పుడొచ్చింది వుత్తరం?" అన్నాడు.

"మేలుకునే వున్నారన్నమాట! అప్పుడే నిద్రపోయినట్లు నటించారే!"

"ఉత్తరం."

"మధ్యాహ్నం మీ రెళ్లాక వచ్చింది...పాప అప్పుడే చించేసింది కూడా."

"ఎవరు మీ అక్కగారేనా వ్రాసింది? అయితే నువ్వే చించి వుంటావు అందులో ఏవో పేచీ విషయాలుంటే.."

"ఏం కర్మ? అలాంటివి మీరూ మీవాళ్లూ చేసేవి! నాకేం భయంలేదు! అవును, ఏమైనా రాస్తుంది! ఏం? మీ ప్రయోజకత్వాన్ని చూచి లోకం మురిసిపోవాలా?' 'ఏమిటే, నీకు మరది అసలు తిండి పెడుతున్నాడా? ఉత్తరమే రాయలేదు, కార్డుముక్కన్నా కొని పెడుతున్నాడా?'అని యోగక్షేమాలు వ్రాసింది... ఇంకా చెప్పమంటారా?"

శ్రీధర్ పలకలేదు. ఇదంతా మామూలు రోకటి పాటే అయిపోయింది అతనికి. తార అలాగే మరికొన్ని మాటలు అంటూ గొణుక్కుంటూ నిద్రలోపడింది.

శ్రీధర్ ఆలోచన సాగుతూనే వుంది...తను పద్మమణిని వివాహమే చేసుకుని వుంటే ప్రేమ వివాహమే అయినా ఈపాటికి పద్మకూడా తారలాగే "మంచినీళ్లు కావాలా?" అంటూ వుండక, ఇంకోవిధంగా ఎలా వుండేది?...ఇదంతా మంచినీళ్లు తాగటమే!... గ్లాసులు భిన్నంగా వుండవచ్చు, తాగేవి మంచినీళ్లే!...'పూవులు వేరు, మధువొక్కటే' అన్నదే చంద్రావతి. మద్రాసులో దానికిదే అర్థమా? అదే నిజమా? ఆమెతో స్నేహం చేసినందుకు రౌడీల చేత దెబ్బలు తిన్నాడు! తన మీద జరుగుతున్న ప్రచారానికి అప్పుడెంత భయపడ్డాడు! ఇప్పుడు చలమయ్య బెదిరంపులకి చీమ కుట్టినట్లైనా లేదు!—అదీ తనలో వచ్చిన మార్పు! చంద్రావతి పట్ల నిలుపుకోలేని విశ్వాసం, యిప్పుడు పద్మమణిపట్ల ఎలా నిలుపుకోగలుగ తున్నాడు! పద్మమణి ఏ విధంగా ఆదర్శమూర్తి? పతివ్రతకాదు, భారతీయ సంస్కృతికి ప్రతినిధి కాదు, ఏమీ కాదు! ఒకనాటి స్వప్నం. ఆమె సాన్నిధ్యం తనలో ఏమిటో ఆనందాన్ని కలిగిస్తుంది, ఎందుకు? ఆ ఆనందం కేవలం వాంఛ, శారీరకానుభవం తాలూకు ప్రతీక్ష కాదు....అని తెలిసింది యివాళే! ఇదమిత్థమని దాని ఆధారాన్నీ, ఉపాధుల్నీ నిర్ణయించటానికి వీల్లేని స్వాప్నికానందం! తన్మయత్వం! దాన్ని యివ్వాళ 'మట్టిపాత్ర' తో కొలిచే ప్రయత్నం విఫలమైంది! కాని యిందులో ఏది సత్యం, ఏది అసత్యం? 'మట్టిపాత్రే' సత్యం కదా బహిరుపాధుల్నిబట్టి? అందులో యిముడని 'స్వప్నం' అసత్యమే అనాలి. కాని ఆ'స్వప్నం'—ఏళ్ల తరబడిగా తనలో దాచుకున్న 'స్వప్నం' — అదే లేకపోతే 'మట్టిపాత్ర 'కూ కేవలం శరీర సుఖానికి విలువేమిటి? ఆ 'స్వప్నం' తనలో వికసించటం వల్లనే జీవితం మీద అధికారం, యిదివరకులేని స్వేచ్ఛ,ధైర్యమూ,ఆసక్తీ తనకు లభ్యమయ్యాయి! ఏ సమస్యను కానీ ఎదుర్కోగల ఆత్మవిశ్వాసమూ తనలో కలుగుతోంది! ఆ స్వప్నమే ఆదర్శాలు శిథిలమైన తనకు ధ్రువతార! అది తన ఆత్మశక్తి!

పద్మమణి పరీక్షలు వ్రాయటానికి నెల్లూరు (ఆంధ్రా యూనివర్శిటీ అప్పట్లో) వెళ్లింది. అక్కడినుంచీ పరీక్షలు బాగా వ్రాశాననీ, తల్లికి జబ్బుగావుందనీ, తను పినతల్లి యింటికి వెళ్లి తల్లిని తీసుకువస్తాననీ ఉత్తరం వ్రాసింది.

శ్రీధర్ చలమయ్యలు మాట్లాడుకోవటంలేదు. పరోక్షంగా తనను గూర్చి, తన నైతిక ప్రవర్తనను గూర్చి చలమయ్య విమర్శిస్తున్నాడని ఒకరిద్దరి ద్వారా శ్రీధర్‌కు తెలియవస్తూనే వుంది. శ్రీధర్ యీసారి ప్రచారాలనూ, తనను గూర్చి యితరులు అనుకునే మాటల్నీ పట్టించుకోదలచుకోలేదు.

ఒకరోజు బజారులో వెళ్తూవుంటే సోడాకొట్టు దగ్గర కూర్చున్న రంగడు లేచి దగ్గరకువచ్చి 'అన్నా బాగున్నావా?' అన్నాడు. వాడు తనను పలకరించటం ఆశ్చర్యం కలిగించింది. "ఆఁ...నువ్వు బాగున్నావా? ఏం విశేషం?" అన్నాడు శ్రీధర్. "ఏమీలా....ఊర్కేనే...యింటికేనా?" "ఇదుగో ఏవో యింటికి వస్తువులు కావాలంటేనూ..." అంటూ శ్రీధర్ ఒక దుకాణంలో ప్రవేశించాడు. రంగడు కూడా వెంటనే వుండి శ్రీధర్ వస్తువుల్ని కొన్న తర్వాత ఆసంచీ తను తెస్తానని పుచ్చుకున్నాడు.

రంగడు చిన్నతనంలో శ్రీధర్‌తో ఆడుకునేవాడు. నాలుగో తరగతిలో సహాధ్యాయి. తర్వాత బడి మానేశాడు. అటు వ్యవసాయానికీ పనికిరాలేదు. అల్లరిగా తిరుగుతూ వుండేవాడు. తల్లిదండ్రుల్ని పీడించి యింట్లో ధాన్యం దగ్గరనుంచీ, తల్లి మెళ్లో గొలుసుదాకా కొల్లగొట్టేశాడు. తండ్రిపోయాక దొంగతనాలు చేస్తూ ఒకసారి జెయిలుకు వెళ్లాడు. ప్రస్తుతం వాడి వ్యాపకం జూదగృహాల దగ్గర కాపలా; అప్పుడప్పుడు చిల్లరకొట్టు వర్తకు లొకరిద్దరి మీద దాడి (దాని క్కారణం వాళ్లు తనుతెచ్చిన దొంగసొత్తుల ధర యింకా పూర్తిగా ముట్టజెప్పలేదని తిట్లల్లో వివరిస్తూ వుంటాడు)-వాళ్లు వాడికి సిగరెట్లూ, అగ్గిపెట్టెలూ నైవేద్యంగా సమర్పించుకొంటూ శాంతింపజేస్తూ వుంటారు!

ఈ రంగడు శ్రీధర్‌ను ఎప్పుడైనా పలకరిస్తుంటాడు కాని యిలా ఎప్పుడూ వెంబడించలేదు. ఏదో విశేషమే వుందని గ్రహించాడు శ్రీధర్. ఇంటికి వస్తూ రంగడు శ్రీధర్‌తో అన్నాడు "ఈమద్దె ఆ బళ్లో శలమయ్య అనే టీశర్తో నీకు తగాదా వచ్చి నువ్వు వాణ్ణి పట్టుకుని కొట్టినావంటే...అమాట నేను నమ్మలేదనుకో...ఏం దబ్బా! మా అన్న ఎప్పుడూ తన సదువేమో

తనేమో, అంతేగాని అసలు ఆడోళ్ల జోలికే పోడే! నాకు తెలీదా!.. ఈ తగాదా అంతా శలమయ్యే పుట్టించి వుంటాడు అన్నాను. వాడు నారిగాడికీ మస్తానుగాడికీ సారాయి బోయించి, నిన్ను సూపించి, సమయంసూసి కొట్టమని పురమాయించినాడు మొన్న...వాళ్ళు నాతో యీ మాటంటే అరెరెరె ఆయన మా అన్నయ్యే, మీరాయన జోలికి పోతే మీ వుచ్చె లెగరగొడ్తా!...నేన డుగుతా వూరుకోండి అనిజెప్పి, నిన్నడుగుతే ఏమాటా తెలుస్తుంది గదా అని, అందుకే నువ్వు బజార్లో అగుపడితే ఎంబడే వొస్తి... ఏందంటావ్ యీ సంగతి?"

శ్రీధర్ రంగడికి అర్థమయ్యే విధంగా తనకూ పద్మమణికీ గల స్నేహాన్ని, చలమయ్య పద్మమణి మీద చెయ్యబోయిన అత్యాచారాన్నీ, తను సమయానికి వెళ్లి అడ్డుపడటాన్నీ వివరించాడు. అంతావిని రంగడు "అదా సంగతి! వాడు జెప్పేది అది కాదు, నువ్వే ఆపిల్లదాన్నేమో అంటే, తను మర్యాదకాదయ్యా అని బుద్ధిజెప్పబోతే అప్పుడు నువ్వు కొట్టి అవమానం చేస్తివుంట...వాడు పార్టీ నంబరంట గూడా..." "అవును రంగయ్యా! అందుకే ఆ గుండెలు! లేకపోతే పొట్ట చేత్తో పట్టుకుని ఈవూరికి వచ్చి, మాయింటి దగ్గర మా ఆశ్రయంలో వుండి, మా సాయం పొంది, ఈ రోజు నన్ను కొట్టించేదానికి సిద్ధమౌతాడూ! దిక్కులేని ఆడమనిషి మీద దౌర్జన్యం చేసింది చాలక, సిగ్గు లేకుండా నన్ను సాధిస్తామను కుంటున్నాడా? అవును, ధైర్యం రాదూ మరి! మానాన్న పోయారు; మేం అన్నదమ్ములం వేరుపడ్డాం, నాకు వెనకాల బలగమేముందీ! ఎందుకూ కొరగాని బడిపంతుల్ని; నేను ఏపార్టీ వాళ్లలోనూ చేరలేదు! నాకు రక్షణేమిటి? వాడు కొట్టిస్తే పడాల్సిందే మరి రంగయ్యా!...కాలం మారిపోయింది, ఉన్న ఊరైనా పరాయి ఊరైనా ఇప్పటి పరిస్థితియిదీ!" అన్నాడు శ్రీధర్.

"అదేమిటన్నా మేమంతా సచ్చిపొయ్యామా? ఎంత శెడినా మనమంతా ఒకటే! నేను సూసుకుంటాలే! నీ కెప్పుడన్నా అవసరమొస్తే నాతో ఒకమాట సెప్పు సాలు...శలమయ్యేం జేస్తాడు శెలమయ్య! సరే నే నొస్తా..." అని వెళ్లిపోయాడు రంగడు.

ఆ తర్వాత మూడు రోజులకి చలమయ్యను సినిమాదగ్గర రౌడీలు తన్నారని స్కూల్లో చెప్పుకున్నారు. వాళ్ల తాలూకు స్త్రీని సినిమా వదలి పెట్టిన తర్వాత వస్తుంటే చలమయ్య అమర్యాదగా పిలిచాడనే కారణంగా, ఆ స్త్రీ బూతులు తిట్టటం... రౌడీలు తన్నటం, అంతా గబగబా రెండు నిముషాల్లో జరిగిపోయిందట. తర్వాత చుట్టూ జనంచేరి పెద్దగోల జరిగిందట. "ఏమయ్యా, బడిపంతులివి, అలగావాళ్లతో నీ కెందుకు?" అంటూ పదిమందీ సానుభూతి చూపుతూ బుద్ధి చెప్పారట. చలమయ్య స్కూలుకి రాలేదు.

ఆ వేసవి సెలవుల్లో చలమయ్యను పుత్తూరు స్కూలుకు బదిలీ చేశారు. అతను రాచకీయాల్లో జోక్యం కల్పించుకున్నట్లు రిపోర్టు వచ్చిందనీ, అటువంటి రిపోర్టులకిక మీద అవకాశం యివ్వకూడదనీ వార్నింగ్ కూడా వచ్చిందట.

శ్రీధర్‌లో యీసంఘటనలు ఎన్నో ఆలోచనల్ని రేపాయి. చలమయ్యను రౌడీలు తన్నటానికి తనే కారణమేమోనని అనుమానం కలిగి, రంగడు కనిపిస్తే పిలిచి అడిగాడు కూడా. "అబ్బే, లేదన్నా! ఎవడి పాపాన వాడు పోతాడు...వాడికి ఆడవాసన అంటే ముక్కు లెగరెయ్యటం వుందంట, అందుకే మావాళ్లు మక్కెలిరగదన్నారు..." అన్నాడు నవ్వుతూ. బహుశా చలమయ్య ఆ స్త్రీని నిజంగా ఏమైనా సరగ మాడాడేమో! లేక రౌడీలు ఆ స్త్రీ ద్వారా చలమయ్యకు పరీక్ష పెట్టారో! సమాజంలో అడుగు పొరలోని వ్యక్తులు కూడా మరీ గుడ్డిగా ప్రవర్తించరనీ, వాళ్లల్లోనూ న్యాయాన్ని గూర్చిన స్పృహ వుంటుందనీ, వాళ్లు తెలివి తక్కువ వాళ్లు కారనీ గ్రహించాడు శ్రీధర్.

చలమయ్య చరిత్రను పర్యాలోచన చేస్తుంటే మార్క్సిజమ్ దేశంలో పేదల్నీ దీనుల్నీ ఒకవైపు మనుషుల్ని చేస్తూనే మరొకవైపు వాళ్లమీద సారామత్తులాగా ఎలా పనిచేస్తున్నదీ, పాశవిక ప్రవృత్తుల్ని ఎలా ప్రకోపింప జేస్తున్నదీ అవగతమైంది శ్రీధర్‌కు. ఆర్థిక సమానత్వం; అందరికీ తిండీ, బట్టా, యిల్లూ; సమాజంలో సమానమైన అవకాశాలూ—సాధించదగిన లక్ష్యాలే; కాని ఆ లక్ష్యసాధన మనిషి ఆంతరంగిక సంస్కారాన్ని ధ్వంసం చెయ్యకూడదు!...తనకి పెద్దగా డబ్బు లేకపోయినా, కార్లూ మేడలూ లేకపోయినా, తను ఏ ధనవంతుడికీ సంస్కారంలో తీసిపోడు; ఎవరి ఎదుటా భయపడుతూ సిగ్గుపడుతూ ప్రవర్తించడు. తన వ్యక్తిత్వం యిచ్చే ఆత్మవిశ్వాసం తనకు ఎప్పుడూ వుంది; ఇది కేవలం కార్లూ మేడలూ యిచ్చే ఆత్మవిశ్వాసం కాదు! చదువూ, స్వతంత్రమైన ఆలోచనా యిచ్చే ఆత్మవిశ్వాసం! దీని బదులు ధనవంతుల మీద వర్గద్వేషాన్ని పెంచుకుని దాన్నే ఆత్మవిశ్వాసంగా భ్రమపడే వ్యక్తులు నినాదాలతో తృప్తిపడి, జన్మహక్కైన తమ వ్యక్తి స్వాతంత్ర్యాన్నీ సంస్కారాన్నీ పార్టీకి అప్పగిస్తారు. పార్టీ అండనీ, అదియిచ్చే మద్దతునీ చూచుకుని మత్తెక్కిన వాళ్లలా ప్రవర్తిస్తారు. అలాంటివాళ్లకి భవిష్యత్తు ఏమిటి? ధనికవర్గాల వారి అధికారాన్నీ అదుపునీ తప్పించుకోవాలని చూస్తూ పార్టీ యంత్రానికి బానిసలు కావటం తప్పు! ఈ దురవస్థ పోవాలంటే చదువూ సంస్కారం అభివృద్ధి చెందాలి. స్వతంత్రభావాల్ని జనం ఊపిరిగా పీల్చుకోవాలి. ఈ లక్ష్యం ఆర్థికమైన జీవితావసరాలను గూర్చిన లక్ష్యాలకు ఎందులోనూ తీసిపోదు. వాటికంటె ముఖ్యమైంది కూడా! బీదవాడైనా చలమయ్య స్వయంగా తిండీ బట్టా సాధించాడు. సంస్కారం ఎప్పుడు సాధిస్తాడు? పార్టీలో ప్రవేశించిన అతని సంస్కారం రంగనివంటి రౌడీల సంస్కారాని కంటె తగుస్థాయిలో వుందే! వాళ్లలో వాళ్లకున్న ఆప్యాయతా, స్నేహధర్మం, న్యాయదృష్టి చలమయ్యలో లోపించాయే! లేకపోతే శేషాద్రిగారూ, పద్మమణి, తనూ, ఏం చేశారని చలమయ్య యిలా అవిశ్వాసంతో ప్రవర్తించటం!... రాచకీయాలవల్లా, రాచకీయపార్టీలవల్లా మనుషుల్లో సంస్కారం, సమరసభావం తరుగుతూ వుండేతప్ప పెరగటంలేదే!

## 21

ఓబయ్య నరసింహులిమీద వ్యాజ్యెం వేసి రెండేళ్లు కావస్తోంది. వాయిదాలమీద వాయిదాలు పడుతున్నాయి. నరసిం

హులు వూరుకోలేదు. ఓబయ్య తన పొలంలో ప్రాత బావిని లోతుచేసి పునర్నిర్మాణం చేసేందుకని గవర్నమెంటు దగ్గర నుంచీ రెండువేలు కొంత సహకారధనంగా, కొంత ఋణంగా పొందాడనీ, అది డిప్యూటీ తాసిల్దారుకు లంచంపెట్టి సాధించాడనీ, యింతవరకు పూడిపోయిన తాలూకు గొయ్యి అలానే ఉందనీ, కలెక్టరును ఈ విషయమై విచారించవలసినదిగా పిటీషను పెట్టాడు. ఈ సంగతి బయటికివచ్చి విచారణ జరిగితే ఓబయ్య మొత్తం డబ్బు వెనక్కి కట్టవలసి రావటమేకాదు, తన పొలం నేరేడుమ్రాను బావి నీటితోనే పూర్వంనుంచీ సాగయ్యేది అనే ఓబయ్యతరపువాదనని ఖండించేందుకు వీలు దొరుకుతుందనీ, నరసింహులు అలాచేశాడు.

పిటీషను విచారణకు వచ్చేసంగతి ముందుగానే ఒక గుమాస్తాద్వారా తెలిసింది ఓబయ్యకు. వచ్చి శ్రీధర్‌తో చెప్పాడు. తను శ్రీధర్ చదువు కిచ్చినడబ్బు యిప్పుడు తనకు అవసరంగా కావలసి వచ్చిందనీ, శ్రీధర్ సర్దితేగాని వీల్లేదనీ కూర్చున్నాడు. శ్రీధర్ బాంక్‌లో వెయ్యి రూపాయలు దాచుకున్నమాట నిజమే. ట్యూషన్‌లు చెప్పి ఆర్జించిన డబ్బు. దానితో యింట్లో అందరికీ మంచి బట్టలు కొనాలనీ, ఫర్నిచర్ కొనాలనీ, వేసవి సెలవుల్లో బెంగుళూరు, మైసూరు సరదాగావెళ్లి ఆ పని చేయాలనే ఉద్దేశంతో శ్రీధర్ దాచాడు. కాని ఓబయ్య తన కిది ప్రాణాంతకమైన అవసరమనీ, తన పరువుదక్కదనీ కూర్చున్నాడు. తార కూడా ఇంటి అవసరాలని అలావుంచి ఆ వెయ్యి రూపాయలూ ఓబయ్యకు యివ్వమనే అన్నది. పైగా తన మెడలోని గొలుసు కూడా యిచ్చింది. శ్రీధర్‌కు యిది న్యాయంగానే తోచింది. సమయానికి ఓబయ్య తన చదువుకు సాయం చేశాడు మరి! ఆ విశ్వాసం తనకు ఉండాలి కదా! ఈ గవర్నమెంటు ఋణం సంగతి తెలిశాక ఓబయ్య వ్యవహారా లెలా నిర్వహిస్తున్నాడో అని అతని సమర్థతమీదా అనుమానం కలిగింది. శ్రీధర్ ఓబయ్యకున్న లావాదేవీల సంగతి వూళ్లో వాకబు చేశాడు శ్రద్ధగా. ఓబయ్య తన పొలాన్నీ, ఇంటినీ యిదివరకే తనఖాపెట్టి బాగా ఋణగ్రస్తుడై ఉన్నాడని తెలిసింది. ఓబయ్యకు వ్యవసాయంలో శ్రద్ధ, జాగ్రత్త తక్కువ కావటంవల్ల దుబారా ఖర్చూ, అనవసరమైన నష్టమూ ఎక్కువగా ఉంటోందనీ, దక్కవలసిన ఫలితం దక్కటంలేదనీ కూడా శ్రీధర్‌కు క్రమంగా తెలిసి వచ్చింది. లేనిపోని డాబులకుపోతూ, ఋణంచేసి తెచ్చినడబ్బు జేబులో గలగలలాడించుకొంటూ, మధ్యవర్తిగా, పెద్ద వ్యవహర్తగా నలుగుర్లో తిరగాలని ఓబయ్య ఆశయమని గ్రహించటానికి అతనికి ఎంతోకాలం పట్టలేదు.

ఓబయ్య గవర్నమెంటు డబ్బు తిరిగి కట్టేశాడు. లంచం తిన్న డిప్యూటీ తాశిల్దారు చిక్కులో పడ్డాడు; యిలాంటివే మరికొన్ని కేసులు కూడా ఉండటంతో అతనికి ఉద్యోగం తగ్గించారు.

ఓబయ్య తన వ్యాజ్యెంలో కూడా పై విషయాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందికాని రామలింగయ్య తండ్రి కాలంలోనే ఓబయ్య పొలంలో బావి పూడిపోయి ఉండటం మూలాన ఒక పర్యాయం నేరేడుమ్రాను బావి మరామత్తుకు ఓబయ్య తండ్రి పెద్ద మొత్తంయిచ్చి ఆ బావి నీటిలో హక్కు భుక్తాలు వ్రాయించుకుని ఉండటంవల్ల ఆ పాత అగ్రిమెంటు కాయితం పైకి రావటం మూలంగా ఓబయ్య తన కేసు గెలిచాడు. ఆవిధంగా కాలం మడతలలో అడుగునపడ్డ ఒక సత్యం బయట పడింది! ఇది కూడా శ్రీధర్‌కు ఒకవిధమైన కనువిప్పు కలిగించింది. న్యాయమనేదీ, సత్యమనేదీ ఒకరి పక్షాన్నే ఎప్పుడూ ఉంటుందనుకోవడం భ్రమ. తన తండ్రిగారు ఎంత ఉత్తములైనా, ఆయన ఎక్కడో అక్కడ, తెలిసో తెలియకో స్వార్థంతో వ్యవహరించి ఉండకపోలేదనే అభిప్రాయం ఏర్పడ్డది. లోకంలో మంచివాళ్లుగా కనిపించే వాళ్లవల్ల ఎక్కడా అన్యాయం జరగదనీ, చెడ్డవాళ్లుగా కనిపించే వాళ్లవల్ల ఎప్పుడూ న్యాయం నిలబడదనే అనుకోవటం ఒక రకమైన అజ్ఞానం. ఏ విషయమైనా ఎప్పటికప్పుడు నిష్పాక్షికంగా లోతుకు వెడితేగాని సత్యం బోధపడదు. ఇలా ఆలోచిస్తూ వుంటే శ్రీధర్‌కు తనకు తెలిసిన మంచివాళ్లల్లో లోపాలూ, చెడ్డవాళ్లల్లో సుగుణాలూ ఎన్నో గోచరించాయి. జీవితం, విస్పష్టమైన వర్ణ రేఖా చిత్రంకాదు, అలుక్కుపోయిన వర్ణాంకిత చిత్రంగా కనిపించింది—ఇందులో విశ్లేషించి వేర్వేరు భాగాలుగా తెలుసుకోవలసిన దానికంటె, యథాతథంగా మిశ్రమంగా గ్రహించవలసిన సత్యమే ప్రధానంగా తోచింది. ఏమంటే విశ్లేషణకు అంతూ పొంతూ కనిపించటంలేదు. ఎంతదూరమైనా సూక్ష్మాతి సూక్ష్మంగా విశ్లేషిస్తూ పోవచ్చు; అసంతృప్తి మిగిలే ఉంటుంది. కాని మొత్తంగా సమాహారంగా గ్రహించటంలో ఆబాధ లేదు; జీవితంలో ఏకత్వం సిద్ధిస్తుంది, తృప్తి లభిస్తుంది!

ఆంధ్రరాష్ట్ర అవతరణం సందర్భంలో తార అక్కయ్య నాగరత్నమ్మా ఆమె భర్తా మద్రాసునుంచీ కారులో కర్నూలు వెడుతూ మదనపల్లిలో దిగారు. వాళ్లున్నది ఒక్కరోజే అయినా వాళ్ల ప్రభావం తారమీద పని చెయ్యటం, తత్ఫలితంగా ఆమె ప్రవర్తనలో కనిపించిన ఆకస్మికమైన మార్పూ శ్రీధర్‌కు దుర్భరమైంది. శ్రీధర్ వేరు కాపురం పెట్టిన తర్వాత ధనాభావంవల్ల క్రొత్తగా గృహాలంకరణ వస్తువులు, అవసరమైనవి కూడా ఏమీ కొనలేకపోయాడు. తారకూ పిల్లలకూ రెండేళ్లనుంచీ మంచి బట్టలు లేవు. నాగరత్నమ్మ వచ్చీరాగానే ఈ లోపాన్ని గుర్తించటం, తత్ఫలితంగా తార మనస్సు చిన్నబుచ్చుకుని, ఆ కోపాన్నీ విరసాన్నీ శ్రీధర్‌మీద చూపటం జరిగింది. దానికితోడు తార మెళ్లో గొలుసు లేకపోవటానికి కూడా శ్రీధరే కారణమన్న ధోరణిలో నాగరత్నమ్మ మాట్లాడేటప్పటికి శ్రీధర్‌కు బాగా కోపం వచ్చింది. ఆ సందర్భంలో తార తను స్వయంగా యిష్టపడి గొలుసును ఓబయ్య అవసరానికి యిచ్చినట్లూ, అందులో శ్రీధర్ బలవంతమేమీ లేనట్లూ అక్కయ్యకు వివరించకుండా మౌనం వహించింది! ఈ విషయమై బాగా గొడవ జరిగింది. శ్రీధర్ దారిద్ర్యాన్నీ, చేతగానితనాన్నీ ఎత్తిపొడుస్తూ నాగరత్నమ్మ చెల్లెలి దారిద్ర్యానికి జాలిపడుతూ ఒక ఏడుపు ఏడిచింది. శ్రీధర్ నిరుత్తరుడయ్యాడు. ఆ సందర్భంలో నాగరత్నమ్మ భర్త పలికిన సాంత్వన వాక్యాలు మరీ దుర్భరంగా ఉన్నాయి. నాగరత్నమ్మ మరుసటిరోజు తారనూ, పిల్లల్నీ తనతో రమ్మని ప్రయా

ణానికి సిద్ధం చేసింది. కర్నూలునుంచే సరాసరి తారను బందరు తీసుకువెళ్తానని, తనకు తండ్రి వెంకయ్యగారు కూడా వీలైతే అలా తారను తీసుకురమ్మని ఉత్తరం వ్రాశారనీ, శ్రీధర్‌తో యదాలాపంగా చెప్పింది. ప్రయాణం విషయమై తార శ్రీధర్‌తో ఒక్కమాటైనా ప్రస్తావించకుండానే సిద్ధమైంది.....ఆమె పిల్లలతో కారెక్కి వెళ్ళిపోతూవుంటే శ్రీధర్ చూస్తూ నిలబడి పోయాడు.

పద్మమణి ఇంటరు పరీక్షప్యాసై బి. ఏ. కు చదువు తోంది. ఆమె తల్లి అస్వస్థతతో మరణించి ఏడాది అయింది. ఆరోజు చలమయ్య అత్యాచారానికి అడ్డుపడటంతో పద్మమణితో అతని సంబంధం మరింత సన్నిహితమైనప్పటికీ, తర్వాత ఆ విష యమై నిశితంగా ఆలోచించి క్రమంగా పద్మమణి సమక్షంలో నిగ్రహాన్నే అవలంబిస్తూవచ్చాడు శ్రీధర్. ఒకటి రెండుసార్లు ఈ విశేషాన్ని గమనించిన పద్మమణి కూడా అతని నియమాన్ని గౌరవిస్తూనే వచ్చింది. దానితోపాటు, శ్రీధర్ ఏడాదిగా తార పట్ల తన ధర్మమేమిటో తు. చ. తప్పకుండా పాటించాలనే ప్రయత్నంలోనే ఉన్నాడు. ఈకాలంలో అతనికి తార క్రొత్తగా అర్థమౌతూ వచ్చింది కూడా—తారకు స్వతహా వ్యక్తిత్వమంటూ లేదు. మొదట్లో తల్లిదండ్రుల ప్రభావంవల్ల ఒకరకంగా ప్రవర్తిస్తూ తనకు అసంతృప్తి కలిగిస్తూ వచ్చింది. ఆ ప్రభావం ఆమెమీద పనిచెయ్యని సమయాల్లో మద్రాసులో కాపురం పెట్టిన కొద్దిరోజులూ, ఆమె అనుకూలవతిగానే ఉండేది. తర్వాత ఓబయ్య, మంగమ్మా ఆమెకు మార్గదర్శకులయ్యారు. వాళ్ల యిల్లు వదలి వేరుకాపురం పెట్టిన తర్వాత ఆ ప్రభావంనుంచీ కూడా చాలవరకు విడుదల కలగటంతో, ఆమె ప్రవర్తనలో, మాటల్లో తనకు మళ్లీ అనుకూలమైన మార్పు కనిపించింది. దానితో తన వివాహ జీవితాన్ని యిప్పటికైనా స్వచ్ఛందంగా నిశ్చలమైన ఒక ప్రాతిపదికమీద నిర్మించుకోవాలనే ఆశాభావం శ్రీధర్‌లో కలిగింది. అప్పటినుంచి ఆత్మ విమర్శ చేసుకుని తనకు పద్మమణితోగల సంబంధాన్నీ, తారతోగల సంబంధాన్నీ వేర్వేరుగా స్వధర్మయుక్తంగా, నియమబద్ధం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

కాని ఈ ఏడాది ప్రయత్నమూ సముద్రపు టొడ్డున కట్టిన ఇసుకగూడులా ఒక్క తరంగంతో ఎలా కొట్టుకుపో యిందో, తారతో తను భర్తగా నిర్మించదలచుకునే సంబంధానికి ఎప్పటికీ అస్థిరత్వమే విధిగా ఎందుకు వ్రాసిపెట్టివుందో అవగతమవుతూండగా శ్రీధర్ తారా పిల్లలూ ఎక్కివెళ్లిన కారు వైపే చూస్తూ నిలబడిపోయాడు. తారకు వ్యక్తిత్వం లేదు! తనవైన విలువలూ, వూహలూ అంటూ ఏమీ ఆమెకు లేవు! అవి ఏర్పడటానికి తగిన మనస్తత్వం ఏదీ? ఏ వాతావరణంలో, ఏ వ్యక్తుల మధ్యవుంటే వాళ్ల ప్రభావానికి లోబడుతుంది. డాబూ, దర్పమూ, మేడలూ, కార్లూ, ఆమె పుట్టింటివాళ్లు మొదటి నుంచీ చూపుతున్న విలువలు. వాటితో శ్రీధర్ పోటీ పడగలిగితే ఆమె బహుశా అతని ప్రభావాన్ని సహజంగా అంగీకరిస్తుంది! అంతేకాని 'నాలో కేవలం డబ్బు యివ్వలేని సంస్కారం వుంది, యివి అంతకంటె ముఖ్యమైన విలువలు' అని శ్రీధర్ అంటే అతని ప్రభావానికి విధిలేక తాత్కాలికంగా లొంగినా, ఆ విశిష్ట తను గుర్తించి విశ్వాసంతో అంగీకరించే వ్యక్తిత్వం, స్వయం నిర్ణయశక్తి ఆమెకు లేనే లేదు! పుట్టింటినుంచీ ఎంతదూరంగా వున్నా, అటునుంచి ఉత్తరం వచ్చిన రోజున ఆమెలో కలిగే అల జడీ, వైఖరిలో కలిగే మార్పూ, ఎప్పటికప్పుడు ఆమె చాంచ ల్యాన్ని వ్యక్తం చేస్తూనే వచ్చాయి! కాని తను నిరాశ చెందలేదు. క్రమంగా తను జీవితంలో పాఠాలు నేర్చుకుంటూ వచ్చినట్లే ఆమెలోనూ ఒక వ్యక్తిత్వం రూపొందుతూ వస్తోందని శ్రీధర్ ఆశించాడు; భ్రమించాడు. ఆ ఆశ ఒక్కసారిగా భగ్నమైంది... ఆమె నాగరత్నమ్మతో వెళ్లిపోయింది......

చాలరోజులతర్వాత శ్రీధర్ అన్నయ్య యింటికి వెళ్లాడు. "ఇన్నాళ్లూ కనిపించలేదేం ? వ్యాజ్యెం ఓబయ్య వేశాడుగాని నువ్వు వేశావని మేమనుకోలేదే!" అన్నది సూటిగా రుక్మిణమ్మ. "స్కూల్లో పని తొందర, ట్యూషన్లూ....తారావాళ్లు ఇవాళే వూరికి వెళ్లారు. వాళ్లక్కయ్య నాగరత్నమ్మవచ్చి తీసుకెళ్లింది."

శ్యామలకు జడవేస్తున్న రుక్మిణమ్మ అతని ముఖంవైపు నిదానించి చూచి "నీ కిష్టంగానే పంపావా?" అన్నది.

"ఎందుకట్లా అడుగుతావు వదినా?"

"నీ ముఖంచూస్తే తెలుస్తోంది! వచ్చి రెండేళ్లుదాటిం దేమో పుట్టింటికి వెళ్లిరావాలని ఉండదా ఏమిటి? అందుకూ నీకు కష్టమే! వెళ్లి నాలుగు రోజులుండి రానీ!"

"కష్టం లేదు, ఏంలేదు!...అయితే వ్యాజ్యెం సంగతి అన్నయ్య ఏమనుకుంటున్నాడు?.....మరి తాతలనాటి సంగతి, ఉండేహక్కు లేదంటే పోతుందా?"అన్నాడు విషయం మారుస్తూ.

"ఎవరు లేదన్నారు? ఎవరికి పుట్టిందంత అన్యాయం? ఆ సంగతి మొదట ఓబయ్యకే తెలీదు!......ఆ పాత రికార్డంతా నువ్వే చూసిపెట్టిఉంటావని అంటున్నారు మీ అన్నయ్య. చూసిన వాడివి పోనీ ఆ సంగతి వచ్చి చెపితే సరిపోయేది కదా!...కోర్టుల చుట్టూ అనవసరంగా తిరగాల్సివచ్చిందని బాధపడుతున్నారు."

"నేను చూడనే లేదు రికార్డు. అసలు నేను పట్టించు కోలేదు వదినా! ఈ గొడవల్లో తలదూర్చటానికి నాకు తీరికే లేదు."

"ఏమో నాయనా, అంతా మాయ! అన్నీ అనుమానాలూ! మాకేం తెలుస్తుంది నీ సంగతి! పెద్దవాళ్లైపోతే గడ్డాలూ, మీసాలతోపాటు ఎన్నో విద్యలూ, వ్యవహారాలూ కదా!......వాటి సంగతి ఎట్లాఅయినా ఉండనీ నువ్వు వచ్చిపోతూ ఉండు చాలు!.... రేపు శ్యామలని చూట్టానికి వస్తున్నారు పెళ్లివాళ్లు...... ప్రొద్దున్నే వచ్చెయ్, బడికి సెలవుపెట్టు."

"ఏ వూరు?"

"అనంతపురం. అబ్బాయి బి.ఏ. ప్యాసయ్యాడు. వకీలుకు చదువుతున్నాడు. ఉండేవాళ్లే......"

శ్యామల ఇంటర్‌మీడియెట్‌లో ఒకపార్టులో పాసయి మానే సింది. "అయితే శ్యామల పరీక్షలకంటె పెళ్లే సులువు అను కుంటూ ఉందన్నమాట!" అన్నాడు శ్రీధర్.

"అని నీకు నేనొచ్చి చెప్పాను, పాపం!" అంటూ వెక్కిరించింది శ్యామల.

"అయితే ఎందుకు ఫెయిలయ్యావ్? సెప్టెంబరులో ఎందుకు పరీక్షకు వెళ్లలేదూ?"

"నేనేమిటి, నాతో చాలమందే ఫెయిలయ్యారు! సెప్టెంబరుకి ట్యూషన్ పెట్టుకుంటానంటే నాన్న వద్దన్నారు."

"పోన్లే పెళ్లయ్యాక మొగుడి దగ్గర ట్యూషన్ చదివి ప్యాసవుదువుగాని."

"చిన్నాన్నా నీ మాటలన్నీ యిక్కడనేగాని, పిన్నిచేత ఏమాత్రం చదివిస్తున్నావు ట్యూషన్?"

"ఊరుకో, చిన్నాపెద్దా లేకుండా ఏమిటదీ?" అని మందలించింది రుక్మిణమ్మ.

కాని శ్యామల అన్నమాట శ్రీధర్‌లోని గాయాన్ని రేపకుండా పోలేదు. ఆటలాడుతూవుండి ఎక్కడినుంచో హడావుడిగా పరుగెత్తుకు వచ్చిన రామగోపాలాన్ని (రుక్మిణమ్మ కొడుకు) దగ్గరకు లాక్కున్నాడు. "ఒరే, ఆడాళ్లకు చదువురాదుగాని నువ్వు బాగా చదువుకుందువులే!" అన్నాడు యాదాలాపంగా. అయితే నీ కూతుళ్లకు అసలేరాదు!" అంటూ నవ్వింది శ్యామల.

రుక్మిణమ్మ పనిమీద లోపలికి వెళ్లిపోయింది.

"పోన్లేవే, నీకు పెళ్లయి నువ్వు సుఖంగా ఉంటే చాలు" అన్నాడు శ్రీధర్ నిస్పృహగా.

"ఏమిటి చిన్నాన్నా, అలా ఉన్నావ్! పిన్నీ నువ్వూ పోట్లాడుకున్నారేమిటి?" అన్నది శ్యామలదగ్గరగా వచ్చి.

శ్రీధర్ శ్యామలవైపు చూస్తూ చిన్నగా తల పంకించాడు.

"పాపం, పిన్నికి నిన్ను చూస్తే భయం......నేను చెప్పనా, నువ్వు అన్నిటికీ తప్పు పట్టుకుంటావు మహా సీరియస్‌గా...... అసలు నీతో వేగటం కష్టంలే......"

ఈ వ్యాఖ్యానం శ్రీధర్‌కు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అదేమిటి? ఎప్పుడు చెప్పింది నీతో అట్లా అని"

"చెప్పటం కాదులే......నాకు తెలుసు.....ఒకటి రెండు సార్లు చూశాను. నీమాటలు తేలిగ్గా తీసుకోలేదు...ప్రతి దానికీ 'మీ బాబాయి ఏమంటారో' అంటూ భయపడుతుండి..."

శ్రీధర్ ఆలోచిస్తూ ఉన్నాడు. ఈ వ్యాఖ్యానంలో ఎంతవరకు సత్యం ఉంది? శ్యామల అంటోంది....."సీరియస్‌గా తీసుకుంటేనే పోట్లాటలు.....నవ్వేస్తూవుంటే పోతుంది......"

"నువ్వలానే చెయ్యి......"

"నే నంతే! లేకపోతే విచారిస్తూ కూర్చుంటారేమిటి?"

శ్యామల ఈ రెండేళ్లలో ఎంత పెరిగింది!—ఆరిందాలాగ మాట్లాడుతోంది! అనిపించింది శ్రీధర్‌కు......

ఆరాత్రి ఆ విషయమే ఆలోచిస్తూ పడుకున్నాడు.

ప్రస్తుతం విద్యార్థులు దేన్నీ సీరియస్‌గా తీసుకోవటం లేదు. స్కూలు పిల్లల్లోనూ, కాలేజి పిల్లల్లోనూ అతడు గమనించినంతవరకూ ఈ విషయం పెద్ద లోపంగా కనిపించింది. చదువూ, పరీక్షలే కాదు, కవిత్వం, ప్రేమవంటి విషయాల్లో కూడా చాలా తేలిగ్గా భావిస్తున్నారు. ఈ ఆరేడేళ్లలోనే ఇంత భేదం అతనికి గోచరమౌతోంది. కాని మరో దృక్పథంనుంచి చూస్తే ఈ ధోరణిలోనూ మంచి ఉందేమో! "నువ్వు మహ సీరియస్‌గా ఉంటావు!" అని విమర్శించింది శ్యామల. తారతో తన సంబంధాన్ని మొదటినుంచీ తను సీరియస్‌గానే తీసుకున్నాడు! దాని క్కారణం తనలోని ఒక ఆదర్శ భావన. ఆ భావనకు తగినట్లు ఆమెకు వ్యక్తిత్వం ఉండాలని ఆశించాడు. అలా లేదని కోపగించాడు, విమర్శించాడు, అలిగాడు. కాని ఆమె లేదు. అల అంతే! వ్యక్తిత్వాన్నీ, విలువలనీ, స్వయం నిర్ణయశక్తినీ యిలా ఎంత మంది ఆలోచిస్తారు! పుట్టి పెరిగిన వాతావరణంలో అందరూ ఎలా ఆలోచిస్తారో, దేన్ని ప్రధానంగా భావిస్తారో, ఆ ధోరణిని బట్టి బ్రతుకుతూ ఉంటారు చాలమంది. జీవితం చాల భాగం అనుకరణ, అలవాటు! చాల మందికి జీవితం పూర్తిగా అలవాట్లమయం! ఈ యాంత్రిక శక్తుల్నించీ, స్వకీయమైన ఇచ్ఛ, నిర్ణయం అనేది ఏర్పరచుకోవాలనే వ్యక్తిత్వం ఎవరికో కొందరికే ఉంటుంది! వాళ్లు దానికోసం అన్వేషిస్తూ, బాధపడుతూ ఉంటారు. జీవితం వాళ్లకు అడుగడుగునా బాధగానే ఉంటుంది! కాని ఒకసారి తనదైనమార్గం స్పష్టం అయ్యాక, జీవితంమీద అధికారం లభిస్తుంది; తర్వాత యాంత్రిక శక్తులు అలాంటి 'వ్యక్తుల్ని' ఏమీ చెయ్యలేవు!

శ్రీధర్‌కు పై ఆలోచనదృష్ట్యా తనకూ తారకూ గల భేదం, యిద్దరి మధ్యా వున్నదూరం స్పష్టంగా గోచరించింది. తను వ్యక్తిత్వంకోసం, జీవితంమీద అధికారం కోసం అన్వేషిస్తున్నాడు మొదటినుంచీ. ఆ దృష్టితోనే, అందరూ తనలాంటివాళ్లనే భ్రమతోనే వ్యవహరిస్తున్నాడు. అందుకే యితరులు తనకు అర్థం కాలేదు! ఇతరులు యాంత్రికంగా వాళ్లేం చేస్తున్నారో వాళ్లకే అర్థం కాకుండా, రకరకాలైన పేర్లతో అన్వేషించేది శరీరసుఖం, లేక డబ్బు, లేక మనుష్యులమీద అజమాయిషీ-తారకు. తనెప్పటికీ అర్థంకాడు; తనకు ఇప్పుడు తార అర్థమౌతోంది. తారతో యిక మీద తను ఆశించిన ధార్మిక బంధం అసాధ్యమనే తెలుస్తోంది! తను డబ్బు, సుఖం ఆమెకు యివ్వగలిగినంతమేర ఆమె తనని అంగీకరిస్తుంది, లేకపోతే లేదు!

ఈ క్రొత్త దృష్టితో శ్రీధర్ తనకు సంబంధించిన వాళ్లనందరినీ ఒకసారి పరామర్శించి చూచుకున్నాడు. శేషాద్రిగారూ, చంద్రావతి, పద్మమణి తనవంటివారేననిపించింది. నాగరాజుకూడా తనవంటివాడే కాని అతని మార్గమేమిటో తనకు అంతుపట్టటం లేదు. నైతిక సిద్ధాంతాల్నిగూర్చీ, ఆదర్శాలను గూర్చీ, కాలం మార్పును గురించీ నాగరాజు మాటల్లోని సత్యం తనకు క్రమంగా బోధపడుతోంది. కాని అతని ప్రవర్తనలో చాలభాగం అర్థంకావటం లేదు. మంగమ్మా, ఓబయ్యా ఎలాంటివాళ్లు? వాళ్లకి కావలసింది ఆస్తిమీద, మనుష్యుల మీద అజమాయిషీ! వాళ్లు యాంత్రిక జనతలోవాళ్లు! అన్నయ్యా రుక్మిణమ్మవదినా ఏ కోవకు చెందిన వాళ్లు? సంప్రదాయానికి భంగం రాకుండా వాళ్లు అన్వేషించేవి కూడా సుఖమూ, డబ్బూ! అంతకంటే పేరూ, ప్రతిష్ఠా, మర్యాదా, మన్ననానేమో! వాళ్లూ యాంత్రిక జనతలో భాగమే! అందువల్లే తనను చిన్నప్పటినుంచీ పెంచిన రుక్మిణమ్మ వది

నకూ తన హృదయాన్నీ, దాని ఆవేదననీ, బాధనీ గ్రహించే శక్తి లేదు; ఎంత అభిమానం, సానుభూతి ఉండి ఏం లాభం? సంపాదన, పెళ్లాం, పిల్లలూ, సంసారంలో భార్యా భర్తలూ, వీటిని గురించిన సాంప్రదాయికమైన అలవాట్లతోనే ఆమె తననీ తన వైవాహిక జీవితాన్నీ చూడగలుగుతోంది! తారకు తనమీద ఎందుకు కోపం వచ్చిందో, తను తారమీద ఎందుకు అలిగాడో ఎప్పుడైనా తర్కించి తెలుసుకునే ప్రయత్నం చేసిందా? సంసారంలో ఈ ఒడిదుడుకులు సహజం అనే యాంత్రికమైన భావం తప్ప అంతకు మించిన స్పృహ లేదు! తనకు బాల్యం గడిచాక, ఆమె మాతృపోషణ అవసరం తీరాక, తను అందరు మగవాళ్లలాగే 'విద్యలూ, వ్యవహారాలూ' నేర్చి ఆమెకు అంతకంటె అర్థంకాని పురుషలోకంలో కలిసి పోయాడన్నమాట! ఆమెకు తనలో అర్థమయ్యే భాగం యిప్పటికీ బాల్యానికి సంబంధించిందే—ఆమె అభిమానంకోసం, సాంత్వనంకోసం ఎప్పుడైనా వెళ్తే సానుభూతితో పలకరించి కడుపు నిండా కుడువబెట్టి పంపుతుంది! పోతే అన్నయ్య—లోకంలో పరువు, ప్రతిష్ఠల్నీ, న్యాయాన్నీ గౌరవించే అందరు అన్నయ్యలూ తమ్ముళ్లపట్ల ఏం చేస్తారో అదే చేస్తాడు! అన్నయ్య దృష్టిలోనూ తను వ్యక్తిగా లెక్కకు రాడు !

తనలో యింత ఆలోచనను పురికొల్పి, ఒక క్రొత్త దృష్టికి కారణమైన వ్యాఖ్యానం శ్యామలనుంచీ వచ్చిందే. తనకంటె చిన్నదైన శ్యామల ఏ కోవకు చెందుతుంది? ఆమె జీవిత ప్రాంగణంలో నిల్చుని వుండి, ఏవైపు మొగ్గుతుందో! కాని ఆమె దృక్పథమే వేరుగావుంది. దేన్నీ సీరియస్‌గా తీసుకోకపోవటం! వ్యక్తిత్వానికీ, వక్తిగతమైన సంబంధాలకూ ప్రాముఖ్యత నిచ్చే శేషాద్రిగారు కాని, చంద్రావతి కాని, తను కాని, జీవితాన్ని సీరియస్‌గా తీసుకునేవారే! చంద్రావతి ఒక్కసారి అన్నది: "జీవితాన్ని యింత సీరియస్‌గా తీసుకోవటంవల్లే చేతగానివాళ్లమై బాధపడుతున్నాం. మనం సెంటిమెంటల్ క్రీచర్స్" అని. కాని అలా అనటం యాంత్రికంగా వుంటే ఈ బాధ తప్పును గదా అనే భావంతో విసుగ్గా అన్నది. అంతేకాని తేలిగ్గా నవ్వేస్తూనే, విశ్వాసాల అగ్ని పరీక్షకు నిలవకుండానే పట్టు తప్పిపోయిన జీవితం మీద అధికారాన్నీ, వ్యక్తిత్వనిష్ఠమైన విలువల్నీ సాధించవచ్చునని ఆమె అభిప్రాయం కాదు!.....వ్యక్తిత్వాన్నీ, వ్యక్తిగతమైన సంబంధాల్నీ అన్వేషిస్తూనే తేలిగ్గా నవ్వేస్తూ ఉండటం ఎందువల్ల సాధ్యం కాకూడదూ? బహుశా సాధ్యమేనేమో!

శ్రీధర్ భావనలో ఒక క్రొత్తయుగం మెరిసింది—క్రమంగా ప్రస్ఫుటమౌతున్న ఈ క్రొత్త యుగంలో రెండు తరహాల మనుష్యులూ ఉంటారు—వ్యక్తిత్వాన్నీ స్వయం నిర్ణయాన్నీ ప్రధానంగా అన్వేషించే మైనారిటీ, అలవాట్ల ప్రకారం ఆటొమాటిక్‌గా సుఖం, డబ్బు, అజమాయిషీ అన్వేషించే మెజారిటీ. కాని అందరూ తేలిగ్గా నవ్వేస్తూ ఉంటారు. దేన్ని గురించీ సీరియస్‌గా బరువుగా మాట్లాడరు!

ఇది కేవలం ఊహాగానం కల్పనకాదు అన్పించింది శ్రీధర్‌కు. 1948 లో నాగరాజు ఆహ్వానించగా క్రిస్టియన్ కాలేజి హాస్టలు ఉత్సవానికి వెళ్లిన సాయంత్రం కనిపించిన సిసీలియావంటి వారే ఈ క్రొత్తయుగపు వైతాళికులు అనితోచింది. నాగరాజుతో ప్రేమ కలాపం నడిపినన్నాళ్లూ నడిపి భ్రూణహత్యకు సిద్ధపడిన ఆ అమ్మాయి భయంతో బాధతో ఆవేదనతో ఆ పని చెయ్యలేదు! తేలిగ్గానే అందుకు సిద్ధమైంది! అంతేకాదు, నాగరాజుతో వ్యవహారానికి స్వస్తిచెప్పి వేరొక యువకునితో వివాహాని క్కూడా చప్పున ఒప్పేసుకుంది! అంటే నాగరాజుతో ప్రణయాన్ని ఆమె ఎంత తేలిగ్గా తీసుకున్నట్లు! ఇది దృక్పథంలోనే మార్పు......యాంత్రికంగా శరీర సుఖాన్నీ, కాలక్షేపాన్నీ ఆమె అన్వేషించిందనే అనుకున్నా, ఆమె అందులో పరిస్థితులదృష్ట్యా వచ్చిన మార్పుని ఎంత తేలిగ్గా అంగీకరించింది! దృక్పథానికి సిద్ధాంతరూపం కల్పించిన నాగరాజు కూడా అంత తేలిగ్గా అంగీకరించలేకపోయాడు!

తర్వాత యిటీవల సబ్—కలెక్టరుగా వచ్చిన తమిళుడు తనకు లయోలా కాలేజిలో పూర్వ పరిచితుడు శివరామన్‌తో మాట్లాడి రావటానికి వెళ్తే అతడు టీ యిచ్చి కబుర్లు చెబుతూ ఢిల్లీలో ఒళ్లమ్ముకునే స్త్రీల బజారునుగూర్చి హాస్య స్ఫోరకంగా వర్ణించిన వైనమూ శ్రీధర్‌కు గుర్తు వచ్చింది. ఆ మిత్రుడు స్వానుభవాలే, జంకూ, గొంకూ లేకుండా, తేలిగ్గా నవ్వుతూ చెప్పేశాడు! అతనికి వ్యక్తిగతమైన సంస్కారంలేదనీ, కేవలం విషయ లాలసుడైన యాంత్రిక మానవుడనీ చెప్పటానికి ఆధారం లేదు. తనకు అతనితో ఎక్కువ పరిచయం లేదు. కాని అతని బుద్ధి కుశలతమీదా వ్యక్తిత్వంమీదా నమ్మకం వుంది. ఈ ఆఫీసరూ, నాగరాజూ ఒక కోవకు చెందినవారే అయివుంటారనటం అసంభావ్యమైన విషయమూ కాదు!

ఒక 'సెక్స్' విషయంలోనే కాదు. సులువుగా డబ్బు సంపాయిస్తున్నవారిలో, రాచకీయాల్లో డబ్బునూ, పలుకుబడినీ ఖర్చు పెడుతున్నవారిలో యిటువంటి తేలిక దృష్టే వ్యక్తమౌతోంది. ఇది క్రొత్త యుగంకాక మరేమిటీ? ఇది పూర్తిగా యాంత్రిక యుగం. వీరిలో సంస్కారం, వ్యక్తిత్వం, స్వయం నిర్ణయశక్తి, జీవితంమీద అధికారం కలిగి ఉన్నవాళ్లు బొత్తిగా లేరని చెప్పటానికీ వీల్లేదు! చాలమంది యాంత్రికంగా, అదృష్టం అనే వీచికమీద పైకి విసిరి వేయబడుతూ ఉండవచ్చు కాని వారిలో వ్యక్తిత్వం కలవాళ్లూ కొందరు తప్పక ఉంటూనే ఉన్నారు; వారి జీవన దృక్పథం యింకా సిద్ధాంతీకరింపబడలేదు గాని!

ఆలోచనలు యింతదూరం సాగేటప్పటికి, శ్రీధర్‌కు ఆరోజు తార వెళ్లిపోవటంతో ఏర్పడిన హృదయావేదన మబ్బు విడిచినట్లు విరిసిపోయింది. జీవితాన్నీ, తన చుట్టూవున్న మనుష్యుల్నీ తనూ తేలిగ్గా నవ్వుకుంటూనే అవలోకించగలడన్న ధీమా కలిగింది. ఇది మానవులమీద ఏవగింపు కాదు; నిర్లక్ష్యం, అపహాస్యం కాదు; వాళ్లని క్రొత్తగా అర్థం చేసుకోవటంవల్లా, జీవితాన్ని క్రొత్తగా దర్శించటంవల్లా కలిగిన ఉత్సాహం, ఆనందం!

*  *  *

శ్రీధర్‌లో వెల్లివిరిసిన నూతనోత్సాహం నాటకాల్లో అభినివేశంగా వ్యక్తమౌతూ వచ్చింది. స్కూలు నాటకాలు వేయించటంలో శ్రీధర్ పొందిన మెప్పు క్రమంగా అతణ్ణి ఒక చిన్న

నాటక సమాజానికి కార్యదర్శిని చేసింది. ఈ సమాజంలో సభ్యులు టీచర్లు, లాయర్లు, స్కూలు కాలేజి విద్యార్థులు, పద్మమణి మరియిద్దరు స్త్రీలు కూడా చేరారు. శ్రీధర్ నాటక కళలో అనుభవం గడిస్తున్నాడు.

శ్యామల వివాహం ఫిబ్రవరి 1954 లో జరిగింది. శ్రీధర్ బందరువెళ్లి తానవా తీసుకు వచ్చాడు. అంతవరకూ ఆమె ఉత్తరాలైతే రాస్తూ ఉందిగాని మదనపల్లికి తిరిగి రాలేదు. ఈసారి శ్రీధర్ ఆ విషయమై పంతగించలేదు.

ఓబయ్య మంగమ్మలు కూడా తిరుపతిలో పెళ్లికి హాజరవటం ఒక విశేషం. పాత పగలన్నీ విస్మరించినట్లే వాళ్లు మొదట్లో ప్రవర్తించారు. కాని శ్యామలకు ఆరువేలు కట్నమూ, నగలూ చదివించేటప్పటికి ఓబయ్య నలుగురిలోనూ అనేశాడు 'ఇది తమ్ముడికి చూపించకుండా దాచిపెట్టుకున్న డబ్బు' అని. శ్రీధర్ వూరుకొమ్మని కటువుగా మందలించాడు. అంతటితో కోపంవచ్చి మంగమ్మా, ఓబయ్యా పెళ్లింటినుంచీ బయటికి నడిచారు. శ్రీధర్ వెళ్లి ఎంత బతిమాలినా ఆగకుండా బస్సెక్కి వచ్చేశారు.

తార గొలుసు, ఓబయ్య అవసరానికి తాకట్టు పెట్టుకొన్న గొలుసు, వెనక్కి తిరిగిరాలేదు. ఓబయ్య తను చేస్తున్న వ్యవసాయంలో శ్రీధర్‌కు ఎప్పటి కప్పుడు తిండిగింజలు పంపటం తప్ప లెక్కగా ఏమీ తేల్చటంలేదు. ఇది శ్రీధర్‌కు అసంతృప్తి కలిగిస్తోంది. వచ్చిన ఫలసాయంలో చాల భాగం ఓబయ్య తనకున్న ఋణాలకు వడ్డీలు కట్టడంలో తన అనవసర ప్రయాణాలలో, వ్యాసకాలలో ఖర్చు పెట్టేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కాని ఓబయ్యను నిక్కచ్చిగా ఆ విషయమై ప్రశ్నించలేకపోతున్నాడు శ్రీధర్.

పెళ్లిలో గొడవచేసి వచ్చేశాక శ్రీధర్ పంగమ్మత్తతో అన్నాడొకరోజు. "మామకు వయస్సు పైబడుతోంది. నువ్వా పాలేర్ల సంగతి చూడలేవు. పొలం మొత్తం ఎవరికైనా కౌలుకిస్తే బాగుంటుందేమో!"

మంగమ్మ విరుచుకుపడ్డది "నువ్వు బడిపంతులివయ్యావు అని నీలాగే అందరూ పుస్తకాలు చేత్తో పట్టుకుని కుర్చీమీద కూర్చుంటే జరుగుతుందనుకుంటున్నావా సిరీ! అయ్యవారివైతే అయ్యావుగాని నువ్వు మాకేం పాఠాలు చెప్పనక్కరలేదు! చచ్చేదాకా వోపికున్నంతవరకూ మేము చేసేది చేస్తుండాల్సిందే! మా బతుకు మాదే! తప్పుతుందా? పెళ్లాం పిల్లలతో ఇక్కడికొచ్చి ఉండరా నా తండ్రీ అని బతిమలాడితే నీకు లేదుగాని మమ్మల్ని ముసలికాలంలో సుఖపెట్టాలనుకుని ఈ సలహా ఇస్తున్నావా అల్లుడా? ఆహా! నువ్వు ఆవులూ, ఎద్దులూ, పేడా, గంజరమూఅంటే ఆమడదూరంలో మసులుతావుగాని 'ఏం, ఈసారి పంట తక్కువైందేం?' అని అడగటం మానుకుంటావా? సొంతంగా చేస్తుంటేనే యిట్లా వుంది యీ సంసారం ఆకుకి అందకుండా పోకకి పొందకుండా. కౌలుకిస్తే ఎసట్లోకి బియ్యం ఉండవు నాయనా!"

తన సలహాలోని అంతరార్థం ఆమె యిట్టేపట్టేసిందనీ, అందుకు బదులుగా పరిష్కారమార్గం కూడా—తను కుటుంబంతోవెళ్లి ఆమె యింట్లో ఉండటం— సూచిస్తోందనీ గ్రహించాడు శ్రీధర్. తను వ్రాస్తున్న నాటకంలో మంగమ్మని, ఓబయ్యనీ పాత్రలుగా ప్రవేశపెట్టి నవ్వేయటంకంటె మరేం చేయాలో తెలీలేదు అతనికి!

తార తన గొలుసుని గూర్చి గొడవ పెట్టింది. తన పుట్టింట్లో ఆ గొలుసు లేకపోవటాన్నిగూర్చి తను చాలా కించపడవలసి వచ్చిందనీ, ఏమైనాసరే అది తనకు తిరిగి వచ్చేట్టు చూడాలనీ పట్టుబట్టింది. శ్రీధర్ ఒక కోమటి దగ్గర ఋణం చేసి ఓబయ్యకు తీసుకువెళ్ళి ఆ నగ వదిలించి తెచ్చి తారకు యిచ్చేశాడు. తార తన కోరిక యింత సులువుగా, శీఘ్రంగా నెరవేరుతుందనుకోలేదు. ఆమె శ్రీధర్‌లో వచ్చిన మార్పుకు సంతోషించింది.

కాని శ్రీధర్ నాటకాలమీద కాలవ్యయం చేస్తూండటం ఆమెకు కష్టంగావుంది. ఒకవైపు భర్త నటుడుగా నలుగురిలో పేరు రావటం యిష్టంగానే ఉన్నా, భర్తతో కలిసి పద్మమణి నటిస్తున్న నాటకం చూచాక ఆమెలో ఈర్ష్య రేకెత్తింది. దీనికితోడు శ్రీధర్ తెస్తున్న జీతం చాలకపోవటం, తన అక్కయ్య సంసారం చూచివచ్చిన తర్వాత తారకు చాల కంటకమైపోయింది......

శ్రీధర్‌కూ, పద్మమణికీగల ప్రత్యేక సంబంధం నాటక సమాజంలో అందరి మనస్సుల్లోనూ రూఢి అయిపోయింది. సంఘ నియమాలు ఆమోదించని సంబంధమే అయినా శ్రీధర్ మంచితనమూ, సామర్థ్యమూ, అందరియెడల అతనుచూపే స్నేహభావమూ, పద్మమణి హుందాతనమూ, మాట పొదుపరితనమూ వారిద్దరికీ నాటక సమాజ సభ్యుల్లో గౌరవ మర్యాదల్ని కలిగించింది. నాటక సమాజం 1955 లో రాష్ట్ర నాటక కళా పరిషత్తు పోటీల్లో పాల్గొని, ప్రదర్శించిన నాటకానికి రెండవ బహుమతి తెచ్చుకున్నది. శ్రీధర్‌కాని పద్మమణికాని తమ ప్రావీణ్యాన్నిగూర్చి గొప్పలు పోలేదు; ప్రధాన భూమికలు నిర్వహించటంలో పాత్ర రూప గుణ శీలాదులనుబట్టి అర్హులైన మిగతా సభ్యులకు గూడా సదవకాశాలు లభిస్తూండటం మూలాన పద్మమణి, శ్రీధర్ ఎవరి ఈర్ష్యాసూయలకూ పాలుకాలేదు. పైగా వారిద్దరి అన్యోన్యతా విశిష్టమైన వైయక్తికమైన అనుబంధంగా అంగీకార్యమే అవుతూ వచ్చింది.

నాటక కళలో అభినివేశం కల్గించుకున్న తర్వాత శ్రీధర్ మానసికానుభూతి మానవ ప్రకృతిలోని వైవిధ్యాన్నీ, మానవ జీవితంలోని వింతనూ, విషాదాన్నీ, రసమార్గంలో సంతరించుకొని తత్త్వ సంస్పర్శతో పరిపక్వమౌతూ వచ్చింది. ఒకటి రెండు నాటకాల్లో పద్మమణితో ప్రేక్షకుల ఎదుట రంగస్థలంమీద నటించిన అనుభవం తర్వాత, ఏకాంతంలో కూడా ప్రసిద్ధ నాటక సమావేశాల్ని ఆమెతో కలిసి నటిస్తూ రసానుభూతి పొందాడు. ఆమె చిత్రాంగి తను సారంగధరుడు; తను నలుడు ఆమె దమయంతి; ఆమె చింతామణి తను బిల్వమంగళుడు—అలాగే కథల్లో సన్నివేశాల్లో తమ కథకాని కథ, విషాదం కాని విషాదం, తమ వైరాగ్యంకాని వైరాగ్యం తమ అనుబంధం కాని అనుబంధం తమదై తమ ప్రత్యేకతను లయింపజేసి, సంయోగ

వియోగాల్లో సుఖ దుఃఖాల్లో, అనంతమైన జీవన లీలలో ఆమే తనూ ప్రకృతి పురుషులుగా నిత్య నూతనులుగా ఆత్మ దర్శనం పొందటం—అది ఒక సాధనగా తపస్సుగా అతనిలో రూపొందింది. కేవలం శారీరక సంయోగం యివ్వలేని రూపం అతని 'స్వప్నానికి' ఈ విధమైన సాధన ద్వారా లభించింది. ఇప్పుడు వారిద్దరిమధ్యా పరిధుల్లేవు. శరీరమూ, మనస్సూ, ఆత్మా అన్న విభేదాల్లేవు. ఎప్పుడు కలుసుకున్నా, వాళ్లకు వాళ్లుగా ఉండటం అంటేనే, ఒక మాటలో, ఒక చిరునవ్వులో, ఒక చూపులో, ఒక స్పర్శలో, ఒక ముద్దులో, పరస్పరతలో లభించే అద్వైతమైన అస్తిత్వ సత్యమే కనిపిస్తోంది—ఒకరు వినా మరొకరు లేరు!

పిల్లల జబ్బులూ, తార రుసరుసలూ, ట్యూషన్లూ, నిత్యావసరాలూ, పాలాల్ని పండించుకుంటూ తనకు రావలసిన ఫలసాయాన్ని ముట్టజెప్పని ఓబయ్య మంగమ్మా తరచు మనస్సుకి రాపిడి కలిగిస్తూనేవున్నా, ఈ అపశ్రుతులు శ్రీధర్‌లోని దివ్య సంగీతాన్ని స్పృశించలేకపోతున్నాయి.

కాలం గడుస్తోంది.

## 22

మాయ, పద్మమణి కొమార్తె తొమ్మిదేళ్ల అమ్మాయి, డిఫ్తీరియా జ్వరంతో ఆకస్మికంగా చనిపోయింది. డాక్టరు అసమర్థతవల్ల మొట్ట మొదటే రోగ నిదానం సరిగా జరగలేదు. కారణం ఏమైతేనేం, మాయ పోవటం పద్మమణిలో మార్పు తెచ్చింది. చావు పుట్టుకల్ని గురించి వేదాంత వాక్యాలు పలకనచ్చుగాని, మనస్సుమీద కొన్ని సంఘటనలు చూపే ప్రభావం మాత్రం తీసివెయ్యటానికి వీల్లేనిది. ఆ ప్రభావానికి హేతుబద్ధమైన వివరణ ఏమీ ఉండదు!

"రాత్రంతా కలలే శ్రీధర్! అది నాతో మాట్లాడుతూ వుంది. నేను ముభావంగావుంటే ముఖం తన వైపుకు చేత్తో లాక్కుంటూ, 'అమ్మా, కోపమెందుకే?' అంటూ చెబుతూ వుంది—స్కూలు సంగతులు పాఠాల సంగతులు, దాని స్నేహితుల సంగతులు—నేను నోరు విప్పలేక పోతున్నాను. 'అమ్మా, నేను పెద్దయ్యాక డాక్టర్‌కి చదివి గొప్ప లేడీ డాక్టర్నవుతాను. అప్పుడు నీకేమో మందులు వూరికేనే యిస్తాను కదా! అంటోంది......మీకు గుర్తుందా జ్వరంలో డాక్టర్ని గురించి అది ఎన్ని ప్రశ్నలు వేసింది! దాన్ని సరియైన డాక్టరుకి చూపించలేకపోయిన నిర్భాగ్యురాల్ని నేను! '......తుడుచుకుంటూంటే ఆగకుండా వచ్చే కన్నీటితో పైట చెరగు పూర్తిగా తడిసిపోయేది......

మొదట నెలరోజులు సెలవు. తర్వాత మరో నెల రోజులు పొడిగింపు......పద్మమణి శోకభారాన్ని తేలిక చెయ్యటానికి శ్రీధర్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. కాని అతను చూపించే ఆప్యాయతే ఆమెను కరగించివేస్తుంది.

అతని గుండెల్లో తల ఆన్చి "ఏమండీ, నేను మళ్లీ మాయను చూడలేనా? నిజంగానే చూడలేనంటారా?......మాయ నాకు కలల్లో కనిపిస్తుందే, మాయ నాక్కావాలి, మాయను నాకు తెచ్చిపెట్టలేరా? అంటుంది తీవ్రంగా పిచ్చిగా. "పద్మా! ఈసారి మాయ నీ కోసమేగాదు, నా కోసం కూడా వస్తుంది. తప్పకుండా మళ్లీ నీకు జన్మిస్తుంది!" అంటాడు శ్రీధర్..

"ఏమండీ, కలకూ, నిజానికి ఏమిటీ భేదం? మాయ నాక్కనిపించని యీ నిజం కల కాకూడదా?......మీరెవరు ? మీరు మాత్రం నా కలలోని వారు కారా?......అవునండీ, నా కిప్పుడర్థమవుతోంది. నా కలని, ఆ ఆనందాన్నీ—నాకు బాగా తెలీటంలేదనే—దేవుడు యిలా రెండు భాగాలుగా చేశాడు. మీరున్న కలని, మాయవుండే కలనీ వేరు చేశాడు—మేలుకున్నప్పుడు మిమ్మల్ని, నిద్రలో దాన్నీ చూస్తూ ఉండమని! కాదంటారా?" ఆమె యిలా మాట్లాడుతూవుంటే ఆమెకు నిజంగా పిచ్చెత్తిపోతుందేమోనని భయంవేస్తుంది శ్రీధర్‌కు......

కాని ఒక్కొక్కసారి ఆమె మాటలు ఎంతో అర్థస్ఫూర్తినిస్తుంటాయి. "శ్రీధర్! దానికి 'మాయ' అని పేరు పెట్టటంలోనే కాదు, దాని తండ్రి నాకు ఎన్నోసార్లు వేదాంతాన్ని బోధించాలని ప్రయత్నం చేశారు. కాని నేను నేర్చుకోలేదు! ఆయన మాటల్ని బళ్లో టీచరు మాటల్ని పిల్లలు ఖాతరు చేసినట్లు, కొంత గౌరవంతో, కొంత భయంతో చెవిలో వేసుకునేదాన్నేకాని అవేవీ నా హృదయాన్ని మాత్రం స్పృశించలేదు! ఎప్పుడూ నవ్వుకునేదాన్ని నాలో నేనే ఎవరిక్కావాలి యీ ఆయన వేదాంతం అని! ఆయన బట్టకి రంగు వేసుకుంటాడని, అన్నేళ్లు వచ్చినా పాండ్స్‌క్రీమ్ వాడుతాడనీ నవ్వేదాన్ని! ఆనాటి నా అల్లరికి యిలా శాస్తి చెయ్యటానికే యీ పిల్లని నా గుండెకు గ్రుచ్చిపోయారనిపిస్తుంది. ఈ ముల్లు తియ్యటం మీకు చేతకాదా శ్రీధర్?" అని లోతుగా, బాధగా ప్రశ్నిస్తుంది పద్మమణి.

"శ్రీధర్, నాకు మాయకాదు, అంతకంటె మంచి కూతురు కావాలి. అప్పుడుకాని మాయను మరచిపోలేను......" అంటూ మాతృత్వ కాంక్షను వ్యక్తం చేస్తుంది......

"నాలో ఏదో లోపం ఉంది. నేను దాన్ని సరిగ్గా చూడలేదు కాబోలు! ఏదీ నా ఉద్యోగం, నా చదువూ అని ఎంతకాలం వృధా చేశాను! ఆ కాలమంతా అది నాకోసం ఎదురు చూచి, ఎదురుచూచి......విసిగిపోయి.......వెళ్లిపోయింది......" ఆమె కంఠం రుద్ధమైపోతుంది. తర్వాత ఎడతెగని కన్నీళ్లు!

ఈరోజుల్లో శ్రీధర్ ఎక్కువకాలం పద్మమణి యింట్లోనే గడుపుతున్నాడు. అతను రాత్రిళ్లు భోజనానికి ఉంటానని చెబితేతప్ప ఆమె భోజనం మానేస్తుంది. తన తిండి విషయం ఆలోచించదు. అందువల్ల తప్పనిసరిగా చాలసార్లు శ్రీధర్ అక్కడే గడపవలసి వస్తోంది. ఇంటికి వెడుతూ వస్తూవున్నా, ప్రొద్దుటిపూట ట్యూషన్లూ, తర్వాత స్కూలూ, మిగిలిన వ్యవధి పద్మమణి యింట్లో గడుపుతూ ఉండటంవల్ల తారకూ, పిల్లలకూ అతడు ఈ రెండు నెలల్లో బాగా దూరమైపోయాడు.

తార ఊరుకోలేదు. వెళ్లి ఓబయ్య, మంగమ్మలతో చెప్పింది. వాళ్లు ఈ విషయంలో ఏమీ కలుగజేసుకోలేదు. చివరకువెళ్లి రుక్మిణమ్మతో కూడా చెప్పింది. రుక్మిణమ్మ ఓర్పూ, సహనమూ బోధించింది. శ్రీధర్‌ను పిలిపించి తను కనుక్కుంటూ

నని చెప్పింది. చివరకు ఓర్పు నశించి ఒక ఆదివారం ట్యూషన్ కుర్రవాళ్లు వెళ్లిపోయాక నిలవదీసి అడిగింది తార—

"ఏమండీ, మీకు ఈ యిల్లంటే ట్యూషన్ చెప్పటానికి తప్ప మరెందుకూ పనికిరాని సత్రంగా కనిపిస్తోందా? ఇది దాని యింట్లోనే సాగిస్తే సరిపోతుంది కదా! దీనికిమాత్రం లోకాన్నిచూచి భయపడటం ఎందుకు?"

"నేను లోకాన్నిచూచి భయపడటంలేదే!"

"లోకాన్ని చూచి భయపడరు. మరిదేన్నిచూచీ భయపడరు!! అయితే మీకు నీతీ, ధర్మం, మట్టూ, మర్యాద అంటూ ఏమీ లేదా? పెళ్లాం పిల్లలంటే మీకేమీ కారన్నమాట! ఏమిటండీ మీరింత బరితెగించిపోయారు? మేము ఏం కావాలని మీ అభిప్రాయం?" తార కంఠం హెచ్చు స్థాయిలో వుంది.

"ఇప్పుడేం జరిగిందనీ, ఏం వచ్చిందనీ యీ ఆక్రోశం? ఆమె కూతురు చనిపోతే, ఒకటే తపిస్తోంది; ఒంటిపాటు, నిర్లక్ష్యంచేస్తే పిచ్చెత్తుతుందో, ఆత్మహత్య చేసుకుంటుందో అనే స్థితి. నేను లేకపోతే ఉపశమనంలేదు. అందుకే ఉండవలసి వస్తోంది......"

"లోకంలో ఎవరికీ పిల్లలు చావటంలేదా? దీనికూతురే అపురూపంగా చచ్చిందా? అన్నీ వేషాలు. నాటకాల మనుష్యులకి అన్నీ నాటకాలే! దానికి ఎన్ని గుండెలు! మీమీద దానికి ఏం అధికారం ఉందని యిలా చేస్తోంది! ఉంచుకుంటే ఉంచుకున్నారు గాని ప్రొద్దస్తమానం దాని కాళ్ల దగ్గరే పడివుండే ఖర్మ ఏమిటి? మీకు సిగ్గూ, ఎగ్గూ లేదా? మాంసం తింటారని బొమికెలు మెడగట్టుకుని తిరుగుతారటండీ? ఏమిటి మీ పిచ్చి!'

"నేను చేస్తున్నదాంట్లో సిగ్గు పడాల్సిన అవసరమేమీ నాకు కనిపించటంలేదు! అధికారం ఎవరిమీద ఎవరికి ఉంటుంది? ఎలా వస్తుంది? తాళి కట్టించుకోగానే, మంత్రాలు చదవగానే వచ్చిన హక్కూ, అధికారం, కేవలం లాంఛనం, అంతకంటె ప్రధానమైంది మనిషికీ మనిషికీ మధ్య ఉండే అనుబంధం; దానికి అధికారంకాదు, అర్హత సంపాయించాలి! నేను నీకేమీ అన్యాయం చెయ్యలేదే; నిన్ను కాదనలేదే. వేశ్యాలోలత్వంతో తాగి వచ్చి నిన్ను రోజూ చావ బాదటంలేదే! నీకూ నాకూ వున్న సంబంధం ఏమిటో దాని విలువ దానికీవుంది. అంతకంటె ఎక్కువా తక్కువా ఎంత కోరుకున్నా ఎంత గింజుకున్నా సాధ్యంకాదు! నాకు అలాంటి భ్రమలు చాలనాళ్లై వదలిపోయాయి!"

"ఏమిటి మీరు చేస్తున్న నిర్వాకం? ఇప్పుడు మీరు వెళ్తున్న దెవరో వేశ్యకాక పతివ్రతా? దానికి ఎన్నో మొగుడు మీరు? మీకు తెలియకుండా చాటుగా యింకెంతమందో! మీరు సంపాయిస్తున్న వేలకూ, ఇక్కడున్న నౌకర్లకూ, చాకర్లకూ, మీరు పెడుతున్న సుఖానికీ నేను మురిసిపోతూ కూచోవాలని మీ ఉద్దేశమా? ఉండే జమీందార్లు కూడా యిట్లా మాట్లాడరే! ఎముకలు, అరిగేటట్టు చాకిరీచేస్తూ తిండికీ, గుడ్డకూ మొహంవాచి, చాలీ చాలని ఈ సంసారం వెళ్లదీస్తున్నది ఎందుకని? ఏం, ఎందుకు చెయ్యాలి? మీకూ, మీ పిల్లలకూ?? మీ ముష్టితిండికోసం కూచోలేదు ఎవళ్లూ యిక్కడ! ఎప్పటికైనా మీరు దానికి వస్తారనే ఓర్పుతో ఉన్నాను......... ధర్మంతో ఉన్నాను, శీలంతో ఉన్నాను. మీరు తాగిరావటం లేదని నేను సంతోషించాలా? ఓ యబ్బో! యిదన్నమాట మీ అంతర్యం? తాగిరండి, మీకే తెలుస్తుంది! తార అంటే మీ కాలికింద చెప్పు అనుకుంటున్నారేమిటి? అసలు యింతకాలం మిమ్మల్ని ఉపేక్షించటం నాదే తప్పు! మీ నాటకాలూ, మీ తిరుగుళ్లూ మీ బెదిరింపులూ ఏమిటో తేలిపోవాల్సిందే! చెప్పండి, మీకు అది కావాలా నేను కావాలా? ఇకనుంచీ మీరు ఈ గడపదాటి దాని యింట్లో అడుగుపెట్టారంటే నే నిక్కడ ఉండను. మీరూ నా ముఖం చూడక్కరలేదు! ఏ సంగతీ మీరే నిశ్చయించుకోండి! ......తను అనదలచుకున్న నాలుగు మాటలూ స్పష్టంగా అనేసి లోపలికి వెళ్లిపోయింది తార.

ఇది తార వ్యక్తిత్వానికి రుజువా?

తార తనని ఆంక్ష పెట్టుతోంది—వ్యక్తిగా కాదు భార్యగా ఈ విభేదం సాధ్యమా? వివాహ వ్యవస్థ, సంప్రదాయం, సంఘం ఆమెకు ప్రసాదించిన అధికారంతో ఆమె శాసిస్తోంది. చలపయ్యకు పార్టీ సభ్యత్వం ప్రసాదించే అధికారంవంటిదే యిదీ; కాని దీనికున్న సాంప్రదాయికమైన, బలవత్తరమైన మద్దతు రాజకీయపార్టీల్లో యింకా రాలేదు. అంతే భేదం! రెండింటిలోనూ సాముదాయకమైన ఏర్పాట్లకు, అలవాట్లకు, విశ్వాసాలకు ప్రాధాన్యం, వ్యక్తిత్వం లేనివాళ్లకు ఆ లోపం తీర్చే యంత్రాంగం యిదంతా తార స్వచ్ఛందంగా వ్యక్తిగా తనతో సంబంధాన్ని వాంఛిస్తున్నట్లయితే, తన ప్రవర్తననీ, తన అంతర్యాన్నీ యింతకంటె మెరుగ్గా, సవ్యంగా అర్థం చేసుకోవాలి. అప్పుడామెకు పద్మమణి కూడా అర్థం అవుతుంది! అది ఏనాటికైనా సాధ్యమో కాదో ఎవరు చెప్పగలరు!

శ్రీధర్ పద్మమణి యింటికి వెళ్లిపోయాడు.

మరుసటిరోజు ప్రొద్దున ట్యూషన్ చెప్పడానికి ఇంటికి వచ్చాడు. కూతురు స్వరాజ్యం వచ్చి "నాన్నా, మేము తాతయ్యవాళ్ల వూరువెడుతున్నాం యివ్వాళ." అని చెప్పింది. "అలాగే తొందరగా తిరిగిరండి." అన్నాడు శ్రీధర్. శ్రీధర్ ఆరోజుభోజనం చెయ్యకుండానే స్కూలికి వెళ్లి పోయాడు.

ఓబయ్య శ్రీధర్ని కలుసుకోవటానికి స్కూలు దగ్గరకు వచ్చాడు "అదేమిటి తార వెళ్లిపోతానంటూఉంది! పెద్దవాళ్లం మేముండీ నీకు బుద్ధి చెప్పలేక పొయ్యామని ఏడుస్తోంది! ఏమిటి నీపిచ్చి ఇంటికేరావటం లేదట! ఆ మనిషిమీద యిష్టం ఉంటే ఎప్పుడైనా చాటుగా వెళ్లివస్తూ ఉండు. అంతేగాని దానితో కాపురంపెట్టేస్తానంటే ఎట్లాకుదురుతుంది.? నలుగురిలో నీ మంచీ మర్యాదా చూచుకో నక్కరలేదా? నువ్వొచ్చి తారకు నచ్చజెప్పి ఏదో సర్దుకుపోవాలి గాని, తెగేదాకా లాగితే లాభం లేదు.! నీమంచికే చెబుతున్నా, పోదాంరా" అని పిలిచాడు. బలవంతంగా చెయ్యి పట్టిలాగాడు.

(సశేషం)